నవశక్తి

Vol. 2, no. 32

(Jul. 26, 1939)

బెజవాడ, 1939

Record no. 682

Navaśakti

Vol. 2, no. 32

(Jul. 26, 1939)

Bejavāḍa, 1939

Record no. 682

Regd. No. M. 3824

నవశక్తి

సం॥ చందా రు 3

విడి ప్రతి అణా

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారపత్రిక

సంపుటం 2 | బుధవారం 26-7-39 బెజవాడ | సంచిక 32

కార్మిక సేవలో ప్రాణాలు విడిచిన హజారాసింగు

కంభంపాటి సత్యనారాయణ, ఎం. ఏ.

1933 వ సంవత్సరంలో అవి ఆఖరు రోజులు. బళ్ళారి జైలు "ఖూనీకొట్టు"లో చెరి ఒక సెల్‌లోను ఆ యువకు లిద్దరూ ఒక అర్థ రాత్రివేళ పచారు చేస్తున్నారు. రాత్రి దాదాపు ఒంటి గంట అయింది వరండాలో ఒక వార్డరు గాఢంగా నిద్రపోతున్నాడు. "జేమ్సు" అనే ఆంగ్లో ఇండియన్ వార్డరు ఆ వరండా ప్రవేశించి, మారు తాళం చెవితో రెండు కొట్లూ తెరిచాడు. హజారా, బంతా సింగు లిద్దరూ యీవలకు వచ్చారు. ప్రక్కనే ఉన్న ఎలెక్ట్రిక్ దీపాన్ని "జేమ్సు" యిదివరకే ఆర్పివేశాడు.

అంతా నిశ్శబ్దంగా ఉంది. చుట్టుపక్కల కారు చీకటి క్రమ్ముకొని ఉంది.

"ఖూనీకొట్టు"కు అనుకొనిఉన్న జైలుగోడ మీద తాడు ఒకటి వ్రేల్లాడుతోంది. ఆ రోజునే "జేమ్సు"కు యిచ్చిన 20 రూపాయల జీతం వారిద్దరికీ యిచ్చివేశాడు. అదికాక, వారం రోజులు తినడానికి సరిపోయే గోధుమ పిండి, పంచదార మూటకట్టి యిచ్చాడు. తాను వాడుకొనే రెండు బట్టల జతలు, ఒక మంగలి కత్తి యిచ్చాడు.

హజారా, బంతాసింగుకు తాడుసహాయంతో గోడయెక్కి కిందికి దూకారు. వెంటనే గడ్డం తీసేసి, సాధారణ ప్రయాణీకులమాదిరిగా సమీపంలోనే ఉన్న హంపీ విజయనగరం పారిపోయారు.

ఇది జరిగిన రెండు గంటలకు ఒక కొత్త వార్డరు డ్యూటీచూర్చడానికి "ఖూనీకొట్టు"కు వచ్చాడు. రెండు కొట్టులలోనూ చూచాడు. ఖైదీలిద్దరూ ఉన్నట్లే అతనికి కనపడింది. తలకింద, కాళ్ళకింద గుడ్డలు, మూత్రపుకుండ, వగైరా వస్తువులుపెట్టి పైన కంబళిపరచి వెళ్లిపోయారు వారు. అవిచూచి వార్డరు ఖైదీలని నమ్మి మామూలుపద్ధతిగానే కావలాకాచాడు.

తెల్లవారింది. జైలుఅంతా వీరి పలాయన వార్త వ్యాపించిపోయింది. మాకొట్లు, ఇతర ఖైదీలకొట్లు, 9 గంటల వరకు తెరవలేదు. తెరిచిన తరువాత వృత్తాంతం అంతా తెలుసుకున్నాం. ఆతాలినాడే "జేమ్సు" నాకొట్టువద్దకు వచ్చి, తాసీవిధంగా చేయబోతున్నానని రహస్యంగా చెప్పాడు. కాని నేను నమ్మలేదు ఆంగ్లోఇండియన్ ఏమిటి, టెర్రరిస్టు ఖైదీలను విడిపించడం ఏమిటి, అనుకున్నాను. కాని మాఅందరినీ దిగ్భ్రమనుకొల్పే పని ఆ ఆంగ్లో ఇండియన్ చేశాడు.

"జేమ్సు" వగైరా ముగ్గురు వార్డర్లను పోలీసులు ఎరస్టుచేశారు. తానే దీనికి పూర్తిగా బాధ్యుడనని. పోలీసు సూపరింటెండెంటుతో జరిగిన విషయం అంతా పూసగుచ్చినట్లు చెప్పివేశాడు. తరువాత కోర్టు విచారణ. "జేమ్సు"కు 7 సంవత్సరాల కఠినశిక్ష విధించాడు జడ్జి.

ఆ యిద్దరిలో కామ్రేడ్ హజారాసింగ్ వయస్సు 26 సంవత్సరాలు. పంజాబులో ఒక పేద రైతు కుటుంబములో అతడు పుట్టాడు. చిన్నప్పుడే రాజకీయోద్యమంలో పాల్గొనడం అలవాటు అయింది. ఒక టెర్రరిస్టు (వ్యక్తిగత హింసావాదం) కేసులో పోలీసులు యితన్ని 1931 లో ఎరస్టుచేసారు. 1933 లో తప్పించుకు పారిపోయి, మద్రాసు చేరుకున్నాడు, కొందరు సహచరులతో.

టెర్రరిస్టు ఉద్యమానికి ధనం సంపాదించే ఉద్దేశంతో, కామ్రేడ్ హజారాసింగు, బంతాసింగు, మరొక యువకుడు కలిసి అతి చాకచక్యంగా ఊటీ బ్యాంకును దోచారు.

దోపిడీ జరిగిన 10 రోజుల తరువాత దక్షిణదేశంలో శంకరణా కోయిల్ అనే పల్లెటూళ్లో వీరు పట్టుబడ్డారు. తమిళ బాష వీరికి రాకపోవడం వల్లను, వీరి ఉద్యమం ప్రజల కేమీ తెలియక పోవడం వల్లను, ఆ గ్రామస్థులు వీరి ముగ్గురినీ పోలీసులకు పట్టి యిచ్చారు. వెంటనే విచారణ ప్రారంభమయింది. ముగ్గురు యువకులకూ ఒక్కొక్కనికి 20 సంవత్సరాల చొప్పున కఠినశిక్ష విధించబడింది.

కామ్రేడ్ హజారాసింగ్, బంతాసింగ్‌గార్లను బళ్ళారి సెంట్రల్ జైలుకు తీసుకొచ్చి "ఖూనీకొట్టు" (ఖూనీ నేరస్థులను ఉంచే కొట్టు) లో బంధించారు. 24 గంటలూ అందులోనే గడపాలి.

"జేమ్సు" అనే ఒక పేద ఆంగ్లో ఇండియన్ వార్డరు హజారాసింగ్, బంతాసింగ్‌లతో అప్పుడప్పుడు సంభాషించేవాడు. వారి త్యాగము, వారి దేశభక్తి "జేమ్సు"ను ఆకర్షించింది. ఎలాగైనా వారిని జైలునుంచి తప్పించాలని నిశ్చయించుకున్నాడు. పై విధంగా వారికి సహాయం చేశాడు.

పారిపోయిన నాలుగోరోజున కామ్రేడ్ హజారా, బంతా, సింగులిద్దరూ హంపీ విడిచిపెట్టి, హాస్పేట రైల్వే స్టేషన్‌కు వచ్చారు. రైల్లో ఏవూరైనా వెళ్ళిపోదాం అని వారి అభిప్రాయం. కాని జైలు అధికార్లు ప్రతి రైలు స్టేషన్‌కూ, ప్రతి పోలీసుస్టేషన్‌కు, యిదివరకే టెలిగ్రాములద్వారా తెలియజేసేఉన్నారు. విప్లవకారులిద్దరూ ప్లాట్‌ఫారంమీద కూర్చొనిఉండగా స్టేషన్ మాస్టరుకు అనుమానం కలిగింది. పోలీసుల్ని పిలిచాడు. వారువచ్చి పట్టుకోకముందు అక్కడ గుమిగూడియున్న ప్రజలే పట్టుకున్నారు. బ్యాంకులుదోచే బందిపోటు దొంగలని వారికి చెప్పాడు స్టేషన్ మాస్టర్. ఎట్టి రాజకీయ విజ్ఞానంలేని పల్లెటూరి ప్రజలలో ఆవేశం కలిగి, పోలీసులకు వారిని పట్టి యిచ్చారు; నాలుగైదు బలమైన దెబ్బలుకూడా కొట్టారట; వెంటనే పోలీసులు సంకెళ్ళు తగిలించి, మళ్ళీ బళ్లారి జైలుకు తీసుకొచ్చారు. దారిలో వీరి శరీరాలు ఏవిధంగా హూనం చేయబడ్డవో మర్నాడు మేము వారిని చూచాక తెలిసింది.


తరువాత వీరిద్దరినీ ప్రభుత్వం అండమాను దీవులకు పంపింది. అక్కడ ఇతర రాజకీయ ఖైదీలందరితోబాటు హజారాసింగు 46 రోజులు నిరశనవ్రతం పూనాడు. తత్ఫలితంగా కాళ్లకు పక్షవాతం ప్రవేశించింది. కాంగ్రెసు మంత్రులు అధికారానికి వచ్చాక హజారాసింగును, మిగతా యిద్దరు ఊటీకేసు ఖైదీలను మద్రాసు రాజధానికి తీసుకొచ్చారు. కాని, వీరు రాజకీయఖైదీలే కాదనీ, కాబట్టి విడుదలచేయడానికి వీల్లేదనీ రాజాజీ వాదించడం ప్రారంభించాడు. అందువల్ల యితడు తిరిగి నిరశనవ్రతం చేయవలసి వచ్చింది. చివరకు ఆగస్టు 1938 లో మద్రాసు ప్రభుత్వం యితన్ని, మిగిలిన యిద్దరూ ఊటీ బ్యాంకు కేసు ఖైదీలను విడుదల చేసింది.

విడుదల అనంతరం కామ్రేడ్ హజారాసింగు ప్రజా ఉద్యమంలో ప్రవేశించాడు. టెర్రరిస్టు ఉద్యమంవల్ల ప్రయోజనంలేదని గ్రహించాడు.

జూలై 2 వ తేదీని ప్రారంభమయింది టాటానగర్ (బీహార్ రాష్ట్రం) లో "వైర్ ప్రొడక్ట్సు కంపెనీ"లోసమ్మె. ఆకంపెనీ పెట్టుబడి దాదాపు 16 లక్షల రూపాయలు. కార్మికులు తమ యిబ్బందులను గురించి సుమారు 1 సంవత్సరం క్రితమే మంత్రివర్గానికి నివేదించుకున్నారు. 7 నెలల క్రితం విచారణ సంఘాన్ని నియమించింది ప్రభుత్వం. కాని ఆసంఘపు నిర్ణయాలు బయట పడకపూర్వమే యజమానులు కార్మిక యూనియన్‌లో ఉత్సాహంగా పనిచేసే 6 గురిని ఎట్టి కారణము లేకుండా తొలగించారు. వారిని తిరిగి చేర్చుకోవలసిందని యూనియన్ ఆందోళన ప్రారంభించింది. తత్ఫలితంగా సోహన్‌సింగ్ అనే మరొక కార్మికుని తొలగించివేశారు.

కార్మికులకు సమ్మెతప్ప గత్యంతరం లేకపోయింది. మరునాడు కామ్రేడ్ హజారాసింగ్ కొందరు సమ్మెదార్లతో గేటువద్ద పికెటింగు చేస్తున్నాడు. యజమానుల మోటార్‌లారీ 3 టన్నుల బరువుగలది వచ్చింది దొంగకూలీలతో. పికెటర్లనుచూచి డ్రైవరు బ్రేక్ వేశాడు. కాని, పికెటర్ల మీదనుంచి డ్రైవ్ చేయవలసిందని మేస్త్రీ హుకుం వచ్చింది. డ్రైవరు దాన్ని ధిక్కరించలేకపోయాడు. హజారాసింగ్ శరీరం మీదనుంచి లారీవెళ్లింది. కొన్నిగంటలు గడిచాక ఆసుపత్రిలో అతడు మరణించాడు.

శవాన్ని పోలీసుల స్వాధీనం చేయడానికి నిరాకరించారు శిక్కు కార్మికులంతా. ఎంత చెప్పినా స్వాధీనం చేయలేదు. వెంటనే బ్రహ్మాండమైన ఊరేగింపు. శిక్కులదగ్గర మత సాంప్రదాయం ప్రకారం ఎప్పుడూ ఉండే బాకులను బయటికి తీసి ఊరేగింపులో పాల్గొన్నారు. పెద్ద ఎర్రజెండా ఒకటి శవంవద్ద నృత్యం చేస్తూ నడిచింది. స్మశానస్థలం చేరింది ఊరేగింపు. శవం మీద ఎర్రటి గుడ్డకప్పి, చితిని ముట్టించారు. అరుణకాంతులు వ్యాపింపజేస్తూ శవం కాలిపోయింది.



"కృష్ణాజిల్లా బోర్డు ఎన్నికల్లో పాల్గొని తీరాలి. అందుకై పశ్చిమ కృష్ణాలో కాంగ్రెసు సభ్యత్వము పోగొట్టుకొన్న 35 వేల ముఠాతో రాజీ పడాలి" అని తహ తహ లాడే లోకల్ బోర్డు రాజకీయ ఉత్సాహి. ఆంధ్ర వర్కింగు కమిటీ మెంబరు అయిన వాగ్దాటి 'కైజర్'ను గురించి ఆంధ్ర కాంగ్రెస్ నాయకోత్త ముండన్నాడంట గదా. "ఈయన కాంగ్రెసు వాడా! పార్టీల మనిషిని తీసికొనివచ్చి ఆయన చెప్పినట్లల్లాచేసి కాంగ్రెసును అప్రతిష్టపాలు చేయలేం" అని

మరేం! కాంగ్రెసు ఎన్నికలలో

నియోజిక వర్గాలు ఓటర్ల సౌకర్యం చూడకుండా తారుమారు చేసిన నాడు.

సత్యాగ్రహ పోరాటాలలో రాటుదేరిన కాంగ్రెసు సేవకుల నామినేషన్లు రద్దుచేసిన నాడు.

పార్టీ మనుష్యుల పట్టుకొనివచ్చి ఖద్దరు పుట్టంబుల కట్టంబెట్టి కాంగ్రెసు కమిటీల కెక్కించిన నాడు.

పెట్టెయలలోని ఓట్లకు జీవంబు కలగించి సంఖ్య యందభివృద్ధి గలిగించి తమ పార్టీ అభ్యర్థుల గెలిపించిన నాడు.

బందరు మ్యునిసిపాలిటీ ఎన్నికల్లో తమ పార్టీ క్షేమార్థ్యర్థం కాంగ్రెసును పోటీనుంచీ మాన్పించిన నాడు,

గమనించని పొరపాట్లు గమనించారని. చేయనోపని ఆత్మ పరీక్ష చేసికొన్నారని సంతోషించుదామా? లేక బందరు మ్యునిసిపల్ ఎన్నికల్లో జరిగిన కుంభకోణం. రేపన, జిల్లాబోర్డు ఎన్నికల్లో జరుగబోతూందని. ఇండిపెండెంటు పార్టీకి 'సర్వం సమర్పయామి' అని తెల్ల మొహం వేయబోతున్నందుకు విచారిద్దామా!

★ ★ ★

ఓడిపోతే పోతాం! హసల్ పోటీయే సేయం. మన వాడితో రాజీ పడ్తే మా బహదూరీకి నామోష్. జిల్లా బోర్డులో ఎవడూ వస్తే మాకేం. అనే "జయచంద్రుని" తత్వం. "మీర్జాఫర్" పాలసీ అవలంబించి. శివర కల్యాణం చేసుకొంటాం అంటే ఎవరేం చేయగలరు,

★ ★ ★

కాంగ్రెసులోని ప్రత్యర్థులతో రాజీ పడటం అప్రతిష్ట అనుకొంటే. ఆంధ్రదేశమంతటా గెల్చినా. తమ కృష్ణా జిల్లాలో పోటీ చేయడానికే గుండెల్లేక పోవడం ఎంత అప్రదిష్ట! ప్రజలలో తమకు విశ్వాసము లేదా? తమలో తమకే విశ్వాసము లేదా? ప్రజలలోకి కాంగ్రెసు సందేశము తీసికొని వెళ్ళడానికే జంకా? ఇదేమీ సత్యాగ్రహ పోరాటము కాదే. గాంధిగారి 'న్యూటెక్నిక్' అడ్డు రాడానికి: నాయకుల యీ గుండె—పిరికిని ఆంధ్ర కాంగ్రెసు వాదులు సహించుతారా?

★ ★ ★

బ్రిటీషు సామ్రాజ్యవాదాన్ని రక్షించడమే ప్రధాన ఆశయంగా కల్గిన "టైమ్సు ఆఫ్ ఇండియా" పత్రిక 10 వ తేదీ సంపాదకీయములో. బ్రిటీషు సామ్రాజ్య వాదాన్ని నాశనం గావించి భారత స్వాతంత్ర్యము స్థాపించడమే ప్రధాన ఆశయముగా కలిగిన కాంగ్రెసు మహాసభ వర్కింగు కమిటీకి యీ సలహా యిచ్చింది "వర్కింగు కమిటీకి యిది పరీక్షాసమయము. ఐక్యతను గురించిన వింత అభిప్రాయాలే బలహీనతకు కారణమయి తీవ్రవాదానికి అవకాశ మిచ్చాయి; దేశానికి. కాంగ్రెసుకు అరిష్టమయ్యాయి. ఇప్పుడు గట్టి చర్య తీసికోకపోతే తీవ్రవాదుల బలం హెచ్చుతుంది. పరోక్షంగా కమ్యూనిష్టులకు ప్రోత్సాహ మిస్తుంది"

అబ్బ! కాంగ్రెసు అంటేను. డిసిప్లిను అంటేనూ "టైమ్సు ఆఫ్ ఇండియా"కు ఎంతప్రేమ!! గాంధీయులు తీవ్రవాదులను కాంగ్రెసునుండి తరిమివేయాలని ఎంత తహ తహ లాడుతూంది? సామ్రాజ్యవాదుల కోరికను ఎంత చక్కగ ప్రతిఫలించుతోంది! కాంగ్రెసు నాయకోత్తములు యీ సంగతి అవగాహన చేసికుంటే తీవ్రవాదులతో భుజం భుజం కలిపి బ్రిటనుతో పోరాడాలని తమ కర్తవ్యాన్ని గుర్తించరా?

★ ★ ★

సుభాషితాలు:—

గుజరాతు విద్యాపీఠం ఉపన్యాసంలో సర్దారు పటేలు:

"జాతీయ పునర్నిర్మాణము సాగించవలసిన కాలమి ఇపుడు ఒక ప్రభుత్వం అంతర్ధాన మౌతూంది: మరొకటి దాని స్థాన మాక్రమించుకొంటూంది. బ్రిటీషువారు యీ దేశంలో తమ అధికారాన్ని వదలుకోవాలసి వస్తుందని గ్రహించారు! అలా చేయడం ప్రారంభించారు కూడా"

బొంబాయి ఉపన్యాసంలో సత్యమూర్తి:—

"ఫెడరేషను అమల్లోకి వస్తే ఫెడరల్ శాసన సభల్లోకి మనం వెళ్ళుతాము: భారత ప్రభుత్వంలో అధికారం స్వీకరించుతాము. అదే రాజ్యాంగ విధానాన్ని రద్దుచేయడానికి దారితీస్తుంది."

రఫీ అహమ్మద్ కిద్వాయి. యు. పి. రెవిన్యూ మంత్రి లక్నోనుండి ప్రకటనలో:—

"కాంగ్రెసు నాయకత్వల రాజీకొరకకు ప్రాకులాడుతూందని ప్రజలు అనుకొంటున్నారు. దానిలో ఏమీ సందేహంకూడా లేదు. సర్దార్ పటేలు, అతని అనుచరులు ప్రస్తుత రాజ్యాంగ విధానాన్ని అమలు జరుపుట ద్వారా దేశంలో కాంగ్రెసు స్థానాన్ని బలపరచుకొని తరువాత మెట్టుకు (రాజీకి) దిగాలని అతుర పడుతున్నారని నా దృఢమైన విశ్వాసం. కాని దురదృష్టవశాత్తూ ఆ సంగతి వారు బహిరంగంగా చెప్పుటలేదు"

★ ★ ★

ఈనెల 13 వ తేదీ ఆంధ్రపత్రిక సంపాదకీయంలో యిలా వుంది. "కార్మిక సమస్యను గూర్చి రాష్ట్రీయ ప్రభుత్వములేగాక భారత ప్రభుత్వమును జాతిసమితియు గూడ అలోచించుచున్నవి. భారతదేశ పరిస్థితులనుబట్టి భారత ప్రభుత్వము రాష్ట్రముల సహకారముతో దగిన శాసనముజేయ సిద్ధముగ నున్నది. ఈ శాసనములు కార్మికుల హక్కులను రక్షింపగలవనుటకు సందియం లేదు."

కాంగ్రెసు ప్రభుత్వాలు వున్న రాష్ట్రాలలో కార్మికుల హక్కులను రక్షించే శాసనములు చేస్తారని ఆశించడము సహజము కావచ్చును. పోనీ ప్రజలచే ఎన్నుకోబడిన వారు పదవుల్లో వున్నారు కాబట్టి. కాని ప్రజలకు బాధ్యత వహించని సెంట్రల్ ప్రభుత్వమునేడు (ఇండియా గవర్నమెంటు భారత ప్రభుత్వమ్కాదు. అది బ్రిటిషు ప్రభుత్వము) రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కార్మికుల హక్కులను రక్షించ గల్గే శాసనాలు చేస్తుందనే నమ్మకము ఏ కాంగ్రెసు వాదికీ ఉండదు: వుండ కూడదు.

★ ★ ★

...."గాంధీగారి పద్ధతులూ, గాంధీగారి ప్రకటనలూ సుభాష్‌బాబుకు అర్థం కాలేదు. అందుచేత నచ్చలేదు. శత్రువుయొక్క హృదయం కరిగించాలంటాడు గాంధీగారు. కరిగించేదేమిటి. ఖంగారు పెట్టాలంటాడు బోసుగారు. శత్రువు ఇతర చిక్కుల్లోవుంటే. ఇదే సమయం. ఈ సమయములోనే ఉచ్చుబిగించి మనపని మనం నెరవేర్చుకోవాలని బోసుగారికి ఆశయం. శత్రువుయొక్క ఆపత్సమయం స్వప్రయోజనసిద్ధికై మనం వినియోగించకూడదని గాంధీగారి పద్ధతి"

(22 వ తేదీ కృష్ణాపత్రిక సంపాదకీయంనుండి)

చదువరీ! నీ వేమంటావ్. మన శతృవు బ్రిటీషు ప్రభుత్వం చిక్కుల్లోవుండే సమయాన్ని దెబ్బగొట్టి స్వరాజ్యం సంపాదించడం నీకిష్టం కాదూ?

★ ★ ★

పట్టుకొట్టయిలో ఉపన్యసిస్తూ ప్రధాన మంత్రి రాజాజీ ఇలా చెప్పాడు; "మన పార్టీవారు ఉద్యోగుల చర్యలను గురించి అక్షేషణబు తెలుపుచున్నారు: ఉద్యోగులలో మనః పరివర్తనం కలుగలేదంటున్నారు. ఈరోజులలో ఉద్యోగులు స్వంత బాధ్యతమీద పనిచేయుటలేదు; మంత్రుల ఉత్తరువులను ఆచరణలో పెడుతున్నారు. ఉద్యోగులలో కలుగలేదని ఆక్షేపించబడుతున్న మనః పరివర్తన మన పార్టీ వారిలో కలిగిందా అని నేను ప్రశ్నించుతున్నాను."

అయితే చీరాల. చిట్టివలసలో బ్రిటిషు పెట్టుబడిదార్లకు సాయంగా పోలీసులువెళ్ళి తుపాకులు పేల్చి దేశీయులైన కార్మికుల ప్రాణాలు బలికొనడానికి బాధ్యులు ఎవరు? ఉద్యోగులు కాదూ? మంత్రులా!! ఇదేమి సమర్ధన! కుంటి సమర్ధన!

పూర్వం బ్రిటిషు ప్రభుత్వానికి అనుకూలంగా. ప్రజలకు వ్యతిరేకంగా ప్రవర్తించే—ఉద్యోగులలో మనః పరివర్తన రాలేదని ఆక్షేపించుతున్నారు కాంగ్రెసు వాదులు. రాజాజీయో! పూర్వంనుండి ప్రజా సేవకులుగా వుంటున్న కాంగ్రెసు వాదులలో మనః పరివర్తన రాలేదేమని వెక్కిరిస్తున్నాడు ఇదేమి ఆపసవ్యం.

కత్తిరింపులు

"యువకుడు సామ్యవాదియు నగు శ్రీ సుందర రాజయ్యంగారు జిల్లా కాంగ్రెసు అధ్యక్షుడుగ ఎన్నుకోబడుటయూ, అతడు పార్వర్డుబ్లాకుయెడ సానుభూతి గన్పరుచుటయు చాలదా కాంగ్రెసు మితవాదవర్గమునకు. చిన్నపామైననూ పెద్ద బడితతో కొట్టవలెను. ఇక కారణమా? మేకపిల్లలను చంపుటకు మొసలి తోడేలునకు ఏమి కారణముండెను? ....

చిత్తూరు జిల్లాకాంగ్రెసు సంఘములో ఖద్దరుధారులు కానివారిని మాత్రము తొలగించినచో స్థానిక మితవాద నాయకులకు మెజారిటీ రాదేమో పాపము! కాంగ్రెసు మితవాద నాయకులు సకాలములో అపీలు చేయకున్ననూ చిత్తూరు జిల్లా కాంగ్రెసు సంఘమును రద్దు చేయుట త్రిపురీ కాంగ్రెసు అనంతరము కాంగ్రెసు రాజకీయములలో మితవాదు లనుసరించుచున్న నిరంకుశ విధానమున కనుగుణ్యముగనే యున్నది."

[విజయవాణి సంపాదకీయం]

సంపుటం 2 నవశక్తి బుధవారం
సంచిక 32 26—7—39

సంపాదకవర్గం: మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు). కంభంపాటి సత్యనారాయణ. పుచ్చలపల్లి సుందరయ్య. తుమ్మల వెంకట రామయ్య.

యుద్ధ ప్రతికూల దినం

ఇప్పటికి 25 యేండ్లనాడు 1914 అగస్టు 1 వ తేదీ క్రిందటి ప్రపంచ సంగ్రామము ప్రారంభమయింది. ఆ మారణ హోమంలో 1 కోటి 30 లక్షలు సైనికులు మరణించారు. అంతే సంఖ్య గల పౌరులు యుద్ధంలో పాల్గొననివారు అహుతి అయ్యారు. యుద్ధ ఫలితంగా వచ్చిన కరవు కాటకాలవల్ల యింకా ఎంతమంది అహుతి అయ్యారో చెప్పలేము. గత యుద్ధానికి 1,30,000 కోట్ల రూపాయలు వివిధ ప్రభుత్వాలు ఖర్చు పెట్టాయి. ఇదిగాక యుద్ధంలో ఎన్ని కోట్ల విలువగల ఆస్థి యుద్ధ ఫలితముగా నాశనమయిందో అంతులేదు. విజ్ఞానము, నాగరికత ఎంతో వెనుకబడి పోయింది.

వెనుకటి యుద్ధ నష్టాలనుండి యింకా పుంజుకోనయినాలేదు; మరల ఆరు సంవత్సరాల నాడే జపాను మంచురియా ఆక్రమించుటతో సామ్రాజ్యవాద యుద్ధము ప్రారంభమయింది. అబిసీనియాను ఇటలీ మారణ యంత్రాలతో ఆక్రమించింది. క్రమముగా ఆస్ట్రియా, జకోస్లోవేకియాలను బ్రిటను పరోక్ష సహాయముతో జర్మనీ హస్తగతం చేసుకొంది. స్పెయిన్ ప్రజా స్వామికం ఇటలీ, జర్మనీల ప్రత్యక్ష సాయంతో. బ్రిటను, ఫ్రాంసులు తటస్థ విధానము పేర చేసిన ద్రోహము సాయపడగా ఫాసిస్టు విద్రోహుల హస్తగతమయింది. జపాను సామ్రాజ్యవాదులు చైనా స్వాతంత్ర్యాన్ని హరింపడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

బ్రిటీషు సామ్రాజ్యవాదులు జర్మనీ, ఇటలీలు బలహీన దేశాల స్వాతంత్ర్యాన్ని హరించుతూంటే ఉపేక్ష వహించి. సాయపడి వారిని తమ వర్గ శత్రువైన సోవియట్ రష్యాపైకి పురిగొల్పడానికి ప్రయత్నించారు. ఆ ప్రయత్నాలు ఫలించునటుల కాన్పించక సోవియటుతో సంధికి రాయబారాలు ప్రారంభించారు. కాని ఈ ప్రయత్నాలలో కూడ బ్రిటను "యితరుల చేతులతో కొలిమిలోని జీడిగింజలు తీయించాల"ని చూస్తోంది. బ్రిటను, ఫ్రాంసులు డాన్జిగ్ రక్షణకు పోలెండుకు యిచ్చిన వాగ్దానాలను నెరవేర్చడానికి రష్యా పూనుకోవాలట; రష్యా సరిహద్దు రాజ్యాలగు బాల్కను దేశాల రక్షణకు తాను గ్యారంటీ యివ్వదట. ఇట్టి విపరీత కోర్కెలు బ్రిటను కోరుటచేతనే శాంతిని కోరే దేశాలన్నీ ఏకమగుటకు, శాంతి సంఘటన నిర్మించుటకు వీలగుటలేదు. అందుచేతనే ప్రస్తుతము జరుగుతున్న వివాదాలు ప్రపంచ సంగ్రామముగా ఏ నిమిషమైనా మారవచ్చు.

వివిధ సామ్రాజ్యాలు రాబోవు మారణహోమానికి సమిధలు సమకూర్చుకుంటున్నాయి. 1914 కు ముందు వివిధ దేశాలు ఆయుధ నిర్మాణానికైచేసిన ఖర్చుకు ఎన్నో రెట్లు యిపుడు ఖర్చిడుతున్నాయి. బ్రిటిషుప్రభుత్వం ఆయుధ నిర్మాణం విరివిగా చేయుటేగాక 21—24 ఏండ్ల మధ్య వయస్కులకు నిర్బంధ సైనిక శిక్షణ ఏర్పాటుచేసింది. రాబోయే యుద్ధంలో బ్రిటిషు సామ్రాజ్యవాదులు భారత దేశాన్ని తూర్పు దేశాలలో యుద్ధ కేంద్రంగా చేసికోడానికి తీర్మానించుకొన్నారు. చాట్‌ఫీల్డు కమిటీ సూచనల ననుసరించి భారతదేశములో ఆయుధాగారాలు వృద్ధి చేయబడుతున్నాయి. జబల్పూరు సమీపంలో కొన్ని గ్రామాలాక్రమించుకొని బ్రహ్మాండమైన ఆయుధాల ఫ్యాక్టరీ నిర్మించబోతున్నారు. అవసరమయినపుడు రాష్ట్ర ప్రభుత్వాలకు యివుడున్న అధికారాలు సైతము తగ్గించే సవరణలు యిండియా ఆక్టులో చేస్తున్నారు. యుద్ధంలో తమకువచ్చు ఆర్థిక నష్టాన్ని భారత దేశంపై సామ్రాజ్యవాదులు రుద్దజూస్తున్నారు.

గ్రామగ్రామాన, ప్రతిపట్టణంలోనూ సైనికుల రిక్రూటు మెంటు ప్రారంభమైంది. ఆంధ్రదేశంలో యీ రిక్రూటుమెంటు వార్తలు తెలుపుచూ, విలేఖరులు యుద్ధంలో పాల్గొనరాదనే కాంగ్రెసు తీర్మానాన్ని ఎలా అమలు జరుపాలో తెలుపవలసిందని కోరుతున్నారు. బొంబాయి రాష్ట్రీ కాంగ్రెసు కమిటీ యుద్ధము రాకుండా జేయడానికి కాంగ్రెసు తీర్మానాన్ని అమలుజరపడానికి తామేమిచేయాలో తెలుపవలసిందని అఖిల భారత కాంగ్రెసు వర్కింగుకమిటీని కోరుతూ తీర్మానించింది.

అగస్టు 1 వ తేదీ యీ సంవత్సర యుద్ధ ప్రతికూలదినం, యిట్టి విషమ పరిస్థితుల్లో మనం జరుపబోతున్నాము. ఫైజ్‌పూర్, హరిపురా కాంగ్రెసు మహాసభలు యుద్ధంలో భారతీయులు పాల్గొనకూడదని తీర్మానించాయి. త్రిపురీ కాంగ్రెసు పై నిశ్చయాన్ని పునశ్చరణ చేస్తూ. ఆ యవకాశములో స్వయం నిర్ణయ సూత్రాన్ని అమలు జరుపడానికి, జాతీయ వాంఛను నెరవేర్చుకోడానికి సర్వ సన్నాహాలూ చేయాలని తీర్మానించింది. కాని విషాదమేమంటే పైతీర్మానాన్ని అమలు జరుపడానికి స్పష్టమైన కార్యక్రమాన్ని వర్కింగుకమిటీ యిచ్చియుండలేదు. అందుచే కాంగ్రెసు సభ్యులు ప్రస్తుతం గ్రామగ్రామాన జరుగుతున్న రిక్రూటుమెంటును ఎలా ఎదుర్కోవాలో తెలియక నివ్వెరపోతున్నారు.

యుద్ధం ప్రకటించగానే యీమాత్రపు పౌరసత్వహక్కులుకూడ మనకు వుండవు. కాంగ్రెసు మంత్రివర్గాలు తొలగించబడుతాయి. ఆర్డినెన్సుల పాలన ప్రారంభమవుతుంది. నిర్బంధవిధానము తీవ్రముగా వుంటుంది. కాన నేటినుండి కాంగ్రెసు వాదులు. సోషలిస్టులు తమ నిర్మాణబలాన్ని వృద్ధి చేసుకోవాలి. ఆయా పరిస్థితులలో అవలంభించవలసిన విధానం. అనుసరించవలసిన మార్గాలు, ప్రచారం గావించుకొని, కట్టుబాటుతో ఉద్యమాన్ని నడుపగలిగినంత శక్తివంతముగా కాంగ్రెసు సంఘాలను, సోషలిస్టు పార్టీని యిపుడే నిర్మాణ రీత్యా బలం చేసికోవాలి.

రిక్రూటుమెంటు ప్రచారం యిపుడు ఉద్యోగస్తుల చేతను, జాతీయ విద్రోహుల చేతను, బీదలు, నిమ్నజాతులమధ్య ఎక్కువగా చేయబడుతూంది. మనం యీ సైన్యాలు భారతీయుల లాభంకొరకు గాక, బ్రిటిషు లాభంకొరకు నిర్మించబడుతున్నాయనీ, బ్రిటనుచేసే యుద్ధాలలో పాల్గొనుటవలన యిపుడు జేరుతున్న బీదల దరిద్ర్యం తొలగదనీ, అందుకొరకు కష్టజీవులంతా జాతీయ పోరాటములో పాల్గొని స్వాతంత్ర్యము సంపాదించాలనీ ప్రచారము గావించాలి. సైనికులుగా చేరకూడదనేప్రచారమేగాక, భారత సిపాయీలు అనుభవించు నికృష్ట స్థితిని వారికి తెలియజెప్పాలి. వారికి యిస్తామనిచెప్పే 17 రూ. స్వల్ప జీతంలో క్షౌరానికని, చాకలికని, చుట్టకని వసూలుచేసే హెచ్చుమొత్తాలను గురించి. ఖైదీలవలే వారిని పెట్టు యిబ్బందుల గురించి వర్ణించాలి. ఎంతప్రచారం చేసినా ప్రస్తుతం దేశంలోవున్న దుర్భర దారిద్ర్యం వలన కొందరు జేరడానికి సిద్ధమౌతారు. ప్రతి సిపాయి జీవితం యిన్స్యూరు చేస్తేగాని, తమపై ఆధారపడేవారికి స్వల్పాధారమైనా వుండదుగాన నిత్యం మరణం ఆసన్నంగా వుండే ఆవృత్తిలో జేరకూడదని బోధించాలి. కొలదిమంది యువకులు సాహస కృత్యాలపైవుండే మోజుతోకూడా చేర సిద్ధమౌతారు. అట్టివారిని జాతీయపోరాటం యొక్క ఆవశ్యకతను తెలిపి వెంటనే కాంగ్రెసు వాలంటీరు సైన్యంలో జేర్పించాలి. అసలు జాతీయవాలంటీసైన్యాలు నిర్మాణంచేసి. వానిచే ప్రదర్శనాలుకూడ చేయించిన బ్రిటిషుప్రభుత్వం గావించే యుద్ధప్రచారానికి సరియైన జవాబుగా వుంటుంది. ప్రజలలో చక్కని ఉత్సాహాన్ని పురికొల్పుతుంది.

అగష్టు 1 వ తేదీ యింకో విధముగా కూడా భారతీయులకు అతిప్రాముఖ్యమైన దినం. పందొమ్మిది యేండ్లనాడు ఆ రోజుననే 'స్వరాజ్యం నా జన్మహక్కు'ని చాటిన ప్రథమ జాతీయ మహానాయకుడు బాలగంగాధర తిలక్ మరణించాడు. క్రిందటి ప్రపంచ సంగ్రామములో కాంగ్రెసు నాయకులందరు గాంధీజీ సైతం పప్పులో కాలేసి బ్రిటీషు సామ్రాజ్యవాదులకు సాయపడినపుడు, ఆ వీరుడు బానిస భారతదేశము విదేశ యజమాని లాభముకొరకు పోరాడకూడదని స్పష్టంగా చాటాడు. 1 వతేదీ సభలు, తరువాత జరుగు ప్రచారము ఎంత జయప్రదంగా జరుపగలుగుతామో తిలక్ వీరుని సందేశాన్ని అంత చక్కగా ప్రచారము చేసిన వారమౌతాము: ఆ నాయకుని స్మారక దినాన్ని వీరోచిత రీతిని జరిపిన వారమౌతాము.

యుద్ధంలో బ్రిటిషు ప్రభుత్వానికి ఒక దమ్మిడీ, ఒక సైనికుని సాయమంపరాదు. ఫెడరేషను, యుద్ధానికి వ్యతిరేకంగా జాతీయ పోరాటము సాగించాలి. అట్టి పోరాటం ప్రారంభించగానే కాంగ్రెసు ఆజ్ఞానుసారము రైతులు పన్నుల చెల్లించకూడదు. కార్మికులు యుద్ధానికి సంబంధించిన పరిశ్రమలన్నిటిలో జనరల్ స్ట్రయికు చెయ్యాలి.

ప్రభుత్వ బ్యాంకులలోనూ, సెక్యూరిటీలలోనూ దాచుకొన్న ధనాన్ని వెంటనే ప్రజలంతా తీసివెయ్యాలి.

ఈ నినాదాలను కాంగ్రెసువాదులు. సోషలిష్టులు, దళాలుగా బయలుదేరి ప్రచారం గావించాలి.

మన రాజకీయాలు

బీహారులో విద్యా సంస్కరణ

విద్యా సంస్కరణ విషయములో బీహార్ ఇతర కాంగ్రెసు రాష్ట్రాలకు మార్గం చూపుతోంది. గత సంవత్సరము దిగ్విజయంగా కొనసాగిన వయోజన విద్యా కార్యక్రమాన్ని కొనియాడుతూ యీ నెల రెండో వారములో బీహారు రాష్ట్రము అంతటా ఊరేగింపులు, సభలు జరిగాయి. రాష్ట్ర మొత్తంమీద 14,259 వయోజన విద్యాలయాలు స్థాపించబడి 15,926 ఉపాధ్యాయులు ఉచితముగా చదువు చెప్పడమువల్ల 6 లక్షల మంది ప్రజలు వ్రాయడము, చదవడము నేర్చుకున్నారట. ఈస్కీముకు అయిన 1 లక్ష రూపాయల ఖర్చులో 89,000 రూపాయలు బీహారు ప్రభుత్వమే యిచ్చింది. ఈ యేటినుంచి ప్రతి సంవత్సరము 2 లక్షల రూపాయలు వయోజన విద్యా వ్యాప్తికి బీహారు ప్రభుత్వం ఖర్చుపెట్ట నిశ్చయించింది.

చిన్న స్కేలు మీద గృహపరిశ్రమలు స్థాపించదలచుకొనే విద్యావంతులైన యువకులకు ప్రభుత్వము 500 రూపాయలకు మించని అప్పులు యిస్తుంది. పారిశ్రామిక విద్యాలయాలలో ఉచితంగా తరిఫీదు పొందడానికి స్కాలర్‌షిప్పులు, స్టయిపెండ్లు విరివిగా యిస్తుంది. ప్రభుత్వము త్వరలో ప్రారంభించనున్న విద్యుచ్ఛక్తి, యంత్రాగార, రసాయన, పరిశ్రమలలో దాదాపు 3 లక్షలమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించబోతుంది.

చట్టానికి లోబడి నంతవరకైనా యిట్టి సంస్కరణలతో ప్రజలకు సహాయం చేస్తున్న బీహారు కాంగ్రెసు మంత్రుల్ని అభినందించవలసియున్నది.

మధుర దేవాలయంలో హరిజన ప్రవేశం

ఈ నెల 8 వ తేదీని మధుర మీనాక్షి దేవాలయములోకి హరిజన సేవా సంఘపు అధ్యక్ష కార్యదర్శులు 5 గురు హరిజనులను తీసుకెళ్ళి, పూజారులచే తీర్థ ప్రసాదాలు యిప్పించారు. మరునాటి నుంచి యెన్నో దేవాలయాలు హరిజనులకు తెరవబడ్డాయి. వెంటనే సనాతనులలో కంగారు పుట్టింది. దేవాలయాధికార్ల మీద, అర్చకుల మీద, పిటీషన్లు దాఖలు చేశారు. కాని, మద్రాసు ప్రభుత్వము ఆర్డినెన్సు ఒకదాన్ని ప్రకటించి, అర్చకులమీద, దేవాలయాధికార్లమీద ఎట్టి చర్య తీసుకొనకూడదని శాసించింది. ఈ విధంగా హరిజనోద్యమానికి సహాయం చేస్తూ, సనాతనుల ప్రతికూల చర్యలను అరికట్టుచున్న మద్రాసు ప్రభుత్వాన్ని ప్రశంసిస్తున్నాం.

ఏజన్సీ ప్రజలకు సౌకర్యాలు

విశాఖపట్నం, గోదావరిజిల్లాల ఏజన్సీ ప్రాంతాలలో ప్రజలకు ఏయే సౌకర్యాలు చేస్తే బాగుంటుందో ఆలోచించడానికి ప్రభుత్వోద్యోగుల సమావేశం ఒకటి మద్రాసులో జరిగింది. 5 సంవత్సరాలలో ప్రభుత్వం కొన్ని రోడ్లు, పంటకాలువలు, వ్యవసాయ దినుసుల విక్రయదలకు కోఆపరేటివ్ మార్కెటింగ్‌సంస్థలు, పై రెండు ఏజన్సీలలో నిర్మించ వీలుగా వాటి కొరకు నిశ్చయించినట్లు, అందుకై 50 లక్షల రూపాయలు ఖర్చుపెట్టవలచినట్లు తెలుస్తోంది.

ల్యాండ్‌మార్టుగేజ్ బ్యాంకులలో కాలయాపన లేకుండా అప్పు లివ్వడానికి మద్రాసుప్రభుత్వం ల్యాండ్ మార్టుగేజ్ సవరణచట్టం ఒకటి ప్రవేశపెట్టబోతూంది. దానిప్రకారం దరఖాస్తుదారుయొక్క ఆస్థి వివరాలను తెలిపే డాక్యుమెంట్లుగాని, వాటి నకళ్ళుగాని ఋణదాతల వద్దనుంచి నిర్బంధముగా తెప్పించే అధికారాలు కోఆపరేటివ్ రిజిస్ట్రార్లకు, రైతుల ఋణపరిష్కారార్థం ప్రభుత్వంచే నియమించబడు యితర ఉద్యోగస్థులకు యివ్వబడతాయి.

పై ప్రజోపయోగ కార్యాలకు కూడా మద్రాసు మంత్రివర్గాన్ని అభినందించ వలసియున్నది.

యు. పి. లో జమీన్ రైతు రక్షణ

యు. పి. రాష్ట్రంలో రైతులు జమీన్‌దార్లకు చెల్లించవలసిన బకాయిలన్నీ రద్దుచేస్తూ రక్షణ యిచ్చే బిల్లు ఒకటి కాంగ్రెసు మంత్రులు ఎసంబ్లీలో ప్రతిపాదించబోతున్నారు. దీని ప్రకారము 80 లక్షల రూపాయల బకాయీలు రద్దు అవుతాయి. ఒక్కొక్క రైతు ఎంత బాకీ ఉన్నాడో తెలుసుకోడానికి జమీందార్ల లెక్కలు పనికిరావనీ, అవి చాలావరకు అబద్ధపు లెక్కలేననీ, ప్రధాని గోవిందవల్లభపంతు ఎసంబ్లీలో తెలియజేశాడు. చెల్లించగల కొద్దిమంది రైతులు మాత్రం యీ చట్టము క్రిందికి రారు.

ఇంతేగాక, పల్లెటూళ్ళలో రోడ్డు సౌకర్యాలు బహు తక్కువ కాబట్టి 1063 మైళ్లు పల్లెటూళ్ళలోను, 300 మైళ్లు పట్టణాలలోను, కంకరరోడ్లు వేయడానికి యు. పి. మంత్రులు నిశ్చయించుకున్నారు. ఇందుకు 1,58,00,000 రూపాయలు ఖర్చు అవుతుందట.

బెంగాల్ రాజకీయ ఖైదీల సమస్య

కాంగ్రెసు ప్రతికూల రాష్ట్రం అయిన బెంగాల్‌లో మాత్రం పరిస్థితులు వేరుగా ఉన్నాయి. ఈ నెల 7 వ తేదీనుంచి నిరశనవ్రతము చేస్తున్న బెంగాల్ రాజకీయ ఖైదీల సమస్య రోజు రోజుకూ విషమిస్తోంది. ఒక్కొక్క ఖైదీ 20 పౌనులు, 25 పౌనులు బరువు కోల్పోతున్నాడు. ఇద్దరికి ఊపిరితిత్తులు చెడినట్లు కూడా వార్తలు వస్తున్నాయి. మంత్రివర్గము మాత్రం ససేమిరా అని తన మొండిపట్టుదలను విడిచిపెట్టడంలేదు. ఈ నెల 30 వ తేదీని దేశము అంతటా సభలు, ఊరేగింపులు జరిపి, బెంగాల్ రాజకీయ ఖైదీలను విడుదల చేసేటట్లు ఒత్తిడి తేవలసిందని అతివాదు లందర్నీ సుభాష్‌బోసు హెచ్చరించాడు. కాంగ్రెసు ప్రెసిడెంటుకూడా పరిస్థితులు విషమిస్తూ ఉండడం గ్రహించి, బెంగాల్ ఖైదీలవిడుదల కయేవర్కు సభలు, తీర్మానాలద్వారా కాంగ్రెసుకమిటీలు ఆందోళన చేయవలసిందనీ, ఒక్కరోజు మాత్రమే చేస్తే సరిపోదనీ, హెచ్చరించాడు. ప్రజా ఉద్యమాలను నడిపించడం విషయములో అతివాదులకూ, మితవాదులకూ మధ్య యిట్టి పోటీ దేశ సౌభాగ్యానికి, స్వరాజ్య పోరాటాభివృద్ధికి, మార్గం. రాజేంద్రప్రసాదు ఆజ్ఞానుసారం యిప్పటినుంచీ కాంగ్రెసు కమిటీలు ఆందోళన సాగిస్తాయని ఆశిస్తున్నాం. "నిరశనవ్రతం మానివేస్తే వారి విడుదలకు ఎక్కువ అవకాశా లేర్పడతా"యని గాంధీజీ తెలియజేయడము మాత్రము బాగులేదు, ఎందువల్లనంటే, ఇదివరలో గాంధీజీ సలహా ననుసరించియే బెంగాల్ రాజకీయఖైదీలు నిరశనవ్రతాలు ఆపివేశారు. కాని, విడుదలమాత్రం కాలేదు. ఇప్పుడుకూడా, అట్టి సలహానే యివ్వడం గాంధీజీకి తగదు.

రాజేంద్రప్రసాదు బెంగాల్ మంత్రుల కొక ఉత్తరం వ్రాశాడట. వారు రాజీనామా యిస్తే కాంగ్రెసుపార్టీ అధికారంలోకి వస్తుందనే భయం వదలుకో వలసిందనీ, ఆ విధంగా జరుగకుండా తాను హామీ యిస్తున్నాననీ, ఆ ఉత్తరంలో వ్రాశాడట. కాని బెంగాల్ మంత్రులు అంగీకరిస్తారా?

బొంబాయి కాంగ్రెసు: జాతీ యైక్య విధానం

ఈ విధముగా ఒకవైపు బెంగాల్ రాజకీయ ఖైదీల సమస్య అఖిలభారత సమస్యగా పరిణమించి, మరొకవైపు బ్రిటిష్ ప్రభుత్వము తీవ్రమైన యుద్ధ సన్నాహాలు చేస్తూంటే, బొంబాయి కాంగ్రెసు కమిటీ యిటీవల చేసిన రెండు తీర్మానాలు జాతీయైక్యతకు చాలావరకు తోడ్పడుతాయి. హఠాత్తుగా యుద్ధంవస్తే బొంబాయి పౌరులు ఏమిచేయాలో తెలియజేయవలసిందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీని కోరుతూ ఒకతీర్మానం, బొంబాయి మిల్లు యజమానులు 30,000 మంది కార్మికులను తొలగించడానికి చేసే ప్రయత్నాలను అరికట్టడానికి బొంబాయి మంత్రివర్గము వెంటనే కలుగజేసుకోవలసిందని మరొక తీర్మానం, బొంబాయి కాంగ్రెసు కమిటీ ప్యాసుచేసింది.

అతివాదులపై డిసిప్లినరీ చర్య

మొన్న 9 వ తేదీని జరిగిన సభలలో పాల్గొన్న కాంగ్రెసు అతివాదులమీద వెంటనే ఎట్టి డిసిప్లినరీ చర్య తీసుకొనవద్దనీ, వచ్చే నెలలో వర్కింగు కమిటీ యీ విషయమై తీర్మానిస్తుందనీ, కాంగ్రెసు కార్యదర్శి అన్ని రాష్ట్ర కమిటీలకు సర్క్యులర్లు పంపాడట. నేటి జాతీయ, అంతర్జాతీయ విషమ పరిస్థితుల్లో అతివాదుల్ని కాంగ్రెసునుండి తొలగించడం వట్టి ఆత్మ వినాశకరమైన పద్ధతి. వర్కింగ్ కమిటీ అట్టి నిర్ణయం చేయదని ఆశిస్తున్నాం.

సరిహద్దు రాష్ట్రకాంగ్రెసు దండయాత్ర

కాని, సరిహద్దు రాష్ట్ర కాంగ్రెసువారి నిర్ణయాన్ని బట్టి అతివాదులమీద దండయాత్ర ప్రారంభమయిందని చెప్పవచ్చు. ఇతర సంస్థలలో సభ్యులుగా ఉన్న కాంగ్రెసు వాదుల్ని తొలగించడానికి అనుమతి నివ్వవలసిందని వర్కింగ్ కమిటీని కోరుతూ తీర్మానించారు, సరిహద్దు కాంగ్రెస్ కమిటీవారు. ఇది గాంధీగారి సలహాపైనే కూడా చేశారట. త్వరలోనే ఆ అనుమతి కూడా వస్తుంది కాబోలు. ఈ వినాశకర విధానాన్ని యెదుర్కొనడానికి అతివాదులు జాతీయైక్య సంఘటనకు యిదివరకుకంటె వేయిరెట్లు ఉత్సాహంతో పనిచేయాలి.

రాష్ట్రకాంగ్రెస్ సంఘానికి సుందరయ్యగారి జవాబు

జూలై 9 వ తేదీ సభలలో పాల్గొనుటకు కారణాలు

ఆర్యా,

మీరు నర్సారావుపేటనుండి 15 వ తేది పంపిన రిజిస్టరు జాబు చేరింది. మీ జాబులో శ్రీ సుభాసుచంద్రబోసుగారు అఖిలభారత కాంగ్రెసు సంఘమువారు బొంబాయిలో చేసిన తీర్మానములను ఖండించుటకు నిర్ణయించిన ఈ నెల 9 వ తేదీన మీరు నెల్లూరులో చేయబడిన బహిరంగ సభయందు నరవ తీర్మానాలను ఖండించుచు ఉపన్యసించినట్లు తెలియవచ్చినది. అని వ్రాసి ఉన్నారు.

9 వ తేదీ అఖిలభారత కాంగ్రెసు కమిటీ తీర్మానాలను ఖండించుటకు సభ జరుపుమని బోసుగారు నిర్ణయించలేదు. 9 వ తేది "సత్యాగ్రహము రాష్ట్ర కాంగ్రెసు కమిటీ అనుమతిలేనిదే ఏ కాంగ్రెసువాదీ చేయరాదు" అను తీర్మానము, "మంత్రుల చర్యలను బహిరంగంగా విమర్శించరాద"ను తీర్మానాన్ని, మార్పు చేయించవలసిన ఆవసరముగూర్చి ప్రజా సామాన్యానికంతకు తెలియజేయవలసినదిగను, ఈ లోపు ఆ తీర్మానాలనుఆచరణలో పెట్టకుండ ఆపవలసినదిగా వర్కింగు కమిటీకి ప్రజాభిప్రాయమును విన్నవించవలసినదిగను సభలు చేయమని "అతివాదుల ఐక్య సంఘము" (Left Conslidation Committee) కోరినది. ఈ అతివాదుల ఐక్య సంఘములో బోసు నాయకుడుగా గల ఫార్వర్డుబ్లాక్ పార్టీయేగాక, కాంగ్రెసు సోషలిస్టుపార్టీ, కమ్యూనిస్టులు, రైతు సంఘ నాయకులు, రాయిస్టులు, కలిసి ఉండిరి. కాంగ్రెసు సోషలిస్టు పార్టీ సభ్యుడనగుటచే, పార్టీ నిర్ణయము ప్రకారము, నేను 9 వ తేది సభలో పాల్గొని ఉంటిని కాని శ్రీ బోసు చేయమన్నందువల్ల పాల్గొనలేదు.

నే నా సభలో, మీరు జాబులో వ్రాసినట్లు కాంగ్రెసుకు వ్యతిరేకముగా ప్రజలను ప్రోత్సహించి క్రమశిక్షణను భంగపరచి కాంగ్రెసు ప్రతిష్ఠకు తగ్గునట్లునూ, కాంగ్రెసు ప్రధాన నాయకుల యెడ గౌరవము తగ్గునట్లు ప్రవర్తించలేదు.

ఆ సభలో నేను ఇచ్చిన ఉపన్యాస సారాంశ మిది.

కాంగ్రెసులో ప్రజలుచేరి పనిచేస్తూవుండి స్వాతంత్ర్య పోరాటాన్ని పెంపొంద జేసి బ్రిటిషు ప్రభుత్వాన్ని ఈ దేశములో లేకుండ జేయడానికి, బొంబాయిలో ఎ. ఐ. సి. సి. చేసిన పై రెండు తీర్మానాలు ఇట్టి స్వాతంత్ర్యపోరాటానికే నష్టను కలిగిస్తాయని మాఅందరియొక్క అభిప్రాయము.

కాంగ్రెసు మంత్రుల కెట్టి అధికారమూ లేదు. గవర్నరు ఇష్టము వచ్చినపుడు వాళ్ళను తొలిగించివేయగలిగారు. గవర్నరు చేతిలో సైన్యము, ఉద్యోగస్థులూ ఉన్నారు. మంత్రులు ఎంత ప్రయత్నము చేసినా ప్రజలకు కావలసిన చట్టాలు చేయజాలరు. చేసినా వానిని ఆచరణలో పెట్టడానికి మన స్వాతంత్ర్య పోరాటాన్ని నాశనము గావించిన ఉద్యోగస్థులమీద, సైన్యము, పోలీసులమీద ఆధారపడడము వెర్రితనము. తిరిగి బ్రహ్మాండమగు ప్రజాపోరాటము లేనిదే స్వాతంత్ర్యం సున్న. మంత్రులు, కాంగ్రెసులోని మితవాదనాయకులు, (వీరారోజు అధిక సంఖ్యాకులుగా ఉన్నారు.) ప్రజా పోరాటము లేకనే స్వాతంత్ర్యము వస్తుందనుకొనుచున్నట్లు వారిచర్యలు, వారి తీర్మానాలు అనుమానానికి తావిస్తున్నాయి.

కాంగ్రెసు మంత్రులు గావించిన మంచి పనులు కూడా ప్రజలకు అందాలన్ననూ ప్రజలనేక పర్యాయములు సత్యాగ్రహము సాగించక తప్పదు. ఇట్టి సత్యాగ్రహ పోరాటాలనేకాలు దేశమంతటా జరుగుతూ ఉన్నప్పుడే మంత్రుల కడ్డము రావడానికి గవర్నరు భయపడతాడు. ఇట్టి సత్యాగ్రహ పోరాటాలను బలపరచుటవలననే స్వాతంత్ర్యపోరాటముకూడా త్వరలో ఆరంభించగలము. అందుచే బొంబాయిలో తీర్మానాలు స్వాతంత్ర్య పోరాటానికే అంటే కాంగ్రెసు భావానికే వ్యతిరేకము.

ఈ పరిస్థితులలో కాంగ్రెసులో పనిచేస్తూవచ్చిన మేము, కాంగ్రెసును ఈ రకంగా మార్పుచేయడానికి అంగీకరింపజాలని మేము, ఈ తీర్మానాల నష్టము,



స్వభావము స్వాతంత్ర్యము కాక్షించు ప్రతి వ్యక్తికీ తెలియజేసి ఈ తీర్మానాలను రద్దు చేయించడానికి పూనుకోవలసి వచ్చింది. మాకు వేరు గత్యంతరము లేకపోయింది.

కాంగ్రెసు కమిటీలలోను, కాంగ్రెసు సభ్యులలోను ప్రచారము గావించి పై కమిటీ తీర్మానాలను మార్పు చేయించాలసినదేగాని కాంగ్రెసేతరులగు ప్రజలుకూడ వచ్చి పాల్గొను బహిరంగసభలలో ఇట్టి ప్రచారము చేయకూడదని ఒక వాదన తెస్తారు. గాని కాంగ్రెసు, దానిలో నేడు సభ్యులుగా ఉన్న 45 లక్షలమందిసొత్తే కాదు. స్వాతంత్ర్యము కోరు ప్రతి భారతీయునియొక్క నేడు స్వాతంత్ర్యాన్ని కావాలని కోరికపోయిననూ, స్వాతంత్ర్యము రానిచో నష్టపడే ప్రతి భారతీయుని యొక్క సొత్తు. అందుచేత లక్షలకొలదిగా నేడు కాంగ్రెసులో సభ్యులుగా ఉన్నారు. కోట్లకొలదిగా కాంగ్రెసులో సభ్యులుగా చేరి ఈ తీర్మానాలను రద్దు చేయించి కాంగ్రెసుయొక్క స్వాతంత్ర్య ఆదర్శాన్ని లక్ష్యాన్ని కాపాడ వలసినదిగా కోరాను.

ఇది కాంగ్రెసు యొక్కగాని, కాంగ్రెసు ప్రధాన నాయకులయొక్కగాని ప్రతిష్టను భగ్నము చేసినదని ఎవరూ అనజాలరు. పైగా కాంగ్రెసును బలపర్చాము. ఇక ముందుకూడ ఈవిధంగానే బలపరుస్తూ ఉంటాం.

ఈ విధంగా కాంగ్రెసు తీర్మానాలను విమర్శించడానికి ప్రతి కాంగ్రెసు వాదికి అధికారము ఉందని జవహర్‌లాల్ నెహ్రూ, శ్రీ ఆచార్య కృపాలనీ ప్రకటించారు. శ్రీ రాజేంద్రబాబుయొక్క ప్రకటనకుకూడ ఇదే అర్థమని కృపాలనీ తెలియజేశాడు. అయితే వీరి ప్రకటనలలో ఒక్క విషయము తెలుపబడినది. అలా విమర్శించ దలచుకొన్నవారు కాంగ్రెసు కార్యనిర్వాహక వర్గములలో మాత్రము సభ్యులుగా ఉండరాదు. ఈ విషయములో కూడ యేకీభవించజాలము. కార్యనిర్వాహక కమిటీలలో ఉండి కొన్ని కాంగ్రెసు తీర్మానాలను విమర్శించినంత మాత్రాన తీర్మానాలను ఆచరణలో పెట్టుటకు వారు అసమర్థులు కాజాలరు. తమ కిష్టములేని తీర్మానాలనుకూడ ఆచరణలో నేడు చాలమంది కాంగ్రెసువారు, మెజార్టీ నిర్ణయాలకు లోబడి ఆచరణలో పెట్టుతున్నారు. రేపుకూడ ఇట్టి తీర్మానాలను మార్పు చేయించడానికి పనిచేస్తూ, మార్పుచెందు లోపల వాటిని ఆచరణలో పెట్టడానికే కార్యనిర్వాహక వర్గమువారు ప్రయత్నిస్తారు. అందుచే కొన్ని తీర్మానాలను విమర్శించినంత మాత్రమున, వారు కార్యనిర్వాహక కమిటీలలోనైనా ఉండరాదనుట అర్థములేదు.

ఆర్యా, కాంగ్రెసు చరిత్రలో, కాంగ్రెసు తీర్మానాలను మార్పు చేయించడానికి బహిరంగ ప్రచారము గావించుట సర్వ సాధారణ విషయము. అందుచే అట్టి హక్కునే మేమూ ఉపయోగించుకున్నాము. మేము కాంగ్రెసు తీర్మానాలను ఉల్లంఘించి పని ఏమీ చేయలేదు. అందుచే మాపై ఎట్టి డిసిప్లినరీ చర్య తీసుకొనవలసిన అవసరము ఏమీ లేదని విన్నవించుకుంటున్నాను.

భవదీయుడు,

పుచ్చలపల్లి సుందరయ్య.

*

మరికొందరిపై నోటీసులు

జులై 9 వ తేదిన సభలలో పాల్గొన్నారని యీ క్రింది వారిని రాష్ట్ర కాంగ్రెస్ సంఘం సంజాయిషీ అడిగినట్లు మాకు తెలియవచ్చినది.

తెనాలి

(1) ముత్తేవి మాధవాచార్య (తాలూకా కాంగ్రెసు సభ్యుడు)

(2) చింతల సూర్యనారాయణ (అధ్యక్షుడు, తా. కాం. కమిటీ)

(3) ఆరవేటి రామయ్య (జిల్లా కాంగ్రెసు సభ్యుడు)

పాలకొల్లు

(4) ఉద్దరాజు సూర్పరాజు (కార్యదర్శి, తా. కాం. కమిటీ)

(5) భూపతిరాజు బాపిరాజు (ప. గో. జిల్లా ప్రధాన కార్యదర్శి.)

రాజమండ్రి

(6) మద్దూరి అన్నపూర్ణయ్య (ఎ. ఐ. సి. సి. మెంబరు.)

మసానీ ప్రభృతులు మార్క్సిజాన్నే వదలివేశారు

కామ్రేడ్ సజ్జద్ జహీర్

అఖిల భారత కాంగ్రెసు సోషలిస్టు పార్టీ కార్యసంఘ సభ్యుడు

కాంగ్రెసు నాయకత్వం అవలంబించుచున్న దిగజారుడుపాలసీవలన కాంగ్రెసులో చీలికలు. జాతీయ ఉద్యమంలో విఘాతాలు కలిగే సూచనలు కాన్పించుతున్న యీ సమయంలో కాంగ్రెసు సోషలిస్టుపార్టీ కార్యసంఘానికి కామ్రేడ్స్ మసానీ, అశోక మెహతా, పట్వర్ధన్, లోహియా గార్లు రాజీనామా యివ్వడం సోషలిస్టులకు, తీవ్రవాదులకు దిగ్భ్రమ కలిగించింది. రాజీనామాయివ్వడానికి కారణాలు జూన్ 29 బొంబాయినుండి అస్సోసియేటెడ్ ప్రెస్‌ద్వారా ప్రకటించిన స్టేటుమెంటులో వారు వివరించారు.

రాజీనామాలకు కారణాలు

ఆ స్టేటుమెంటు మొదటిభాగంలో రాజీనామా యిచ్చినవారికి, వర్కింగు కమిటీలోని మెజారిటీ సభ్యులకు త్రిపురీ కాంగ్రెసు సమయాన్నుండీ వచ్చిన విభేదాలు విపరించ బడ్డాయి. చివరకు పార్టీ తీవ్రవాద సమ్మేళనం సంఘంలో చేరడానికి తీర్మానించడంతో ఇవి అంతిమస్థాయికి వచ్చాయి. స్టేటుమెంటు రెండో భాగంలో పార్టీ కమ్యూనిస్టులతో కలసి పనిచేయడం వల్లనూ, పార్టీలోకి కొందరిని వారిని జొరబడనివ్వడం చేతను, పార్టీపై కమ్యూనిస్టుల పలుకుబడి హెచ్చిందనీ ఆరోపించారు. ఇంకా కమ్యూనిస్టులు సోవియట్ ప్రభుత్వ ఏజెంటు లగుట చేతనూ, కాంగ్రెసు సోషలిస్టుపార్టీకి కాంగ్రెసుకు మధ్యగల సంబంధము. అహింస, డిమాక్రసీ, సోవియట్ రష్యా, కాలనీల ప్రజలు, యుద్ధం—వీనిపైగల దృక్పథంలో కమ్యూనిస్టులకు సోషలిస్టులకు భేదముండుటచేతనూ, యీ కమ్యూనిస్టు—సోషలిస్టు కలయిక కోరతగింది కాదనియు వారు చెప్పారు.

అంతర్గత విషయాలు తెలియని బయటివారు ఆస్టేటుమెంటు చదివితే, నిజంగా కమ్యూనిస్టులు కొందరు పార్టీలో చేరుటవల్లనూ, కమ్యూనిస్టులతోకలసి పార్టీ పనిచేయుటవల్లనూ యీకలత వచ్చివుంటుందనుకో వచ్చును. అలా జరిగి వుండకపోతే, తమ పాలసీని పార్టీ కార్యసంఘములోని మెజారిటీ అంగీకరించి వుండేదనీ, త్రిపురీ నాటినుండి వచ్చిన విభేదం వచ్చేదేకాదనీ యీ కామ్రేడ్సు ఆరోపించుతున్నారు. అంటే కాంగ్రెసు అధ్యక్షుని ఎన్నికలలో పార్టీ సుభాసుచంద్రబోసుకు (పట్వర్ధన్, లోహియాలవలె) వోటుచేసి వుండేదికాదు; పంతు తీర్మానాన్ని బలపరచేవారు తటస్థంగా వుండకుండా; ఎట్టి సవరణ లేకుండా జవ్హార్‌లాల్ నెహ్రూ తీర్మానాన్ని (కలకత్తా) బలపరచేవారు; పార్వర్డు బ్లాకునుగాని తీవ్రవాద సమ్మేళన సంఘాన్నిగాని ముట్టుకోకుండా దూరంగా వుండేవారన్నమాట.

పైపనులు సోషలిస్టుపార్టీ చేయడం అసంభవమనే సంగతి గమనించితే రాజీనామా యిచ్చిన కామ్రేడ్సు వాదనలలోని తెలివితక్కువ కాన్పించుతుంది. జయప్రకాశ్, నరేంద్రదేవ్, మెహరాలీ, శివనాథబెనర్జీగార్లు ఎల్లాగో "పార్టీలోకి జొరబడిన" కమ్యూనిస్టులని ఎవరూ అనలేరుగదా? లేకపోతే పైకామ్రేడ్సు, కాంగ్రెసు సోషలిస్టుపార్టీ పాలసీకి రాజీనామా యిచ్చిన కామ్రేడ్సు, సరియైన భాష్యం చెప్పగలరంటారా?

వారి వాదనలు :

స్టేటుమెంటులో ఒక్కొక ఆరోపణను వరుసగా చూద్దాము. కామ్రేడ్సు పట్వర్ధను, లోహియాలు, అధ్యక్షుని ఎన్నికలలో బోసుకు ఓటు చేసారు. కాని పార్టీఅంతా — నరేంద్రదేవు, మసానీసహా—బోసుకు ఓటుచేసింది. అందుచే పార్టీఅంతా, ముఖ్యులయిన సభ్యులుసహా, బోసుకు ఓటుచేయడం కమ్యూనిస్టుల ఒత్తిడి చేతనేఅని ఎవరూ అనలేరుగదా?



కామ్రేడ్ జయప్రకాశ్

ఇక కలకత్తాలో నెహ్రూ తీర్మానాన్ని సవరించకపోతే ఎదిరించాలని పార్టీ కార్యసంఘం తీర్మానించిన విషయం తీసికొందాము "బయటివారి పలుకుబడి"వల్ల యీ నిర్ణయం జరిగిందని ఆరోపించ బడుతూంది. పార్టీనిర్ణయం నెహ్రూ తీర్మానాన్ని బలపరచిన జనరల్ సెక్రటరీని చిక్కుపరిస్థితుల్లో పెట్టిందన్నారు. కాని యదార్థ విషయం యిదికాదు. జయప్రకాశ నారాయణ మొదట్లో జవ్హార్‌లాల్ స్టేటుమెంటును బలపరచాడు: దానిలోని ముఖ్యవిషయాలు కొన్ని రఫీ అహమ్మద్ కిద్వాయిచే ఉపపాదించబడిన తీర్మానంలో వదలివేయబడ్డాయి. వదలివేయబడిన విషయాలు చాలా ముఖ్యమైనవని మాలో కొందరనుకొన్నారు. ఏమార్పు లేకుండా పాత వర్కింగుకమిటీని నియమించాలనే తీర్మానం మేము బలపరచకూడదనుకున్నాము ఈ అభిప్రాయానికి రావడానికి "బయటివారి ప్రభావం" అవసరం ఏముంది? పైగా యీ నిర్ణయము—యిద్దరు ముఖ్యులు తటస్థంగా వుండుటవలననే పార్టీ కార్యసంఘం చేసిందనే సంగతి రాజీనామా యిచ్చిన సభ్యులు ఎరుగని విషయం కాదు. పైవారికి కమ్యూనిస్టుల సంపర్కం వుందని ఎవరూ అనలేరు.

రాజీనామా యిచ్చిన సోదరుల మూడో ఆరోపణ యిది. కలకత్తాలో పార్టీకార్యసంఘం పార్వర్డుబ్లాకుతోనే గాకుండా తీవ్రవాద సమ్మేళన సంఘంలో చేరకూడదని నిర్ణయించిందంటున్నారు. అది నిజముకాదు. కార్యసంఘం తీవ్రవాద సమ్మేళన విషయం కమ్యూనిస్టులతో ఆలోచించి నిర్ణయించడానికి ప్రధాన కార్యదర్శికి అధికార మిచ్చింది. అందుచేతనే జయప్రకాశ నారాయణ (జూన్ 18 వ తేదీ) పి. సి. జోషీతో కలసి స్టేటుమెంటు యిచ్చాడు. దానిలో తీవ్రవాద సమ్మేళన సంఘాన్ని ఎన్నుకోడానికి బొంబాయిలో తీవ్రవాదుల కాన్ఫరెన్సు పిలువబడింది. రాజీనామా యిచ్చిన కామ్రేడ్సు కథనమే నిజమయితే, ప్రధాన కార్యదర్శి పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రవర్తించాడన్నమాట. ఇది శుద్ధ అబద్ధం. కార్యదర్శి తీర్మానాన్ని అనుసరించే పనిచేసాడు.

ఆఖరి విషయం కార్యసంఘం బొంబాయి సమావేశంలో తీవ్రవాద సమ్మేళన సంఘంలో జేరడాన్ని గురించి. ఈ నిర్ణయం చేయడంలో పార్టీ తన పాలసీకి విరుద్ధంగా పనిచేసిందా? ఫెయిజ్‌పూర్ పార్టీ కాన్ఫరెన్సులో (1936 డిసెంబరు) నిర్ణయించబడిన థీసిస్‌లో యిలావుంది;

> "సోషలిస్టులలో ఐక్యత, ఒడంబడిక అవసరమగుటయేగాక తీవ్రవాద శక్తులను సమ్మేళనపరచుట, దాని నాయకత్వంలో ఏకాభిప్రాయం కలుగజేయుట, కూడ అవసరము. పార్టీ ఇందుకొరకై కృషిచెయ్యాలి."

ఇపుడు రాజీనామాయిచ్చిన కామ్రేడ్సు ఏవగించుకొంటున్న "తీవ్రవాద-సమ్మేళనం" అనే మాటలలో నూతనమేమీ లేదు: పార్టీ కార్యక్రమంలో స్పష్టంగా అందుకై కృషిచెయ్యాలని చెప్పబడింది. అయితే యిక అభ్యంతరము ఏమిటి? తీవ్రవాదులను సమ్మేళన పరచడానికి యిది తగిన అదనుకాదంటారా? లేక అది నెరవేర్పబడిన విధం వారికి రుచించలేదా?



అచార్య నరేంద్రదేవ్

కార్యసంఘం నిర్ణయమే సరియైనది.

కాంగ్రెసు సోషలిస్టుపార్టీ కార్యసంఘం పూర్తిగా చర్చించి, బాధ్యతను గుర్తించియే యీ నిర్ణయం చేసింది. జయప్రకాశనారాయణ, నరేంద్రదేవుగార్ల సలహాపైనే అంగీకరించబడింది. ప్రస్తుతం కాంగ్రెసు నాయకత్వం అవలంబించు విధ్వంసక విధానాన్ని సరిగా ఎదుర్కోవాలంటే, మనం కోరే రాజకీయ కార్యక్రమాన్ని ఆచరణలో పెట్టాలంటే, తీవ్రవాద సమ్మేళనం అవసరమని గుర్తించియే అలా తీర్మానించింది. కాంగ్రెసు ఐక్యతను కాపాడటానికి, జాతీయ ఐక్యతను సాధించడానికి, అలా చేసింది. దాని ఉద్దేశ్యం మితవాద నాయకత్వంతో (Right wing) పోరాటం కాదు; త్రిపురీ తీర్మానాలను ఆచరణలో పెట్టడానికి; కార్మిక-కర్షకులలో, మధ్య తరగతులలో ప్రచారం గావించడానికి; యుద్ధము పానికావడానికి వ్యతిరేకంగా ఆందోళన గావించడానికి; కాంగ్రెసు సంఘాలను నిర్మించడానికి; వాలంటీరు సైన్యాన్ని ఏర్పరచడానికి; కాంగ్రెసునంతను బ్రిటిషు సామ్రాజ్యముతో పోరాటానికి ప్రోత్సాహపరచడానికి తీవ్రవాద సమ్మేళన సంఘ మేర్పడింది.

తీవ్రవాద సమ్మేళనం కాంగ్రెసులో దిగజారుడువిధానాన్ని అరికట్టుటకు ఒక ఆయుధం. జాతీయవాదులలోని దుందుడుకు తత్వాన్ని అణచివేయడానికి, మితవాదుల పోరాటమే వలదను, తీవ్రవాదులను కాంగ్రెసునుండి తరిమివేయాలను, తత్వాన్ని ఓడించడానికి చక్కని మార్గము.

మనకూ రాయిస్టులకు, మనకూ పార్వర్డు బ్లాకువారికి, అంతకంటే తక్కువగా మనకూ కమ్యూనిస్టులకు అభిప్రాయ భేదాలున్నమాట నిజమే. మనం కాంగ్రెసు నాయకత్వంపై నేడు దండయాత్ర సాగించాలను కోడంలేదు. మరో నాయకత్వం నినాదం అంగీకరించుటలేదు.

మన ప్రస్తుత నాయకత్వం అవలంబించుతున్న దిగ జారుడు పాలసీని మార్చాలి. అదిమనం కాంగ్రెసులోను, యితర ప్రజా సంస్థలలోను, ఆందోళన, ప్రచారం, కనీస హక్కులకై పోరాటం కొనసాగించుటద్వారా జాతీయ ఐక్య సంఘటన నిర్మించుటపై ఆధారపడి వుంటుంది. 'ఓర్పుతో వివరించి', ప్రస్తుతం మితవాద నాయకులను అనుసరించే ప్రజాసామాన్యాన్ని మన కార్యక్రమానికి అనుకూలురుగా చేస్తేనే సాధ్యపడుతుంది. కొన్ని విషయాల్లో యితర తీవ్రవాదులతో భేదించినంత మాత్రాన మనం ఏకీభవించే విషయాలలో ఎందుకు కలసి పని చేయకూడదు, తీవ్రవాదులందరూ అంగీకరించిన కార్యక్రమములో కలసి పనిచేయడం మన సంకల్పాన్ని నెరవేర్చుకోడానికి తోడ్పడుతుంది గదా?

సంయుక్త వర్కింగు కమిటీ యేర్పాటు గావించాలని మనం కోరుతున్నాము; మితవాదులు కలసి పనిచేసి జాతీయశక్తులన్నిటినీ కలిపి పోరాటాన్ని నడపాలని కోరుతున్నాము, కాని రాజీనామా యిచ్చిన ఈ సోదరులకు తీవ్రవాద సమ్మేళనసంఘంలో బోసు, కమ్యూనిస్టులు, రాయిస్టులతో కలసి సోషలిస్టుపార్టీ పనిచేయడమే కఠోరంగా వుంది. ఎందుకని? మనం కాంగ్రెసులోని యింకో గ్రూపుతో కలసిపోయి ప్రత్యేకతను గోల్పోతామట. కాని కాంగ్రెసులో మన పార్టీయే ఒక గ్రూపుకదా? కాబట్టి యీ సోదరుల వాదన రాజకీయంగా పలాయనవాదానికి, శూన్యత్వానికి దారి తీయదా?

మన వ్యక్తిత్వం గోల్పోతామని చెప్పబడుతూంది. కాని అది నిజంకాదు. కాంగ్రెసు సోషలిస్టుపార్టీ ప్రత్యేకంగానే వుంటుంది. పార్టీ నిర్మాణం, ప్రత్యేక సభ్యత్వం, డిసిప్లిన్ అలాగే వుంటాయి. మనపార్టీ తరపున జయప్రకాశ, నరేంద్రదేవ్, మెహరాలీలను తీవ్రవాద సమ్మేళన సంఘంలోకి పంపుతాము:—దాని నిర్ణయాలు అన్నిగ్రూపుల అంగీకారంపై చేయబడుతాయి గాని మెజారిటీవల్లగాదు. అట్టిచో మన పార్టీ ప్రత్యేకత ఎలా నశించుతుంది? కాంగ్రెసులోని ఇతర గ్రూపులతో అంగీకరింపబడిన ఒక కార్యక్రమంపై కలసి పనిచేయడం, ఆ గ్రూపులన్నిటితోగాని వానిలో ఒక గ్రూపుతోగాని ఐక్యమైపోవడమెలాగవుతుంది? రాజీనామా యిచ్చిన కామ్రేడ్స్ అనుమానాలు ఆధార రహితమైనవని తెలిసిపోవటం లేదా?

సోషలిస్టు—కమ్యూనిస్టుల ఐక్యత.

పైన త్రిపురీ తరువాత వచ్చిన సమస్యలన్నిటిని పార్టీ కార్యసంఘం ఎలా పరిష్కరించిందో చెప్పాను. చాలా వాటిలో కమ్యూనిస్టులుకూడా మనతో ఏకీభవించారు కలసి పని చేసారు. సోషలిస్టు ఉద్యమానికి యిలా కలసి పనిచేయడం చాలా అవసరం మన పార్టీ ఎప్పుడూ ఈవిషయమై విముఖత వహించలేదు. ఫైజ్‌పూర్‌లో ప్యాసైన పార్టీ థీసిస్‌లో: "భారతదేశ పరిస్థితులలో సామ్రాజ్య వ్యతిరేక ఉద్యమ నాయకత్వం చైతన్యం పొందిన సోషలిష్టు శక్తులు వహించాలసి వస్తుంది. దురదృష్టవశాత్తు యీ శక్తులు యింకా విడి విడిగా వున్నాయి. పార్టీ సోషలిస్టుల ఐక్యతను కోరుతూంది. కాంగ్రెసులోనూ, ప్రజా ఉద్యమంలోనూ, సామ్రాజ్య వ్యతిరేక పోరాటంలో సంయుక్త నాయకత్వం ప్రధానమైనది. సోషలిష్టులు వేరువేరు మార్గాలు అనుసరించితే గందరగోళ మవుతుంది. జాతీయ పోరాటం వెనక్కి పోతుంది.



కామ్రేడ్ మసానీ

సోషలిష్టు ఐక్యత వచ్చేవరకు, అంగీకరించిన కార్యక్రమంపై కలసి పనిచెయ్యాలి. తద్వారా సంయుక్త సోషలిష్టుపార్టీ నిర్మించేవరకు కృషి చెయ్యాలి."

ఈ పార్టీ థీసిస్ అనుసరించే ప్రధాన కార్యదర్శి పనిచేసాడు. కమ్యూనిస్టులు—సోషలిస్టులు అనేక విషయాల్లో కలిసి పనిచేయుగలిగారు. 1934 లోనూ 3 వ అంతర్జాతీయ కమ్యూనిస్టు మహాసభను కమ్యూనిస్టులు అనుసరించేవారేగా, ఈ మూడు నాలుగేండ్లలో మాస్కోలో సంభవించిన ఎక్కువ కాలేమగదా? నిజంగా కమ్యూనిస్టులపై రాజీనామా యిచ్చిన మిత్రుల దండయాత్ర అసందర్భంగా పిల్ల చేష్టలవలే వుంది. 1938 లాహోరులో జరిగిన పార్టీ మహాసభలో సోషలిస్టు ఐక్యతకొరకు కృషి చేయాలనీ, అంతవరకు కమ్యూనిస్టులతో కలసి పని చేయాలనీ తీర్మానించింది.

దానిలో:— "ఈ కాన్ఫరెన్సు కార్యసంఘం చేసిన పాట్నా నిర్ణయాన్ని బలపరుస్తూ, ఇండియాలో సంయుక్త సోషలిస్టుపార్టీ, నిర్మాణానికి కాంగ్రెసు సోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టులు (Red group) కలసి పనిచేయడం అవసరమని భావించుతూంది. అందుచే యీ పార్టీల ఐక్యతకొరకు ప్రత్యేక జాగ్రత్త తీసికోవాలి." అని వుంది.



కామ్రేడ్ అచ్యుత పట్వర్ధన్

దీనినిబట్టి పార్టీ పాలసీనే రాజీనామా యిచ్చిన మిత్రులు మరచిపోయినట్టు కనబడుతోంది. అందుచేతనే వీరు పార్టీ కార్యసంఘం కమ్యూనిస్టులతో కలసి పనిచేయడాన్ని నేరమనే స్థితికి దిగజారారు.

ఇంకా కామ్రేడులు కమ్యూనిస్టులతో తమకు కాంగ్రెసువిషయంలో, శాంతి సక్రమ పద్ధతుల గురించి, డెమాక్రసీ, సోవియటు ప్రభుత్వం, యుద్ధం, వలసదేశాల ప్రజలు వీని విషయమై భేదాలున్నాయని చెప్పారు. కాని అవేమిటో స్పష్టంగా చెప్పలేదు. పైగా వీరికి, కమ్యూనిస్టులకు మధ్య వున్న సందేహాలు తీర్చడం నాపని కాదు. అవి వారూవారూ చూచుకొంటారు. కాని యీలోగా పార్టీ కార్యసంఘం కమ్యూనిస్టులతో ఎందుకు కలసి పని చేయరాదో నా కర్థమవడం లేదు. కలసి పనిచేస్తూ వుంటే కార్యాచరణలో వచ్చే విభేదాలను చర్చించి, పరిష్కరించుకోవచ్చును. క్రమక్రమంగా అందరూ ఒకే సంయుక్త సోషలిస్టుపార్టీలో ఐక్యమయిపోవచ్చును.

మసానీ మొదలగువారు మార్క్సిజాన్నే ఒప్పుకోరా?

రాజీనామా యిచ్చిన మిత్రులు పార్టీనుండి విడిపోవడానికి యింకా లోతైన కారణాలున్నాయని అనుకొంటున్నాను: మార్క్సిజానికి వ్యతిరేకులవడమే ననుకొంటాను. ఏప్రియల్ 9 కాంగ్రెసు సోషలిస్టు పత్రికలో ప్రకటించబడిన కామ్రేడ్ పట్వర్ధన్ వ్యాసం నా అనుమానాలను బలపరుస్తూంది. దానిలో యిలా వ్రాసారు:—

"గాంధీజీ సమాజ ఆదర్శాలను జేరడానికి ఆచరణాత్మకమైన మానసత్వముతో కూడిన మార్గాలను కనుగొన్నాడని మనము తప్పక అంగీకరించాలి. గాంధీజీ తన విధానాన్ని యింకా విశాలమొనర్చుచుండుట సంతోషకరమైన సంగతి. అందుచే భారతదేశంలో గాంధీజము—సోషలిజము మిశితంజేసి ఒక నూతన సిద్ధాంతాన్ని కనుగొనుట సాధ్యమవుతుంది."

ఇది నిజంగా మార్క్సిజానికి దూరంగా పోవడమే-అవుతుంది. జయప్రకాశ నారాయణ "సోషలిజం ఎందుకు?" అనే పుస్తకంలో ఇలా వ్రాసాడు:

"గాంధీగారి అభిప్రాయాలు, సోషలిస్టుల పరిభాషలో ప్రధానంగా సంస్కరణ తత్వానికి జెంధినవి. దాని భాషమాత్రం భారతీయులది కాని సారాంశం అంతర్జాతీయమైనదే." (87 పేజీ)

"గాంధీజం మంచి ఉద్దేశాలు కలిగి, ఆర్థిక సమస్యను ధైర్యంగా పరిష్కరించ పూనుకోలేక ధర్మబోధలుచేసే ఒక విరికితత్వం" (92 పేజీ)

"గాంధీజం మంచి ఉద్దేశాలు కలిగిన సూత్రమే కావచ్చును, వ్యక్తిగతంగా నేననుగే అనుకొంటున్నాను, కాని అన్నిమంచి ఉద్దేశాలతోకూడా-అలా చెప్పవలసి వచ్చినందుకు విచారంగా వుంది — అది అపాయకరమైన సిద్ధాంతమే అది నిజసమస్యలను దాచిపెట్టి "పవిత్రమైన కోర్కెలతో" సమాజములోని చెడును తొలగించడానికని బయలుదేరుతుంది కాబట్టే అపాయకరమైన సిద్ధాంతము. అందుచేతనే అది ప్రజాసామాన్యానికి మూఢనమ్మకాలు కలిగించి పైవర్గాలు తమ పెత్తనం కొనసాగించడానికి తోడ్పడుతుంది." (111 పేజీ)

రెండు దృక్పథాలకు ఎంతభేదం? రాజీనామా యిచ్చిన కామ్రేడ్సు ఆపుస్తకాన్ని మళ్లీ ఒకసారి చదవమని సలహాయిస్తాను. రాజకోటలో గాంధీజం వినియోగింపబడిన విధము, కాంగ్రెసు ఒకేమతా ఉండాలనే "హోమోజీనిటీ" సిద్ధాంతము ప్రచారంలోవున్న యీ సమయములో గాంధీతత్వముయొక్క మూల స్వరూపాన్ని తెలసికోడానికి తిరిగి ఆపుస్తకాన్ని చదవడం అవసరం. ఈమిత్రులు జయప్రకాశ పుస్తకంలోని అభిప్రాయంతో ఏకీభవిస్తారోలేదో కూడ తెలుపగోర్తాను. శాస్త్రీయ సోషలిజాన్ని గాంధీమహాత్ముని ఆధ్యాత్మికమతంతో మిశితం చేయడానికి సోషలిస్టు పార్టీ అంగీకరించదని, వారు పార్టీవిధానానికే దూరంగా పోతున్నారని రాజీనామా యిచ్చిన కామ్రేడ్సు స్పష్టముగా తెలసికోవాలి.

చిట్టివలస కార్మిక దుస్థితి

చిట్టివలసమిల్లులో 1938 సం॥ ఏప్రెల్ నెలలో జరిగిన సమ్మె టయుములో సుమారు 260 మంది కార్మికులను తీసివేసిరి. నాటినుండి నేటివరకు పై 260 మందిలోనూ సుమారు 200 మందిని తీకుసున్నారు. నేటిసరికికూడా మిగతా సుమారు 60 మందికి నౌకరీలు దొరకలేదు. మొదట సమ్మె షుమారు 3 మాసములు జరిగిన తదుపరి గవర్నమెంటు ప్రకటన కంగీకరించి కార్మికులు పనిలో జేరిరి. ఎకాఎకిని గవర్నమెంటు విచారణకోర్టును నిర్నయించింది. అందులో యిచ్చిన సూచనలు కంపెనీ అమలులో పెట్టలేదు. గవర్నమెంటు అమలులో పెట్టించ లేదు. అందువల్ల సమ్మెకు పూర్వం ఏ యిబ్బందులు పడుచుండిరో తరువాతకూడా ఆ యిబ్బందులకు లోనగుటచే 1939 ఫిబ్రవరి నెలలో స్టే-యిన్-సమ్మెచేశారు కార్మికులు. గవర్నమెంటు కాల్పులు రాత్రిపూట చేయించి లాఠీచార్జి చేయించింది. చాలామందికి దెబ్బలు తగిలేయి. ఒక మనిషి చనిపోయేదుకూడాను. అంను విషయమై నాన్ ఆఫీషియల్ కమిటీగాని నిర్నయించి విచారించలేదు గవర్నమెంటు. తరువాత యేదో రాజీ అయినది. కార్మికులు పనులలోకి వెళ్లారు. ఈ 260 మంది కార్మికులలో కంపెనీవారు సుమారు 200 మందినే తీసుకున్నారు మిగతా షుమారు 60 మందిని నేటివరకు పనిలో వేసుకొనలేదు. కాని క్రొత్తవారిని మాత్రం 21 మందిని వేసుకున్నారు. రాజీ ప్రకారం క్రొత్తవారిని వెయ్యకూడదని ఖండించి పాతవారిని యెందుకు పనిలో వేయించలేదో సుబ్బారావుగారు? పనులుపోయి మళ్ళీ పనులు దొరకక మిగిలివున్న కార్మికులు అధ్యక్షుడైన సుబ్బారావుగారిని అడిగితే యెప్పటికప్పుడే వస్తాయంటూ కాలయాపనచేస్తూ యున్నారు. గట్టిగా అడిగితే మీరు సంఘంలో మెంబర్లుకారు పొమ్మంటాడట. మరి యీ తీసివేయబడిన 60 మందికి నౌకరీలు దొరకే ఆశయేమీ కనిపించటంలేదు. అందుచే వారిలో 4 గురు ఆఖరుప్రయత్నంగా నిరశనదీక్ష పూనడానికి నిశ్చయం చేసుకొని 17-7-39 ని అధ్యక్షుడికి నోటీసు యిచ్చారు. ఆతేదీనే సుబ్బారావుగారు నన్ను కొట్టవచ్చి దూషించిరి. సాయంత్రం మిల్లు వదలిన తర్వాత ప్రస్తుతం పనిచేయుచున్న కార్మికులలో కొందరిచేత నన్ను తిట్టించి కొట్టించ ప్రయత్నించారు. అప్పుడు (1) యమ్. రామచంద్రరాజుగారు (2) హెడ్ కానిస్టేబుల్ 1051 తగరపువలస పోలీసుస్టేషను ఇన్-చార్జీలో వున్నారు. వీరిద్దరికి అధ్యక్షుని మొగమాటమేమీ యుండదని నేను అనుకుంటున్నాను. రాత్రి సుబ్బారావుగారు నన్ను కొట్టప్రయత్నించినట్లే పాపం ఆనలుగురు కార్మికులను భయపెట్టియో, లంచమిచ్చియో వారిచేత నోటీసు ఉపసంహరింపచేయించారు. కాని మొత్తంపైని యీ 60 మంది కార్మికులు పనిలోనికి వెళ్ళకుండా వుంటే శాంతి ఉండేటట్లు కనిపించదు. కాబట్టి సుబ్బారావుగారు యికముందైనా తగినశ్రద్ధ తీసుకొని కార్మికులను సరియైన మార్గాన నడిపిస్తూ మిగిలియున్న కార్మికులను వేగంగా పనిలో వేయించవలసినదని కోరుచున్నాను. నిరంకుశత్వం చెలాయిస్తూ అలిగి వెళ్లిపోతానంటూ భయపెట్టి చిట్టివలస కార్మికులచే దుర్నడతలు నడిపించకూడదని కోరుచున్నాను. అదియే నాయకధర్మం.

ఇట్లు,

శ్రీపాద వెంకటజగన్నాధరావు.

విజయనగరం 20-7-39.

పశ్చిమ గోదావరి జిల్లా కాంగ్రెసు కమిటీ నివేదిక

జమా ఖర్చులగూర్చి పూర్వపు కమిటీ అధికారుల 'సంతాపకర' వైఖరి — నూతన సంఘాధికారుల కార్యవిధానము — రిపోర్టుల విషయంలో జిల్లాబోర్డు సభ్యుల, శాసన సభ్యుల, ఏమరుపాటు.

ది 6-4-1939 నుండి 1-7-1939 తేదీ వరకు అనగా 2 మాసముల 25 రోజులలో జిల్లాలో జరిగిన కాంగ్రెసు పనిని గురించి సంఘాధ్యక్షునిచే యివ్వబడిన రిపోర్టు. ది 2-7-39 తేదీన తాడేపల్లిగూడెంనందు జరిగిన సంఘ సాధారణ సమావేశమునందు ఆమోదించబడెను.

పూర్వపు జమా, ఖర్చుల స్థితిగతులు.

గత సంవత్సర కార్యనిర్వాహకులు, గత సంవత్సర కార్యనివేదికనుగాని, జమా ఖర్చుల బాలెన్సుషీటునుగాని తయారుచేసి ఉంచలేదు. కార్యదర్శి శ్రీయుత ముదిగంటి జగ్గన్నశాస్త్రి గారు తమవద్దనున్న జమా, ఖర్చులు సంఘ చిఠాను అనుసరించి ఒకచిత్తు బాలెన్సుషీటును మాత్రము ఒప్పగించిరి. దానినిబట్టి జిల్లాబోర్డు సభ్యుల రుసుమువలన రు 1848-8-3 ఉన్ను ప్రాథమిక సభ్యుల రుసుమువలన రు 3557-6-3 ఉన్ను, మొత్తం సంఘమునకు వచ్చిన ఆదాయము రు 5405-14-6 ఉన్ను. ఖర్చు రు 5419 ల చిల్లర కనుపించుచున్నది. సదరు చిఠాను అనుసరించి గత సంవత్సరం అధ్యక్షులు శ్రీ ఆంజనేయులుగారి పేర రు 2395-10-0 లకు, సహాయకార్యదర్శి శ్రీ సూర్యనారాయణగారి పేర రు 948-11-6 లకు సహాయ కార్యదర్శి భూ. బాపిరాజుగారి పేర రు 16-0-0 లకు ఖర్చు వ్రాయబడియున్నది. సదరు మొత్తములుగాక యింకా కొంత మొత్తములు సదరు సంఘాధికారులకు వచ్చినట్లున్ను ఆమొత్తముల ఖర్చుకుకూడ వారే బాధ్యులుగా వ్యవహరించినటుల కార్యదర్శిగారు చెప్పినారు. అది సంఘ చిఠాకురాలేదు. కాని వారు వోచర్లు యిచ్చినట్లున్ను, అవి మంగళంపల్లి చంద్రశేఖరంగారివద్ద తనిఖీకొరకు ఉంచబడినవని చెప్పిరి. అది మా ఆఫీసునకు రానందున వాటిని గురించి ఏమియు చెప్పజాలను. యింకా ఏలూరు ఆఫీసు అద్దె వగైరాలకు రు 45 లు చెల్లించాలని స॥ కార్యదర్శి సూర్యనారాయణగారు వ్రాసినారు. జిల్లాబోర్డు అభ్యర్థులలో వందలపు చుక్కయ్యగారు తాము చెల్లించిన రుసుము తాలూకు రు 50-0-0 లు ముదరా రావలయునని వ్రాసినారు. 1936 సంవత్సరములో శ్రీయుత మాగంటి బాపినీడుగారు ప్రసిడెంటుగాయున్న కాలమందు. ఏలూరు స్టేషనరీ వర్తకులు కట్టా సుబ్బారావుగారు తమకు మన సంఘం రు 65-12-0 అసలున్ను రు 27-3-9 లు వడ్డీయున్ను మొత్తము రు 92-15-9 లు రావలసి యున్నదనియు, వారంరోజులలో యివ్వనిచో కోర్టుద్వారా రాబట్టుకోవలసి వచ్చుననియు, ఉత్తరం వ్రాసినారు. వందలకొలది ఆదాయము కలిగిన మన సంఘము యిట్టి అప్పులకొరకు ఉత్తరములు వ్రాయించుకొనుటవల్ల మన సంఘ పరపతికి భంగము కలుగుటయేగాక కాంగ్రెసు సంఘాధికారులపట్ల ప్రజలకు గౌరవభావములు తగ్గును.

యీ సందర్భమున ఒక విషయమును మనము గమనించవలసియున్నది. ఏ మన. జిల్లాబోర్డు ఎన్నికలలో కార్యభార తొందరల వలన జమా, ఖర్చులు కేంద్రీకరింప వీలుబడ నప్పటికి ఎన్నికల అనంతరము 5, 6 మాసములు గడచినప్పటికి కార్యవర్గ అధికారులు తమ తమ వద్దనున్న జమాఖర్చులను సంఘ చిఠాకు కేంద్రీకరింపకపోవుటయు, కార్యవర్గ సభ్యులైనను పూనుకొని సంఘ సమావేశములందైనను జమా, ఖర్చులను కేంద్రీకరింపబడుటకు సంఘాధికారులను హెచ్చరించకుండా నుండుటయు, గమనింపదగిన విషయములు. అటుల గమనింపకపోవుట సంతాపకరమే యగును.

సంఘ సభలు

గత మూడు మాసములలో నేను జరిగిన సభకాక 4 కార్యవర్గసభలు జరిగినవి. సభలకన్నిటికి సోజుపట్టీనిబట్టి 4 గింట మూడు వంతులు సభ్యులు హాజరయిరి. కార్యవర్గ సభలకు అధిక సంఖ్యాకులు హాజరయి సంఘ కార్యవిధాన నిర్ణయములందు పాల్గొనుచున్న సభ్యులు అభివందనీయులు.

కార్యవర్గ సమావేశములందు తీర్మానింపబడిన, పేర్కొనదగు తీర్మానములు:—

1. కాంగ్రెస్ శాసన సభ్యులకు, జిల్లాబోర్డు సభ్యులకు, ఋణముల రాజీ బోర్డు మెంబర్లకు, అధీన సంఘములకు, గ్రామ, తాలూకా, సంఘములకు అధ్యక్షునిచే తయారు చేయబడిన ప్రశ్నావళులను ఆమోదించి జిల్లాలో వివిధరీతుల జరుగుచున్న కాంగ్రెస్ పనుల కార్య నివేదికలను జిల్లాలోని పరిస్థితులను తెలుసుకొనుటకున్ను ఆయా మెంబర్లను నివేదికలను పంపగోరుట.

2. త్రిపురీ జాతీయవాంఛా తీర్మాన ప్రచారపు యేర్పాట్లు గావించుట.

3. వలంటీరు శిక్షణా శిబిరమును ఏర్పాటు చేయుటకు తీర్మానించుట.

4. బడ్జెటును ఏర్పాటు చేసుకొనుట.

5. మద్యపాన నిషేధ చట్టమును జిల్లాలో అమలు జరుప ప్రభుత్వమును కోరుట

6. ప్రకాశం కమిటీ నివేదిక సూచనలను ఆం. రా. రైతు సంఘ సవరణ సూచనలతో శాసన మొనర్ప ప్రభుత్వాన్ని కోరుట.

7. వ్యవసాయ కూలీల ఆర్థిక స్థితిగతులను విచారించుటకు కమిటీని ఏర్పాటు చేయుట.

8. సంఘ కార్యదర్శులకు పనులను ప్రత్యేకించుట.

9. ప్రాథమిక సభ్యత్వ రుసుమును స్థానిక సంస్థలు శాసన సభలు మున్నగు ఎన్నికల ప్రచారమునకు వినియోగించ రాదని తీర్మానించుట.

10. పాలక వర్గమునకు ప్రచారకులకు రైలుబండి, బస్సు ఖర్చులు గాక రోజు ఒకటికి 12 అణాలు ప్రయాణ భత్యము క్రింద నిర్ణయించుట.

11. కార్యవర్గ సభలకు హాజరయిన సభ్యులకు 12 అణాల చొ॥ బేటా ఇవ్వ నిర్ణయించుట.

12. బిల్లులతోబాటు తాము గావించిన పనిని గురించి వ్రాతమూలకమైన రిపోర్టు లేనిదే బిల్లులు మంజూరు చేయకూడదని తీర్మానించుట

13. ఆఫీసు మేనేజరుగా టి వి. చలపతిగారిని నియమించుకొనుట.

14. జిల్లాలో గ్రామసంఘములను తనిఖీ చేయుటకు వాటిని పనిచేయించుటకు కృషి చేయుటకూ మున్నగు కాంగ్రెస్ ప్రచారమునకు ఆర్గనైజరుగా శ్రీ ఉ. రామంగారిని నియమించుట.

సంఘాధికారుల కార్య విధానము.

సంఘాధికారు లందరూ తాము గావించిన పనుల గురించి రోజువారీ డైరీలను వ్రాతమూలకముగా నుంచ గోరబడిరి ప్రతి వర్కింగ్ కమిటీ మీటింగ్‌లో సంఘాధికారుల డైరీలను గురించియూ అధీన సంఘముల రిపోర్టుల ననుసరించియూ అప్పటికి జిల్లాలో జరిగిన కార్యక్రమ నివేదికను జమా ఖర్చుల నివేదికనూ అధ్యక్షునిచే చదువబడు చుండెను.

డైరీలను, అధ్యక్షులు, సహాయ కార్యదర్శి పేటేటి వెంకటరత్నంగార్లు మాత్రము తప్పని సరిగా ఆఫీసునకు ఇచ్చుచుండిరి.

సంఘాధికారుల విచారణ రిపోర్టులు అధీన సంఘముల యొక్క తనిఖీ రిపోర్టులు ఎప్పటికప్పుడు కార్యవర్గము యెదుట చదువ బడుచుండెను సాధ్యమైనంతవరకు ఆఫీసుకు వచ్చు వుత్తరములకు వెంటనే జవాబులు ఇవ్వబడుచుండెను. పిటీషనులపై అవుసర చర్య గైకొనుటకు ఆఫీసునకు తగినంతమంది గౌరవ సేవకులుగాని వేతన సేవకులుగాని లేనందున పిటీషన్ల విచారణలలో పూర్తిగా పాల్గొని అవుసర చర్యలను గైకొనజాలకుంటిమి.

మాకు రాబడిన లంచగొండి పిటీషన్లు మున్నగు ప్రజలనుండి వచ్చు పిటీషన్లును స్థానిక సంబంధించిన వాటిని ఆయా తాలూకా సంఘములనే విచారించి రిపోర్టు చేయవలసినదిగా కోరుచు అవుసర చర్యతీసుకొన గోరుచు హెచ్చరించు చుంటిమి. అందువలన స్థానిక వ్యవహారములను స్థానిక సంఘములు చూచుట మూలముగా వారికి విషయానుభవము చేకూరగలదు. పని విధానమును తెలుసుకొనగల్గుదురు. మరియు ప్రజలలో స్థానిక కాంగ్రెస్ సంఘముల పట్ల గౌరవ ప్రతిష్ఠలు అతిశయించుటకు ఎక్కువ అవకాశము కలదు. ఈ విషయములను దృష్టి నిడుకొనియే సాధ్యమైనంతవరకు ప్రతి స్థానిక కార్యమును వారు చేయ హెచ్చరింప బడు చుండిరి.

సంఘము గావించిన పనులు.

1. సంఘము తరపున అధ్యక్షునిచే జిల్లా బోర్డు మెంబర్లు, శాసనసభ్యులు, ఋణముల రాజీబోర్డు మెంబర్లు, తాలూకా సంఘములు వారి నియోజకవర్గ పరిస్థితులను తెలుపుచూ వారు చేయుచున్న కార్యక్రమ రిపోర్టులు పంపవలసినదిగా కోరబడిరి.

2. జాతీయవారం, రాజకీయ ఖైదీల దినోత్సవం, జరుపవలసినదిగా సర్క్యూలర్లు అధీన సంఘములకు పంపబడెను.

3. జాతీయవాంఛా, యుద్ధ వ్యతిరేక ప్రచారం, కాంగ్రెస్ చరిత్ర మున్నగు విషయాలను గురించి గ్రామాదులలో కాలినడకను ప్రచారం గావించవలసినదిగా అన్ని తాలూకా సంఘములు కోరబడెను.

4. అధ్యక్షునిచే చాలవరకు అధీనసంఘములు తనిఖీచేయబడి రికార్డుల నుంచుటలోనూ, జమాఖర్చులు వ్రాయుటలోనూ, అవుసర సలహాలు ఓరల్‌గానూ సర్క్యూలర్సు ద్వారాను, ఇవ్వబడెను. అధీనసంఘము లన్నింటిని కార్య, జమాఖర్చుల నివేదికలు పంపకోరబడిరి.

5. సంఘం తరపున లంచగొండి కమిటీ నియామకం జరిగినది. కాని పనిచేయుట యందు శ్రద్ధ కనబర్చనందున రద్దుచేయబడెను.

6. వ్యవసాయ కూలీల ఆర్థిక విచారణ కమిటీ గత 20 రోజుల క్రిందట ఏర్పాటు కావింపబడెను.

7. అధీన సంఘములచే శ్రద్ధగా పని చేయించుటకు ప్రయత్నించుచుంటిమి. వారును శ్రద్ధతో పనిచేయుటకు అభిలషించుచున్నారు గాని కొన్ని సంఘాలవారు చేయలేకపోవుచున్నారు.

మురుగు కాల్వ: నర్సాపురం తాలూకా వాలమర్రు గ్రామ రైతులు మురుగు కాలువ కావలయుననిన్ని, మురుగు కాలువ లేని కారణమున భూములు పండక పాడవుచున్నవనిన్ని, వ్రాసినదాని మీదట స్వయముగా వెళ్ళి భూములనన్నిటిని చూచి, మురుగు కాలువకొరకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీయరు గారికిన్ని, సూపరింటెండెంటు ఇంజనీయరుగారికిన్ని సబ్ డివిజనల్ ఆఫీసరుగారికిన్ని అర్జీలు వ్రాయించితిమి.

పెనాల్టీలు: నర్సాపురం తాలూకా గోరింటాడలో రెండవ పంటకు పెనాల్టీ వేసిరనియు, వాటి విషయము జిల్లా కలెక్టరుగారితో మాట్లాడి పెనాల్టీ తగ్గునట్లు తగు ఏర్పాటు చేయించవలసినదిగా వచ్చిన పిటీషను విషయము జిల్లా కలెక్టరు గారితో మాట్లాడగా అప్పీలు చేసుకోవలయుననిన్ని అప్పీలు వచ్చినప్పుడు విచారించెదనని చెప్పిన మీదట రైతులకు తెలియపర్చితిమి.

ఆక్రమణ: నర్సాపురం తాలూకా వుంటాడ అగ్రహారం కాపరస్తులు ఆక్రమణ చేసిరని యిండ్లను 26-6-39 తేదీన పీకివేసిరనిన్ని యింకా వున్న ఇండ్లకొరకు స్టే ఆర్డరు వచ్చుటకు ప్రయత్నము చేయవలయునని వచ్చిన పిటీషను విషయము నర్సాపురం సబు కలెక్టరుగారు పెరవలి క్యాంప్‌లో యుండగా వెళ్లి జులై 10 వ తేదీవరకు స్టేఆర్డరు ఇచ్చి అప్పీలు చేయకపోతే మరల పీకించెదమని చెప్పినారు.

రైతులకు స్టే ఆర్డరు ఇచ్చి అప్పీలు చేయవలసినదిగా చెప్పితిమి.

తగవులు: చింతలపూడి తాలూకా గోకవరం శివారు అన్నవనేని వారి గూడెం రైతులు భూముల వద్ద తగవుపడగా పరిష్కారము చేసితిమి.

ఏలూరు తాలూకా సోమవరప్పాడు వ్యవసాయ కూలీలు పంపిన పిటీషను విచారణకొరకు సోమవరప్పాడు వెళ్ళి రైతులను, కూలీలను సంయుక్త సమావేశ పరచి రాజీకొరకు ప్రయత్నించగా విఫలమైనవి.

కేసు విచారణ: కాశీపట్టణపు రైతులకును జమీందారునకును జరుగుచున్న వ్యవహారము కలెక్టరుగారు విచారణచేయు సందర్భమున రైతులకు సలహాలిచ్చుట, విచారణలో పాల్గొనుట జరిగినది.

కార్యవర్గ ప్రథమ సమావేశమునందే అధ్యక్షునిచే తయారు చేయబడిన ప్రశ్నావళులు ఆమోదింపబడి ఆయా సభ్యులకు అధీన సంఘములకు అందజేయబడినవి. అందజేసి 2 మాసముల 15 రోజులైనప్పటికిని శాసన సభ్యులెవ్వరును జవాబులొసగలేదు. రెండు మాసములకు 11-6-39 నాటికి 15 గురు జిల్లాబోర్డు సభ్యులును దరిమిలా 13-6-39 శ్రీమతి అల్లూరి అన్నపూర్ణమ్మగారును 16-6-39 శ్రీ కొ॥ గోపాలరావుగార్లు మాత్రం జవాబులు ఇచ్చివుండిరి. మన కార్యావర్గ సభ్యులలో శ్రీ అ. బాపన్నగారు మనసంఘ ప్రధాన కార్యదర్శిగారు బాపిరాజుగారు బోర్డు మెంబర్లయివుండి జవాబులు ఇవ్వకపోవుటయూ బోర్డు పార్టీ కార్యదర్శిగారగు శ్రీ మే. రంగయ్యగార్లు జిల్లా పార్టీకి జవాబులు ఇవ్వకపోవుట గమనీయాంశములు. ఏమన పైన చెప్పిన ఇద్దరు మన కార్యవర్గసభ్యులు అయివుండియు కార్యవర్గ తీర్మానమును తామే అమలు చేయకపోవుటయు, అందొకరు, బాపిరాజుగారు ప్రధాన కార్యదర్శి అయి వుండి బోర్డు మెంబర్లనందరిని జవాబులు యివ్వమని శాసించు అధికారముగల్గి వున్న తామే జవాబు యింతవరకూ యివ్వలేకపోవుటయు, బోర్డు పార్టీకి కార్యదర్శిగాయున్న మే. రంగయ్యగారు జవాబు లొసంగునటుల చూడవలసిన బాధ్యతగల ఉద్యోగిఅయివుండి తామే యింతవరకు జవాబు లివ్వకపోవుట. సంఘములో అత్యంత బాధ్యతగల వారే తమవిధిని తప్పిన వారగుచుండుట గమనీయాంశముకాదా?

పై విషయములనుబట్టి 38 గురు సభ్యులలో 19 గురు సభ్యులుమాత్రం జవాబు లొసగిరి. మిగతా 19 గురు సభ్యులను జవాబులివ్వ హెచ్చరింపవలసి యున్నది.

శాసనసభ్యులు అసలే పంపలేదు. సభ్యులు తమంతట తాము తెలుపకపోయినను కోరినప్పుడైనా తెలుపకపోవుట చూడ తాము గావించిన పనులను తమ నియోజకవర్గ పరిస్థితులను గురించి సంఘమునకందజేయుటవలన కాంగ్రెస్ సంఘ కార్యనిర్వాహణమార్గముల అన్వేషణకు, తోడ్పడుటయేగాక తమ గౌరవప్రతిష్ఠలకు తమ భావిజీవితోన్నతికి ఎక్కువ అవకాశములు కల్పించుకొనిన వారగుదురను విషయమును గమనింపకపోవుటయే. జవాబులు పంపని మెంబర్లు అందరు పనిచేయుటలేదని చెప్పజాలనుగాని, చేయువారు రిపోర్టులు పంపకపోవుటవలన ప్రజాసంస్థయగు కాంగ్రెస్ సంఘంద్వారా నియమింపబడిన సంఘమువల్ల తాము నిర్వహించవలసిన ధర్మమును పాటించుటలేదని అనుకొనవలసి వచ్చుచున్నది.

రాజకీయ ఖైదీల దినోత్సవం.

నర్సాపురం తాలూకాలో 13, భీమవరం 16 తణుకు 8 తాడేపల్లిగూడెం 4, కొవ్వూరు 4, మొత్తం 45 గ్రామములలోనూ ఏలూరు, నర్సాపురం, పాలకొల్లు, పెనుగొండ పట్టణ సంఘములు మాత్రం జరిపినవి. జరుపని పట్టణ సంఘములకు హెచ్చరికలు పంపబడెను. తాలూకా సంఘాలవారు గ్రామ సంఘాలను హెచ్చరించి దినోత్సవాలు కాంగ్రెస్ సంఘమున్న ప్రతిచోట విధిగా జరుగు ఏర్పాటులకు అధీన సంఘాలు, సంఘ సభ్యులు తప్పక కృషి చేసినగాని జయప్రదంగా జరుపబడవు. కావున వారిని మనం హెచ్చరించవలసి వున్నది.

జాతీయవాంఛా ప్రచారము జూన్ నెలలో నర్సాపురం తాలూకా సంఘాధికారులు శ్రద్ధ వహించి ప్రచారక దళాలను బయలుదేరదీసిరి. నర్సాపురం తాలూకావారు 20 గ్రామాదులలోనూ. భీమవరంవారు 13 గ్రామాదులలోను, గావించిరి. వారం, పదిరోజులు ఎండలలో కాలినడకను ప్రచారము గావించిన ఆ తాలూకా సంఘాలవారిని, దళసభ్యులను అభినందించాలి.

పశ్చిమ గోదావరి జిల్లా కాంగ్రెసు కమిటీ అధ్యక్షులు



కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారు

తాడేపల్లిగూడెంవారు సంచార కార్యక్రమం ప్రకటించియూ కోరబడిన వుపన్యాసకులు రానందున విరమింపవలసి వచ్చెనని తెలిపిరి. కొవ్వూరువారు చేయదలచియు వ్యవసాయ తరుణములగుటచే వాయిదా వేసికొనినటుల వారు పంపిన తీర్మానమువలన తెలియుచున్నది. తణుకు తాలూకాలో ఎన్నికోద్యోగులవల్ల 17 గ్రామాదులలో బహిరంగ సభలు జరిగినట్లు కన్పడుచున్నది. ప్రచారదళాన్ని రేవు 6 వ తేదీనుండి బయల్దేరదీసి ప్రచారం గావించుటకు ఏర్పాట్లు జరుగుచున్నటుల కార్యదర్శిగారు చెప్పిరి. చింతలపూడి, ఏలూరు తాలూకాలలో కదలికే కనపడదు.

గ్రామ సంఘములు

నర్సాపురంతాలూకాలో 50, భీమవరం 40, తణుకు 40, తాడేపల్లిగూడెం 17 మొత్తం 147 గ్రామసంఘములు ఏర్పాటు చేయబడినవి. కొవ్వూరు, ఏలూరు, చింతలపూడితాలూకాలనుండి రిపోర్టే లేదు. కారణం సంఘముల ఏర్పాట్లు చురుకుగా కొనసాగించక పోవుటయే, కాని నా యెంక్వైరీవల్ల కూడా ఆ తాలూకాలలో అచ్చటచ్చట ఏర్పడినవి, కాబట్టి తాలూకాసంఘాధికారులకు విధిగా రిపోర్టులు పంప హెచ్చరించవలసియున్నది కోరబడిన నివేదికలు, జమాఖర్చులు ప్రతి మాసము భీమవరం, నరసాపురంవారు పంపుచున్నారు. తణుకు సంఘంవారుకూడా ఈనెలలో సమగ్ర రిపోర్టుపంపిరి. గ్రామసంఘాల విషయమై శ్రద్ధ వహించుచున్నారు. కొవ్వూరువారు జమాఖర్చుల నివేదికను మాత్రం అందజేసిరి. చింతలపూడి వారు జమాఖర్చులను మాత్రం పంపిరి. కాని కార్య నివేదికలు పంపలేదు. పెనుగొండ పట్టణం, ఏలూరు, తప్ప మిగతా పట్టణసంఘములు నివేదికలు, జమాఖర్చుల నివేదికలు, పంపలేదు. ఈనెలలో భీమవరం ఇంకా నివేదిక పంపలేదు. జనరల్‌గా అధీనసంఘములలో నర్సాపురంతాలూకా సంఘంవారు రికార్డు, జమాఖర్చులు వుంచడంలో, ప్రచార కార్యక్రమం సాగించటంలో, జవాబు లొసగుటలో అన్ని విధములా కాంగ్రెస్ పనులను సంతృప్తికరముగా చేయుచున్నది. అందులకు ఆసంఘాధికారుల శ్రద్ధ, పనిచేయాలను దీక్షలే కారణాలు. వారలను అభినందించాలి తర్వాత భీమవరం, తణుకు తాలూకాలు పనిచేయగల్గుచున్నవి. మిగతా తాలూకా సంఘములు అంతగా పనిచేసినటుల గన్పడదు. ఏలూరుతాలూకా సంఘం ఏభోగట్టాను బంపుటలేదు. ఏమీ పని చేయుచున్నటుల గన్పడదు. కాన ఆసంఘము వారిని హెచ్చరించవలసివున్నది. పట్టణ సంఘాలలో పెనుగొండ, ఏలూరు నుండి కొంత వరకు రిపోర్టులు వచ్చుచున్నవి. పాలకొల్లు అత్తిలి మున్నగు సంఘాలనుండి రిపోర్టులు అసలే లేవు వారిని మనం హెచ్చరించవలసి వున్నది.

సంఘం తరపున ఏర్పడిన లంచగొండి కమిటీవారు పనులను నిర్వహింపజాలక పోయినందున కమిటీని రద్దుపరచుకొని ఆయా పనులను ఆయా తాలూకా సంఘములవారినే స్థానికంగా చూడాలని కోరబడడమైనది. వ్యవసాయ కూలీల ఆర్థిక పరిస్థితులను విచారించి రిపోర్టు చేయుటకు కమిటీని కొలదిరోజుల క్రితమే నియమించితిమిగాని వారు పని యింకా ప్రారంభించలేదు. వ్యవసాయముల అనంతరము ఆకమిటీ పని ప్రారంభించకలదని ఆశించుచున్నాను. వ్యవసాయ కూలీల ఆర్థికవిచారణ కొరకు ఒక ప్రశ్నావళి తయారు చేయబడెను

గత మేనెలలో వాలంటీరు శిక్షణాశిబిరము నేర్పాటు గావించుటకు యత్నించియు కొంచెం ఆలస్యంగా కార్యనిర్వాహణకు పూనుకొనుటచే వుపాధ్యాయులు దొరకని కారణమున విరమించుకొనవలసి వచ్చినది. కారణం ఆనెలలో పలుచోట్ల విద్యాలయాలు సాగింపబడుటయే. రాష్ట్ర సంఘంవారు శిక్షణాశిబిరము ఏర్పాటు చేయుటకు పూనుకొనుట సంతసప్రదం. మనం ఆశిబిరమునకు కనీసం 15 మందిని పంపవలసి వున్నది. మరియు వ్యవసాయముల అనంతరం సెప్టెంబరు అక్టోబరు నెలలో స్థానిక శిబిరములు ఏర్పాటు గావించాలని దలచుచున్నాము. అందులకు సంఘ సభ్యులందరు తోడ్పడాలని కోరుచున్నాను.

ఈ సంవత్సరం అధీనసంఘములఎన్నికలు ప్రశాంతంగా జరుగుట ప్రశంసార్హము.

ఇట్లు,

కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి.

ప. గో. జిల్లా కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు.

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి మహాసభ

16 వ ఆంధ్రరాష్ట్ర విద్యార్థి మహాసభ ఆగష్టు 12, 13 తేదీలలో కాకినాడలో శ్రీమాన్ జొన్నలగడ్డ రామలింగయ్యగారి అధ్యక్షతను జరుగును. శ్రీ సుభాష్ చంద్రబోసుగారు సభ ప్రారంభకులుగా ఆహ్వానింపబడిరి.

రాష్ట్రి ఒలింపిక్స్, చర్చలు, వక్తృత్వపోటీ పరీక్షలు, మొదలగు విషయములతోకూడిన కార్యక్రమమును ఆహ్వానసంఘమువారు నిర్ణయించిరి. త్వరలోనే పూర్తి కార్యక్రమము ప్రచురించబడును. మహాసభను జయప్రదముగ జరుపుటకు ఆహ్వానసంఘమువారు చురుకుగా పనిచేయుచున్నారు.

ఈక్రింది విషయములను ప్రతివిద్యార్థి సంఘము గమనించవలెను.

1. స్థానిక విద్యార్థి సంఘముల కోరిక ననుసరించి, సభ్యులను చేర్పించుటకు ఆఖరు తేది 15 నుండి తుదివరకు పొడిగించబడినది.

2. సభ్యత్వపట్టీలు, రాష్ట్రిరుసుము 0-0-6 రాష్ట్రికార్యాలయమునకు ఆగస్టు 5 వ తేదీ లోగా చేరవలెను.

3. స్థానిక విద్యార్థి సంఘములు మహాసభకు ప్రతినిధుల నెన్నుకొని ప్రతినిధులపట్టిక రుసుము (1-0-0 చొ॥) ఆగస్టు 5 వ తేదీ లోగా పంపవలెను.

పైవిషయముల నెరవేర్చని విద్యార్థి సంఘములు వెంటనే రద్దుచేయబడును.

జి. రామకోటేశ్వరరావు,
కార్యదర్శి.

* * *

జులై 30 "డిటెన్షను" దినము

ఆంధ్రరాష్ట్రి విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శి శ్రీ జి. రామకోటేశ్వరరావుగారిట్లు వ్రాయుచున్నారు:—

గత సంవత్సరము రాష్ట్రిమందంతటా డిటెన్షను విధానము నెదుర్కొనుటకై, అనేకచోట్ల సమ్మెలు చేయబడినవి. కాని యింతవరకు డిటెన్షను విధానము రద్దు కాలేదు. పైగా విద్యాధికారులు అనేకచోట్ల సంవత్సర ప్రారంభమందే డిటెన్షను నెదిరించకుండునట్లు విద్యార్థుల నుండి హామీ పత్రములను పుచ్చుకొనుచున్నటుల తెలియుచున్నది.

కాన అధికారుల దౌర్జన్యము నెదిరించుటకు ఇప్పటి నుండియే రాష్ట్రిమందంతట విద్యార్థి సంఘములు ఆందోళన చేయవలెను. కనుక జులై 30 వ తేదీని రాష్ట్రిమందు డిటెన్షను దినముగా పాటించి ప్రతి విద్యార్థిసంఘము ఈ క్రింది కార్యక్రమమును అమలు జరుపవలెనని కోరుచున్నాను.

1. అసమ్మతి సభలు
2. ఊరేగింపులు
3. అధికారులవద్దకు డిప్యుటేషన్లు
4. ఇతర ప్రజాసంస్థల సానుభూతి సంపాదించుట, తీర్మానములను అధికారులకు, రాష్ట్రి కార్యాలయమునకు పంపవలెను.

చీనా రోదనం

రచయిత:

త్రిషియోకోవ్

అనువాదం:

శ్రీ కృత్తివాసతీర్థులు

(నవ్యసాహిత్య పరిషత్తు)

పాత్రలు

★ తెల్లవాళ్లు

కెప్టెన్—'చీనన్' తుపాకీ పడవ
లెఫ్టనంట్ కాపర్
బ్రూచ్‌లే అతని భార్య, కుమార్తె కార్టీలియా—ఫ్రెంచి వ్యాపారులు
అష్‌లే—అమెరికా కంపెనీ ఏజంటు
మిషనరీ, బోటువాడు, నావికులు
అమెరికన్ పత్రికా విలేఖరి
ప్రయాణీకుడు, ఆతని భార్య

★ చీనావాళ్లు

డాయిన్—జమీందారు
తాయ్‌లీ—ధనిక వ్యాపారి
ఛీ—బోటువాడు, భార్య, కుమార్తె
ఫీ—కళాసుల యూనియన్ చైర్‌మన్, వాడి భార్య
విద్యార్థి—డాయిన్ తరపున దొరలతో ఇంగ్లీషు మాట్లాడుతాడు
ముగ్గురు కళాసులు, ఒక ముసలి కళాసు
రెండో కళాసు భార్య, కొడుకు
అమా—తెల్లవాళ్లకు తార్పుడుకత్తె
హొషాంగ్—చైనా జాతీయ సన్యాసి
రేడియో స్టేషన్ కొలిమి కూలీ
తెల్లవారి పడవమీద పనిచేసే కుర్రవాడు
పోలీసు, ఊరివాళ్లు

అమా

చిత్తం దొరా!

విలేఖరి

దాన్ని ఆసుపత్రికి తీసుకుపోయి డాక్టర్ పరీక్ష చేయించి సర్టిఫికేట్ తీసుకురావాలి, లేకపోతే బేరం కుదరదు. (అష్‌లేవైపు) ఈ చైనా ఆడు పిల్లలు జబ్బులు ఎలా నయం చేసుకుంటారో ఆశ్చర్యం! (చేతి గడియారం చూసి అష్‌లేతో) నేనింక వెళ్ళిపోవాలి. మీ తోళ్ళ వ్యాపారం శ్రద్ధగా చూసుకోవాలి. (విలేఖరి అమాతో నిష్క్రమిస్తాడు.)

అష్‌లే (విలేఖరి వెళ్లుతున్నప్పుడు చూడక దళారివైపు చూచి) ఏయ్. కూలీజనంతో రాజీ షరతులు ఏం పెట్టావు?

దళారి

పది.

అష్‌లే

ఏమిటా పది!

దళారి

పది సెంట్లు.

అష్‌లే

చైనా షావుకార్లు కూలీలకు పదికాపర్లు ఇస్తున్నారు. (దళారి మాట్లాడక ఖంగారు పడతాడు) కూలీవాళ్ళతో చెప్పు. రేపట్నించీ రేటు తగ్గుతుందని.

(దళారి సందేహ పడతాడు) ఏం తెలిసిందిగా!

(దళారి తలఊపి, కూలీ జనంలో ప్రవేశించి బిగ్గరగా మాట్లాడు తాడు. కూలీలు కోపం చూపిస్తారు.)

ఛీ (బోటువాడు అష్‌లే దగ్గరకు అమాంతంవచ్చి విసురుగా దొర ముఖంవైపు వేళ్లు చూపి) పదిసెంట్లు! పదిసెంట్లు! (అష్‌లే చెయ్యి ఎత్తు తాడు. గోల తగ్గుతుంది.)

అష్‌లే

మీ చైనా వాళ్ళకంటె నే నెందుకు ఎక్కువ రేటు ఇయ్యాలి! నేను అమెరికన్ ప్రజా స్వామ్యవాదిని. కూలీ రేటు అందరికీ సమానంగా వుండా లని నా మతం.

(చప్పట్ల వర్షం. దొర తన మాట అందరికీ వినపడాలని చెప్ప బోయిన కొద్దీ, చప్పట్లు కేకలు ఎక్కువ అవుతవి. అష్‌లే ఏం చెయ్యలేక పోతాడు.)

అష్‌లే (దళారివైపుకు తిరిగి)

ఈ వెధవమూక ఎంతమంది?

దళారి (కూలీల లెక్క చూస్తూ)

యాభైమంది.

అష్‌లే

ఒక్కొక్కడికి పది చొప్పున (దళారి కూలీ ఇవ్వబోతాడు. కూలీ లంతా డబ్బు తీసుకోరు. నిరాకరిస్తారు) నా చేతికియ్యి. (డబ్బుసంచి పట్టు కని, గుప్పిడితో డబ్బు జనంలో చల్లుతాడు. క్షణంసేపు జనం నిశ్శబ్దం. వెంటనే జనం తోసుకుంటూ అలజడి చేస్తుంది. ఛీ చేతులోంచి డబ్బులు జారిపోతవి. డబ్బులకోసం కూలీలు కొట్టుకొంటూ పీకలు కోసుకోడానికి అన్నట్లు సిద్ధమవుతుంటే, దొర వింతగా చూస్తుంటాడు. కూలీల దొమ్మి అణచివెయ్యడానికి చైనా పోలీసువాళ్లు ప్రవేశిస్తారు. కూలీలను పోలీసులు బెత్తాలు పుచ్చుకొని కొడతారు. కూలీవాళ్ల కేకలమధ్య ఒక తెల్లజాతి ప్రయాణీకుడు అతని భార్య ప్రవేశిస్తారు. పోట్లాట జరుగుతుంటే ఆ తెల్ల వారుమాత్రం ముట్టుకోరు. ప్రయాణీకుడు చాలా పొడగరి. బంగారపు ఫ్రేము కళ్లద్దాలు పెట్టుకొన్నాడు. అతని భార్య బొద్దుగా బరువుగా వుంటుంది. మధ్యవయస్సు. అతనిచేతిలో 'గైడ్', 'కోడక్' కెమిరా వుంటవి. ఇద్దరు కూలీలు జనంలో తోవ యిస్తూన్నారు వాళ్ళిద్దరికీ. ప్రయా ణీకుడు, అతని భార్య కొండ ఎగువకు ఎక్కుతారు.)

భార్య

అవునండీ. (ఈ లోగా 'ఛీ' అష్‌లేమీదికి లంఘించి పట్టి చేతులు కోపం కొద్దీ విసురుతాడు)

ఛీ

పదిసెంట్లు, పదిసెంట్లు ఇప్పించాలండి. (అష్‌లే చేతికర్రతో కూలీ వాణ్ణి దూరంగా నెట్టివేయ ప్రయత్నిస్తాడు. పోలీసులు శాంతి నెలకొల్పే యత్నం చేస్తారు)

భార్య

నాథా! ఎంత సరదాగా వున్నదండీ ఈ దృశ్యం! (క్రిందపడి తన్ను కొంటున్న ఛీ వైపు నడిచి, కెమిరా ఫోకస్ చేస్తుంది) అష్లే నదివైపు చప్పట్లు విని అటువైపు నడుస్తాడు, 'ఛీ' నిరాశతో శూన్యంగా చూస్తు దొరగారివెంట పడతాడు దళారివైపు 'ఛీ' తీవ్రంగా చూస్తాడు.)

భార్య (ఛీవైపు తిరిగి)

నీ ముఖ వైఖరి మార్చుకోరా. నేను ఫోటో తీస్తున్నాను. (ఆవిడ ఫొటో తీస్తుండగా 'ఛీ' కోపం పట్టలేక కసితీర్చుకోడాని కన్నట్టు దళారి మేద ఉమ్మేస్తాడు.)

భార్య

ఏమర్రా మీరు అసాధ్యుల్లాగ వున్నారే (భర్తవైపు తిరిగి) మై డియర్! నాకోసం కొంచెం నిదానించండి. ఎక్కడికి వెడతారు మీరు?

(పోలీసు 'ఛీ'ని కర్రతో కొడతాడు.)

భార్య (ఇద్దరు బంట్రోతుల్ని పిలుస్తుంది)

ఏం చేస్తున్నారు? నోళ్లు తెరుచుకు చూస్తున్నారు? (గోల చేస్తున్న ఇద్దరు చైనావాళ్లు ఆవిడ దగ్గరకు వస్తారు. కొంచెం పెడికి దారి తీస్తారు. ప్రయాణీకుడు కూడా నడుస్తాడు.)

ప్రయాణీకుడు (గైడ్‌తీసి చదువుతూ)

"ఆరువందల సంవత్సరముల కిందట, తొమ్మిది వందల అడుగుల ఎత్తు కొండపై దేవాలయ మొకటి నిర్మింపబడినది."

భార్య

ఆరువందల సంవత్సరాల కిందటా—చాలా సర్దాగా వుంది! (నిష్క్రమిస్తారు కూలీలు కొట్టుకుంటూనే ఉంటారు. పోలీసు గుంపును చెదరగొడుతున్నారు. రేడియో స్టేషనులోంచి కొలిమి కూలీవాడు ప్రవేశం. వాడు చప్పట్లు కొడుతూ "అలాగేనా పారిపోవడం....?" అంటాడు కూలీ వాళ్ళను చూసి.)

పోలీసు (అడ్డొచ్చి)

ఏమిటిరా ఆ వాగడం?

కొలిమికూలీ (మనస్సు మార్చేసి)

అలాగేనా బాయిలర్ లాక్కుపోవడం జాగ్రత్త! అని చెప్పబోతు న్నాను. (వాడు నిష్క్రమిస్తాడు.)

(దళారి పోలీసువాడి చేతుల్లో డబ్బు లంచం పెడతాడు నదీ తీరాన్నుండి చప్పట్లు వినవస్తవి. పడవల రేవుమీద దళారి పరుగెత్తుతూ వస్తాడు. టెలిఫోన్‌లో మాట్లాడతాడు)

దళారి

ఒక మోటారుకారు ...ఆఫీసులో....11½ గంటలకు....మంచిదండి ....(వెనక్కి తిరిగి 'ఛీ'ని చూసి నెమ్మదిగా) ఇక నాదగ్గర నీకు పని దొర కదురా!

రెండో రంగం

స్థలం: చీనన్ పడవమీద.

బోటుకు తెల్లరంగు వేశారు. సూర్యకాంతిలో బోటుకువేసిన రంగు మెరుస్తున్నది. తీక్ష్ణమైన సూర్యకాంతి పడవలో ప్రసరించకుండా కాన్వాస్‌గుడ్డ కట్టారు. ఎండవేడిమికి అలసిపోయి బ్రూచ్‌లే, అతని భార్య, కుమార్తె ప్రాతఃకాల అల్పాహారానికి కూర్చున్నారు డెక్కుమీద కుర్చీలల్లో. బ్రూచ్‌లే సతి ఒక పీపావలె వుంటుంది. విశాలోత్తుంగ పీవర స్తనమండలాలను 'బాడిస్'తో బంధించి స్థాణుత్వం చేకూర్చింది. మూతిమీద కొంచెం నూనూగు మీసకట్టు. మాట్లాడితే నాభిదగ్గరనుంచి స్వరం వెలువడుతుంది. 50 సంవత్సరాలు పైబడ్డ దొరసాని గనుక మాతృత్వభావాలు ఆవిరియై ధార్మికంగా ఉదారస్వభావంగా పరిణమించాయి. కుమార్తె పేరు కార్టీలియా. ఉచ్ఛిష్ట యౌవన కావడం వల్ల సుంద్రంగా నిబ్రంగా కాఠిన్యంగా వున్న వక్షోజాలు బల్ల పరుపులాగ చదునై మెత్తనైనవి. తల్లీ కూతురు తిన్నగా కలిసిమెలిసి ఉండరు కార్టీలియా యౌవనం అదివరకే కొంత హరింపబడి వుండడంవల్ల ఏమిటో నిరుత్సాహం, ఆవులా మంద కొడిగా వుంటుంది. లెఫ్టినెంట్ కాపర్ ప్రాతఃకాల అల్పాహారానికి వస్తాడు. అతనిజుట్టు చింత నిప్పులా ఎర్రగా వుంటుంది. కమిలిన ఎర్రని ముఖాన అక్కడక్కడా గోధుమవన్నె మచ్చలుంటవి. తెల్లవారి నావికాదళంలో పుట్‌బాలు ఆడు తాడు.

బ్రూచ్‌లే సతి

ఏం, ఎలా వున్నావ్ లెఫ్టినెంట్? కులాసా? కూర్చో. చాలా హాయిహాయిగావుంది నువ్వు రావడం. నేనిప్పుడే 'జ్ఞానస్నాన మహోత్స వం'లో (Baptism ceremoney) పాల్గొని వచ్చాను.

కార్టీలియా

నా ప్రభువా! ఏసా! ఏమి పరిమళం వేస్తున్నది! ఆహా!

బ్రూచ్‌లే సతి

కార్టీలియా!

కాపర్

జ్ఞానస్నానం మొగపిల్లాడికా చేయించివచ్చావు?

కార్టీలియా

కాదు ముప్పై ఏళ్లది. అచ్చంగా కోతి ముఖానికి కోతిపిల్లాడు పుట్టాడు.

బ్రూచ్‌లే సతి

అది బోటువాడి పెళ్లాం. అది మహాసంతోషించింది ఏసు క్రీస్తుల వారి సిలువ మెళ్ళోకట్టుకుని! ఆహా! తల్లి తన పిల్లలనందరినీ క్రైస్తవ పారిశుధ్యంలో పెంచుతుంది. ఆహా!

కార్టీలియా (సూక్ష్మంగా తెలివిగా)

కొందరు అనాగరిక ప్రజల్లాగ!

బ్రూచ్‌లే సతి

కార్టీలియా! లెఫ్టినెంట్‌దగ్గర అలా మాటాడతావు సిగ్గులేదూ?

కాపర్

అయినా ఫరవాలేదు. నేను ఖులాసాగా విని ఊరుకుంటాను.

కార్డీలియా

నేను ఖులాసాగా వుండలేను. ఆ గౌను నా కొచ్చేసరికి చాలా ఆలస్యమవుతుంది. చైనా గౌనులంటే నాకు ఎంతో ఇష్టం. ఎప్పుడూ చిరాకు పడుతూ వుండే మా నాన్న ఎక్కడ సంపాయించాడో!

కాపర్

మీ నాన్నగారు అష్‌లే గారి కోసం ఎదురు చూస్తున్నారు. (పడవ కమ్ములు పట్టుకుని డెక్కు కొస నిలవబడి, కళ్ళకు పెట్టుకున్న భూతద్దాల లోంచి చూస్తాడు.)

కార్డీలియా

అష్లే ఎవరు?

కాపర్

మై డియర్-ఆయనే నీ గౌను. ఆ గౌను సంపాయించుకొస్తాడు మీ నాన్న. మీ నాన్న ఆయనతో తోళ్ళ వ్యాపారం చేయాలని యత్నిస్తు న్నాడు. వ్యాపారం లాభించకపోతే....తరవాత సంగతి.

కార్టీలియా

మా నాన్న నాకు ప్రియుణ్ణి తెచ్చిపెడతానని మాట ఇచ్చాడు. తాయ్‌లీ షాపులో ఒకడున్నాడు. అతన్ని నేను పూజిస్తాను.

కాపర్ (కార్డీలియా అన్న చివరమాటలు చప్పుగా అర్థంచేసుకుంటూ) ఎవడో ఆ అదృష్టవంతుడు. (కార్టీలియా అతన్ని తీక్షణంగా చూస్తుంది)

కార్టీలియా

అడుగో కెప్టెన్‌గారు కూడా వచ్చాడు.

(బ్రూచ్‌లే దొర, కెప్టెన్, అష్‌లే లోపలికి ప్రవేశిస్తారు. బ్రూచ్‌లే పెద్దవాడు. లావాటివాడు. ఉష్ణ మండలాల వేడిమి భరించలేక బాధపడు తున్నాడు. వదులుగా వుండే సూటు ధరించినాడు. అతని కంఠం సహజ ముగా కోపంగాను, నిరుత్సాహంగాను వుంటుంది. స్నేహితుల్ని కలుసు కున్నప్పుడు జాలిగా వుంటుంది కంఠ స్వరం. మాట్లాడేప్పుడు స్వభావ సిద్ధంగా పక్క వాళ్ళ బుజాలు బొజ్జా నిమురుతాడు. పాపం అతనికి భార్య పొత్తుకుదరదు. కూతురిమీద ప్రేమ, పాత రకం వ్యాపారి, ఇప్పుడు అమె రికా ఇంగ్లడు చైనా వ్యాపార సంస్థల ఏజంట్లు అతన్ని పీక్కు తింటు న్నారు. కెప్టెన్ ముఖం పీక్కుపోయి వుంటుంది. ఇనప్పెట్టెలా వున్నాడు. అతను పట్టిన కుందేటికి మూడే కాళ్లు. తాను నడిచిన దారే పవిత్రం అనుల్లంఘనీయము. తనమీద తనకు కావలసినంత వెర్రి నమ్మకం; ఆడాళ్ళ దగ్గర గబగబ మాటలాడుతాడు. సంఘంలో చక్కగా మెలుగుతాడు. భావోద్రేకం హెచ్చు. ఆతను బాక్సర్ విప్లవంలో పనిచేసినప్పుడు మెడ ల్సులూ కప్పులూ పారితోషికం ఇచ్చారు. అదే గర్వం అతనికి.)

బ్రూచ్‌లే (అష్‌లేతో)

సరే బాగుంది—నీ తోళ్ళన్నీ కొనేస్తాను. నూటికి 40 వంతు రొక్కం ఇస్తాను. మిగతా రొక్కం సరుకు ముట్టింతరువాత షాంగ్‌హేలో ఇస్తాను. వ్యాపార షరతులు నిశ్చయం చేసుకుందాం.

అష్‌లే

చైనాలో వున్న తోళ్ళంతా మేము కొనేస్తాము. రొక్కం చేతులో పడాలి... ....తాయ్‌లీ డబ్బు చెల్లిస్తాడు.

బ్రూచ్‌లే (నివ్వెరపోయి)

అయితే చైనావాడికి అమ్మవుకాదూ? అయ్యో! ధర్మం ముఖ్యం.

అష్‌లే

నాకు పన్నెండు నిమిషాలు వ్యవధి వున్నది, ఈలోగా చెప్పేసెయ్యి ఏమాటా?

కెప్టెన్

చాలు పన్నెండు నిమిషాలు, రండి, ఇలా కూర్చోండి, వీరెవరో మీకు పరిచయం చేస్తాను, బ్రూచ్‌లే సతిగారు—బ్రూచ్‌లే దొరగారు, ఈయన అష్‌లే అమెరికా కంపెనీ ఏజంటు.

అష్‌లే (కార్టీలియా కరస్పర్శచేసి)

(బ్రూచ్‌లే సతివైపు తిరిగి) దిగుమతి (కాపర్‌వైపు) ఎగుమతి చేస్తూ స్టీమర్ల కంపెనీకి ఏజంటును.

బ్రూచ్‌లే సతి

మీరు అమెరికావారా?

కార్టీలియా (వింటూ)

అమెరికా వాళ్ళంటే చెడ్డ అసహ్యం (డ్రిల్లు డ్రస్‌తోవున్న కెప్టెన్‌ను చూసి) ఎంత హుషార్‌గా వున్నారండీ కెప్టెన్‌గారు!

కెప్టెన్

ఈ వూళ్లో మర్యాదస్తుడైన డాయిన్‌ను చూడబోతున్నాను. మనం అల్పాహారం తిందామా?

కాపర్

ఏయ్ కుర్రాడా? (చైనా కుర్రాడు పరుగెత్తు కొస్తాడు, తెల్లచొక్కా లాగూ వేసుకున్నాడు) వారే, సిగరెట్లు! (కుర్రాడువెళ్ళి సిగరెట్ కేస్ తెస్తాడు.)

కార్టీలియా (కుర్రాణ్ణి చూసి)

ఏమి చక్కని మూతి

అష్‌లే

అని అనుకుంటున్నావు.

కార్టీలియా

ఏమి చక్కని తల?

కాపర్ (భావోద్రేకం)

ఫుట్‌బాల్‌కు పనికిరాదు!

కార్డీలియా

ఎటువంటి అవకాశం!

కాపర్

నావంటి తలే!

అష్‌లే

బుర్రతో ఫుట్‌బాలు తిన్నగా కొడతారనుకోను.

కెప్టెన్ (బ్రూచ్‌లేతో).

చాలా విచారంగా ఉన్నారు!

బ్రూచ్‌ల్ (తన ఆలోచనల్లోంచి బయటపడి)

ముందు రొక్కం యిస్తే సామాను ఇచ్చేస్తా?

అష్‌లే

జిల్లాల్లో కరువు-పశువులకు ప్లేగు-వచ్చాయి. చైనావాళ్ళను మించి పోవాలి వర్తకంలో. ఇదే మంచి సమయం! చైనా ఏజంట్లు ఈ సాయంత్రం వెళ్ళిపోతారు.

బ్రూచ్‌లే

అయ్యో బాబోయి!

కెప్టెన్ (ఫ్రెంచిదొరపక్షం అవలంబించి)

అష్‌లే ఇలా రా. నీ హృదయం ఎప్పుడూ దయార్ద్రమని విన్నాను

అష్‌లే

దయార్ద్రం!... ! నాకు ఆశ్చర్యం కలిగిస్తున్నావు. (బ్రూచ్‌లే తనను రక్షించమని కార్డీలియావైపు తదేక దృష్టితో చూస్తాడు)

కార్టీలియా

అష్‌లే దొరగారూ! నన్ను రక్షించాలి. మళ్ళీ నేను త్వరగా వెళ్ళి పోవాలి వైద్యుడి దగ్గిరికి. యౌవనం తెప్పించుకొనేటందుకు చికిత్సకు వెళ్లాలి. (కాపర్ గ్రామోఫోన్ పెడతాడు అష్‌లే కార్డీలియాలు నాట్యం చేస్తారు.)

కెప్టెన్ (బ్రూచ్‌లేతో)

వ్యవహారపు విషయాల్లో మీ అమ్మాయి నిష్కర్షగా మాట్లాడుతుం దండీ.

రైతు సంఘాలలో విరివిగా చేరుడు:

ఆంధ్ర రాష్ట్ర రైతు సంఘాధ్యక్షుని విజ్ఞప్తి.

రైతు సంఘములలో సభ్యులను చేర్పించుటకు, నేటటకు, నవంబరు 30 వ తేదీ ఆఖరు గడువుగా అఖిల భారత రైతు సంఘమువారు నిర్ణంచిరి. ఈ లోపుగా చేరినవారే ఆంధ్రదేశములో జరుగనున్న అఖిలభారత రైతు మహాసభకు ప్రతినిధులను ఎన్నుకొనుటకు హక్కు కలిగియుందురు. నేడు రైతులందరు తమ హక్కులను సంపాదించుకొనుటకు రైతు సంఘములలో చేరవలసిన ఆవశ్యకతను గురించి వేరుగ చెప్ప నవసరములేదు.

బీహారులో రైతులు వర్గచైతన్యమును పొంది జమీన్‌దారులు తమకు తెలియకుండా శిస్తుల బాకీల క్రింద వేలంపాటలో కొట్టివేయించుకొనిన భూముల కొరకు సత్యాగ్రహము సాగించి జయ మొందిరి. నేడు దర్భాంగలో జరుగుచున్న బక్సత్ సత్యాగ్రహములో బీహారు శాసన సభ్యులుకూడ అరెస్టు కాబడినట్లు వార్తలు వచ్చుచున్నవి. కిసాన్ ఖైదీలను రాజకీయ ఖైదీలుగా పరిగణించవలసినదిగా అనేకమారులు కోరినప్పటికి చూడకపోవటంవలన ఖైదీలందరు ఉపవాసములు చేయుచున్నారు. బయట రైతులందరు ఆందోళన చేయుచున్నారు.

సంయుక్తపరగణాలో రైతులు తమకు మించిపోయిన నహూదారీ పన్నులు చెల్లించలేక సత్యాగ్రహము చేయుచున్నారు.

ఆంధ్రదేశములో కాశీపట్టణంలో రైతులు సత్యాగ్రహము చేసారు. మునగాలలో రాష్ట్రకాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగారి తీర్పును జమీన్‌దారు అమలు జరుపక పోవుటవలన, తమన్యాయమైన హక్కులకొరకు సత్యాగ్రహము సాగించారు. ఖైదీల నందరిని మామూలు ఖైదీలుగానే పరిగణించుచు, వారందరకు మిక్కుటు ఆహారము యిచ్చినది కాంగ్రెసు మంత్రివర్గం. వెంకటగిరి యస్టేటులో పంటలు పండక, తినుటకు కూడులేక మాడిపోవుచున్న రైతులు పూర్తిశిస్తు విమిషను కోరినప్పటికిని యివ్వక అనేక నిర్బంధములు పెట్టి అక్రమ జప్తులు చేయుచున్నారట. భోగారంలోను, తిరువూరు తాలూకాలోను, నూజివీడు తాలూకాలోను రైతులను ఏవో విధముగా సాధించవలెనని అడవులకు పోనీయక రైతులపొలములలోనికి వెళ్ళుట కుండు మార్గములను ఆక్రమించియు రైతులను అనేక యిబ్బందులకు పాలు చేయుచున్నారు.

కాంగ్రెసేతర రాష్ట్రములగు పంజాబ్‌లోను, బెంగాలులోను రైతుల బాధలు చెప్పనలవికాదు. లాహోరులో రైతులు తమ కష్టములనుగూర్చి తెలుపుకొనుటకుగాను శాసనసభ వద్దకు పోగా, అట్లు రాకూడదని నిషేధించినది. అందులకై సత్యాగ్రహము పూనగా యిప్పటికి షుమారు 2500 మంది రైతులను పంజాబ్ ప్రభుత్వం అరెస్టు చేసినది.

కాంగ్రెసు, కాంగ్రెసేతర రాష్ట్రములలో రైతులను ప్రభుత్వము ఈ విధముగా బాధించుచున్నది. రైతుల బాధలు కాంగ్రెసు కాంగ్రెసేతర రాష్ట్రములలో కొంచము ఇంచుమించు సమానముగానే వున్నవి. దీనినుండి ఏ విధముగానైన బయటపడుటకు మార్గములను అన్వేషించుచున్న రైతాంగముపై 'మూలుగుచున్న నక్కపై తాటికాయ' చందాన బొంబాయిలో సమావేశమైన అ॥ భా॥ కాం॥ కమిటీవారు రాష్ట్ర కాంగ్రెసు సంఘముల పర్మిషను లేనిదే ఏ కాంగ్రెసువాదియు, ఎటువంటి సత్యాగ్రహము చేయకూడదని తీర్మానించారు.



ఇట్టి పరిస్థితులలో ఆంధ్ర రైతాంగమంతయు వెంటనే రైతు సంఘములలో చేరవలసినదిగా హెచ్చరించుచున్నాను. యిప్పటికి 9 నెలల క్రితం మద్రాసు రివెన్యూ మంత్రిగారగు ప్రకాశంగారు ఎస్టేట్సు లాండు రిపోర్టును ప్రకటించి యుండిరి. కాని బిల్లు యింత వరకు త్రీసుకొనిరాలేము. ఆగస్టు శాసనసభా సమావేశములో కూడ ప్రవేశపెట్టరని తెలియవచ్చుచున్నది. ఆ శాసనములు ఏ విధముగానైనా బయటపడకుండా చేయుటకుగాను జమీందారులు అనేక ఎత్తులు వేయుచున్నారు. రైతులందరు వెంటనే రైతు సంఘములో చేరి సంఘ బలాన్ని వృద్ధిచేసుకొని ఆందోళన గావించి మద్రాసు ఎస్టేటు రివిన్యూ బిల్లు త్వరగా శాసనసభలో రైతులందరి ఆమోదముపొందు రీతిని ప్యాసు అయేటట్లు చూచుకొనవలెను.

5 వ అఖిల భారత రైతు మహాసభ ఆంధ్రదేశమున జరుపుటకు నిశ్చయించుకుని దానికి తగు ఏర్పాట్లు గావించుచున్నాము. ఈ సంవత్సరం ఆంధ్రదేశము భారత దేశములో ప్రధమ స్థానము లభించునట్లుగా కృషి చేయవలసిన బాధ్యత రైతు, యువజన, సోషలిస్టు పార్టీలపై నున్నది. కాన మనకున్న స్వల్ప అవకాశములోనే ఆంధ్ర దేశములో అన్ని గ్రామముల యందును రైతు సభ్యులను చేర్పించి, సంఘములను స్థాపించవలసినదిగా హెచ్చరించుచున్నాను.

కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి.

* * *

వెలుగోడు రైతుల మొర

వెలుగోడు గ్రామ రైతులు కొందరు యీ విధంగా వ్రాయుచున్నారు:—ఈ గ్రామంలో ఈదుల చెర్వునకు ఛంద్రపాగును త్రిప్పేటందుకు ఛీఫ్ ఇంజనీయరుగారు 1935-36 లో సిఫార్సు చేశారు. అందుకు 3700 రూపాయలు ఎస్టిమేటు వేసారు. అందులో సగము ప్రజలు వసూలుచేసి 1850 రూపాయలు కట్టినారు. ఈదులచెర్వుకు ఛంద్రపాగుకు 1 మైలు 2 ఫర్లాంగులు దూరముంటుంది. భూమి ఏటవాలుగా నున్నందున ఛంద్రపాగునుండి కాలువదీసి ఒకవైపు మాత్రము కట్టివేస్తే చెర్వుకు నీరు వస్తుంది అయితే గవర్నమెంటు వారు ఏమంటారంటే, ఛంద్రపాగుకు 5 ఫర్లాంగుల దూరములో పెద్ద మల్లాలమ్మ చెర్వునుండి వచ్చే అలుగు కాల్వ ఉంది. ఛంద్రపాగునుండి ఒక కాలువ తీసి అలుగు కాల్వలో కల్పితే డబ్బు తక్కువవుతుంది కదా అంటారు. కాని అవి కొండలు. కొండలు త్రవ్వించి కాలువ చేయటానికి షుమారు 16 వేలు ఖర్చు అవుతుంది. 16 వేల ఖర్చు ఎక్కువా 4 వేల ఖర్చు ఎక్కువా? ప్రజలు డబ్బుకట్టి 3 సంవత్సరము అవుతూంది. దానికి వడ్డీ షుమారు 325 రూపాయలు అవుతుంది. మొత్తము 2175 రూపాయలు మాకు ఇవ్వండి బాబూ మేమే త్రవ్వించుకుంటామంటే ఇవ్వరు.

ఈ అన్యాయమును మద్రాసు ప్రభుత్వంవారు గమనించి, ఈదుల చెరువునకు ఛంద్రపాగును త్రిప్పే యేర్పాటు వెంటనే చేయవలసిందని, లేదా మా సొమ్ము మాకు తిరిగి యివ్వవలసినదని కోరుచున్నాము.

* * *

ఉత్తర విశాఖపట్నం జిల్లాలో రైతు ప్రచారం.

ఉత్తర విశాఖపట్నం జిల్లాకాంగ్రెసుకమిటీ అధ్యక్షులైన శ్రీ గేదెల చంద్రయ్యనాయుడుగారు, సంయుక్త కార్యదర్శి గరిమెళ్ల వెంకటరమణమూర్తిగారితోను, బల్లెడ అప్పలస్వామి, ఎస్. శ్రీరామమూర్తి, వి. వెంకటాచెలం, పి. సుబ్రహ్మణ్యం, పి. రామన్న, బి. వెంకయ్యగారలతోను యీ రెండవవారంలో కాంగ్రెసు ప్రచారము చేయుచు అనేక గ్రామములు వెళ్లిరి. తులసిగాం, ధర్మపురం, ఈదుపురం, గొనపపుట్టుగు గ్రామములలో సంచారం చేసిరి రైతులు కాంగ్రెసు ప్రభుత్వం యెడల మిక్కిలి అసంతృప్తి చెందియున్నారు. జమీందారీ, రైత్వారీ, బిల్లులు యింకా శాసనసభలో ప్రవేశపెట్టకపోవుటవల్ల రైతులకు జమీందార్లవల్ల కలిగే అపకారములు తెలియజేస్తూ వచ్చారు. రివెన్యూ పోలీసు, ఇరిగేషన్, జ్యుడిషియల్ శాఖలలో ప్రభుత్వోద్యోగుల లంచగొండితనమును గురించి ప్రచారదళం వారికి నివ్నవించుకున్నారు. శ్రీ పుల్లెల శ్యామసుందరరావు, ఎం. ఎల్. ఏ. గారు, వరాహగిరి జోగయ్య పంతులుగారుకూడా ప్రచారదళంలోచేరి, కాంగ్రెసు సందేశాన్ని ప్రజలకు చెప్పి, కాంగ్రెసు సంస్థను బలపరచవలసినదిగా ప్రబోధించారు.

కవిటి, రాజపురం, శిలగాం, గొణగపుట్టుగు, వరఖ పావవరఖ, బల్లెపుట్టుగు, మాణిక్యపురం, కుసుమపురం, కుప్తం, వగయిరా గ్రామాలలోకూడా బహిరంగ సభలు జరిపి, కాంగ్రెసు మంత్రివర్గము చేస్తూన్న మంచి పనులను గురించి, రైతు సంఘాల ఆవశ్యకతను గురించి, రాబోయే స్వాతంత్ర్య పోరాటంలో రైతులు విరివిగా పాల్గొనవలసిన ఆవశ్యకతను గురించి ఉపన్యాసా లివ్వబడెను.

గ్రామాలలో ఎక్కడ చూచినా, ప్రభుత్వోద్యోగుల యెడ, జమీందార్లయెడ, తీవ్రమైన అశాంతి ప్రబలి ఉంది. ప్రకాశంగారి ల్యాండ్ రివెన్యూ బిల్లు వచ్చే ఆగష్టు శాసనసభలో ప్రవేశపెట్టకపోతే, రైతులకు తీరని అపకారం జరుగుతుందని ప్రజలు భీతిల్లుచున్నారు.

శిరగాం, గొణగపుట్టుగు, వరఖ, పాదవరక, కుసుమపురం బల్లెపుట్టుగు గ్రామాలలో విరాళములు వసూలుచేసి, యాత్రాదళం వారికి యిచ్చిరి.

బస్‌సర్వీస్‌లను జిల్లాబోర్డులు స్వాధీనం చేసుకోవాలి

మోటారు పనివారల కష్టాలు: ప్రభుత్వ బాధ్యత

కామ్రేడ్ మునిపల్లె రామారావు

కొన్ని జిల్లా బోర్డులవారు జిల్లాలలోని మోటారు బస్సు సర్వీసులను వాటి అధికారముక్రిందకు తీసుకొనినారు, మిగిలిన జిల్లా బోర్డులుకూడా బస్సు సర్వీసులను నడుపుటకు తీర్మానించినవి. బస్సు యజమానులు ఆ తీర్మానములను తీవ్రముగా ప్రతిఘటించుచున్నారు. మంత్రుల దగ్గరకు రాయబారములను నడుపుచున్నారు. కనీసము ఆ తీర్మానములు వెంటనే అమలులోనికి రాకుండా చేయవలసినదని బోర్డు మెంబర్లను, కాంగ్రెస్ పెద్దలను ప్రాధేయ పడుచున్నారు.

కొంతమంది యజమానులు బస్సు సర్వీసులకు నీళ్లు వదలి, వారి బస్సులను బోర్డువారికి అంటకట్టుటకు, వాటికి మంచి కాంపెన్‌సేషను సంపాదించుకొనుటకు తంటాలు బడుచున్నారు. ప్రాత డొక్కు కార్లకు రంగులు వేయించి, క్రొత్త సీట్లను వేయించి, క్రొత్త బస్సులవలె అలంకరించి జిల్లా బోర్డులకు అంటకట్టుటకు విశ్వప్రయత్నం చేయుచున్నారు.

పనివారల భీతి

యజమానుల షోభ అట్లా వుండగా, డ్రయివర్లు కండక్టర్లు మొదలయిన పనివారలు జిల్లా బోర్డుల పరిపాలన అంటే భయపడుచున్నారు. జీతాలు బోర్డు స్కూళ్ళ పంతుళ్ళకువలె బకాయిలు పడతాయని, శలవులు జీతము నష్టముపైన అయినా కావలసినప్పుడు దొరకవని, ప్రస్తుతము ఒక యజమానికే 'సలాము' కొట్టవలసి వస్తుంటే, బోర్డు పరిపాలనక్రింద ప్రెసిడెంటు మొదలుకొని ఆఫీసు నౌకర్లవరకు 'సలాము' కొట్టవలసి వస్తుందని, బడి పంతుళ్ళను మార్చినట్లు రోజు రోజుకి ఎన్నో ట్రాన్సుఫర్లు జరుగుతవని వారిలో వారు తహ తహ పడుచున్నారు.

సంఘముల క్షీణత

మోటారు పనివారల సంఘములు నిరుటి సంవత్సరం అన్ని జిల్లాలలోను స్థాపింపబడినవి. వారి కష్టనిష్ఠూరముల గురించి మంత్రులవరకు రాయబారములు నడచినవి. కాంగ్రెసు మంత్రుల ఉదాసీనతవలన సంఘముయొక్క పునాదులు సరిగా వేయకపోవుటచేత, దైనందిన హక్కులకు సక్రమ మార్గముల పోరాడుట లేకపోవుటచేత, అకాళకార్మ్యములు నిర్మించుటచేత, పార్టీ సభ్యులు అన్ని స్థలములందు సంఘములతో సంబంధము పెట్టుకొని తగిన సలహా లివ్వకపోవుటచేత సంఘములన్నియు నామ మాత్రములైనవి. కొన్ని జిల్లాలలో పనివారలలో నిరుత్సాహము, నిస్పృహ కూడా ఏర్పడినవి.

పనివారల కష్టాలు

యజమానుల చేతులలో బస్సు సర్వీసులు రైలు పోటీకి నిలచి లాభము చేకూరవలెనంటె, పనివారల జీతములు రోజు రోజుకి తగ్గించవలసి వస్తుంది. నిరుద్యోగుల సంఖ్య నానాటికి పెరుగుటచేత జీతములు పడిపోవుచున్నవి. శలవులు జీత నష్టము పైననయినా నిరుద్యోగులు ఎక్కడ యిరుక్కుంటారనే భయముచేతను, నౌకరీలు ఖాయము లేకపోవుటచేతను శలవులు కూడా తీసికొనుట మానివేయవలసి వస్తున్నది.

యజమానులు మోటారు బస్సులను ఎప్పటి కప్పుడు రిపేర్సు చేయించక 'వచ్చేనెలలో చూద్దాములే, అనేవారు 'ఇన్సుపెక్షను వస్తున్నదిగా, అప్పుడు ఎట్లాగో చేయవలసివస్తుందిగా, ఇప్పుడే తొందర ఎందుకు? ఎట్లాగోట్లా కాలము గడుపుదూ!' అని యజమానుల సమాధానములు. గట్టిగా అడిగితే నౌఖరిలో నుండి తీసివేస్తారేమో, పెండ్లాము బిడ్డలు బ్రతికేది ఎలాగా అనే భీతిచే ఆ డొక్కు కార్లనే నడుపుతూవుంటే బండి ఎగరవేస్తున్నదని, తొందరగా పోవుటలేదని, లంకణాల బోటు అని ప్యాసింజర్ల గోల. ఏదైనా ప్రమాదము (Accident) జరిగినదంటే 'డ్రైవర్ల పోగరుపోతు ముండాకొడుకులు' 'జట్కా-బండ్లు తోలుకునే వెధవలంతా బస్సులు తోలితే మరేమి జరుగుతుంది.' ఎప్పటికైనా రైల్లే సుఖమని తిట్టిపోసేవారు, శ్రీరంగ నీతులు చెప్పేవారేకాని పొట్టకూటికై ప్రాణములను గోల్పోవుచున్న బీద డ్రైవర్లను దయ తలచేవారులేరు, ఇంకా స్పీడు వదలు.... ఇంకా.... ఇంకా అని ప్రక్కన కూర్చుని ఎక్కేసేవాండ్లేకాని, ఏదైనా ప్రమాదము జరిగితే వాడి తరఫు సాక్ష్యము చెప్పేవారుకూడా వుండరు!

కండక్టర్లను రోజుకు ఒకరిని చొప్పున మారుస్తూ వుంటారు యజమానులు. జీతములు పదిరూపాయిలు లోపు. ఇన్నిగంటల పని అని నియమములేదు. శలవు కావలెనంటే పనిమీద ఆశ వదలుకో వలసినదే! యజమాని యింటికి కూరగాయలు మోస్తూ వుండవలసినదే అప్పు డప్పుడు క్లీనరుపనికూడా తనదే.

క్లీనరుపని వేరే చెప్పనక్కరలేదు, జీతము ఒకటో రెండో రూపాయిలు, కాఫీనీళ్లకు, సిగరెట్టు ముక్కలకు పనిచేసే కుర్రవాళ్లు లెక్కలేదు. వాండ్లచేత బస్సులేకాక శరీరాలుకూడాక్లీను (Clean) చేయించు కుంటారు.

యజమానుల యిండ్లలో ప్రక్కలు వేయుట, పిల్లలను ఎత్తుకొనుట, బజారు సరకులు తెచ్చిపెట్టుట, కాళ్ళు పట్టుట మొదలైన పనులన్ని చేయవలసినదే, ఏకారులోనో మోడువలె రాత్రులందు పరుండవలసినదే, వొంటిమీద చిరిగిన, నల్లతారు పట్టిన నిక్కరు, శరీరం నిండా నల్లని కోటింగు.

ఏ పండుగ నాడైనా తెల్లచొక్కా వేసుకున్నాడా 'వీడికి షోకులు బలసినవని' తిట్టిపోయటం. క్లీనరు యజమానివద్దవుండి ప్యాసింజరు వరకు నౌకరనే భావన

సంఘములను స్థాపించండి

పనివారలకు సంఘములు లేకపోయిన బోర్డు పరిపాలనక్రింద కూడా యీ కష్టములు తొలగినవి. సంఘముల ద్వారా వారి హక్కులకై పోరాడాలి. ప్రతి లైనుకు చిన్న కమిటీలను ప్రతి సెంటరుకు ఒకకమిటీ వీటిపైన జిల్లా రాష్ట్ర కమిటీలను నెలకొల్పవలెను. రాష్ట్ర కమిటీని రిజిష్టరు చేయించిన చాలును. బస్సు సర్వీసులు జిల్లా బోర్డుల క్రిందకు తీసికొనునప్పుడు వారి సంఘములతో సంప్రతించి పనివారలను తీసికొనవలెను. సంఘ బలము లేకపోయిన, బోర్డుమెంబర్ల సిఫార్సులపై వారి యిష్టము వచ్చినవారికి నౌకరీలు యివ్వవచ్చును. 30, 20 సంవత్సరములనుండి చేయుచున్న వారికి సిఫార్సు లేకపోయిన పని వూడిపోతుంది నిన్ననో మొన్ననో లైసెన్సు సంపాటంచి సిఫార్సు వుండిన నౌకరీ సంపాదించడం సంభవిస్తుంది. ఇప్పటి నుండే సంఘములను బలపరచిన, అటువంటి అవాంతరములు రాకుండా పోరాడగల్గుతారు.

ప్రభుత్వ బాధ్యత

మద్రాసు ప్రభుత్వము యజమానుల గోల లెక్కచేయక, బస్సు సర్వీసులను జిల్లా బోర్డులకు యిప్పించి ఒక రాష్ట్ర బోర్డు ఏర్పాటు చేయవలెను. రాష్ట్రములోని పనివారల జీతములు, శలవులు ప్రమాదములకు కాంపెన్‌సేషన్ మొదలయిన విషయములన్నియు ఆ సెంట్రల్ బోర్డు ఆధీనము చేయవలెను. ప్రస్తుతము పనిలోనున్న వారినందరిని నౌకరీలు ఖాయముచేసి వారికీ క్రింది కనీసపు కోర్కెలను తీర్చాలి.

కనీసపు కోర్కెలు

1. డ్రయివర్లకు నెల 1కి 40 రూ. కండక్టర్లకు రు 30, క్లీనర్లకు 15 రూ. మెకానిక్కులకు రు 20 లకు తక్కువ కాకుండా జీతములేర్పాటు చేయవలెను. గ్రేడ్లను ఏర్పాటుచేసి ప్రమోషన్లు యివ్వవలెను.

2. రోజుకు 8 గంటలకు మించని పని వుండాలి. ఎక్స్‌ట్రా పనికి రెట్టింపు జీతము యివ్వాలి.

3. శలవులు జిల్లా బోర్డు గుమాస్తాలకు అధికారులకు వలెనే యివ్వాలి.

4. ప్రావిడెంటు ఫండు ఏర్పాటు చెయ్యాలి.

5. లైసెన్సు ఫీజులు, రిన్యూవల్ ఫీజులు ఆ జిల్లా బోర్డులే భరించాలి.

6. ప్రమాదములకు కాంపెన్‌సేషను యిప్పించాలి.

7. పోలీసు కేసులకు బోర్డువారి ఖర్చులతోనే వాదించాలి. కేసులకు హాజరయిన రోజులకు జీతము యివ్వాలి.

8. సంవత్సరమునకు 4 జతల యూనిఫారములు 1 జత బూడ్సులు, వర్షములో తడవకుండా 1 రెయిన్ ప్రూఫ్‌కోటు సప్లయి చెయ్యాలి.

పనివారలందరు అన్నిచోట్ల బహిరంగ సభలు పూరేగింపులుచేసి యీ కనీసపు హక్కులకై తీర్మానములుచేసి జిల్లా బోర్డులకు కాంగ్రెసు మంత్రులకు తెలియపర్చవలెను.

యుద్ధ వ్యతిరేక ప్రచారం గావించండి
ఆగస్టు 1 యుద్ధ వ్యతిరేక దినం

ప్రపంచాన్నంతా యుద్ధమేఘాలు ఆవరించుకొని వస్తూఉన్నాయి. డాన్జిగ్ సమస్యపై యుద్ధము రావడానికి అవకాశాలు లేకపోలేదు. కాని ఈయుద్ధము, సోవియటు యూనియనుతో ఫ్రాంసు బ్రిటనులు మిలటరీ ఒడంబడిక చేసుకోనంతకాలము, రెండు సామ్రాజ్యవాద ముఠాల మధ్య జరిగే యుద్ధముకాక వేరేమీకాదు. ఆయుద్ధము బ్రిటనుది యూరపు ఖండములో పైచేయిగా ఉండాలా లేక జర్మనుది ఉండాలా అను సమస్యను పరిష్కరించడానికి తప్పు ముకెందుకూ ఉపయోగించదు.

బ్రిటను ఇట్టి యుద్ధము చేయుటకన్న జర్మనుతో ఏదో ఒకరకముగా రాజీపడి రెండూ కలిసి రైతుకూలీల రాజ్యమగు సోవియటు యూనియనుపై (రష్యాపై) పడి నాశనము గావించడానికి ఎత్తులు వేస్తున్నది. ఇదియే ఎక్కువ సాధ్యము కావచ్చు.

కష్టజీవుల హక్కుల కాపాడుతూ, వారినందరికీ ప్రపంచమందు శాంతిని, అభివృద్ధిని గోరే ప్రతినిధ్యక్తికే మార్గముచూపే సోవియటు యూనియనును నాశనము గావించడానికి బ్రిటను ప్రయత్నిస్తూ ఉంటే మనము ఊరకుండజాలము.

ఇంగ్లండు (బ్రిటను) తనప్లానులను నెగ్గించుకోడానికి మనదేశముపై నిరంకుశాధికారము మరింత ఎక్కువ చేస్తూఉంది. జబ్బల్పూరు సమీపములో కొన్ని గ్రామాలను ఆక్రమించుకొని ఆయుధాలను, మందుగుండులను తయారు చేయడానికి గొప్ప ఫ్యాక్టరీని ఏర్పరచబోతూ ఉంది సైన్యాన్ని చేర్చుకోడానికి ఆరంభిస్తూ ఉంది. ఏ తాలూకాఫీసులోచూచినా పోలీసులకు సన్నెపోటు యందు తరిఫీదునిస్తూ ఉంది. యుద్ధము వచ్చినపుడు మన స్వాతంత్ర్య పోరాటమును అణచివేయడానికి చాలినంత మంది సైనికులు ఉండరేమో. అందుచే ఈ పోలీసుల చేతనే మనలను పొడిపించడానికి కాబోలు ఈ తరిఫీదు! ఇప్పుడు మనకున్న హక్కులను గూడ తొలగించే ఫెడరేషనును మనపై యుద్ధానికి కూడ ప్రయత్నిస్తూఉంది. ఫెడరేషను మనపై రుద్దడమంటే మనపై జమీందారుల యొక్క, స్వదేశ సంస్థానాధీశుల యొక్క పెత్తనము తేవడమే.

అందుచే అగస్టు ఒకటి ప్రపంచ యుద్ధ వ్యతిరేక దినము. నాటినుండి మనదేశములో కూడ, ప్రతిగ్రామములో యుద్ధవ్యతిరేక ప్రచారము. ఫెడరేషనుకు వ్యతిరేక ఆందోళన ఆరంభముకావాలి.

1. యుద్ధానికి, బ్రిటీషు ప్రభుత్వానికి ఒక్క సైనికుడూ దొరకకూడదు. ఒక్క దమ్మిడీ కూడ అప్పు పుట్టకూడదు

ఫెడరేషనుకు వ్యతిరేకముగా, యుద్ధానికి వ్యతిరేకంగా, వీనికి కారకమైన బ్రిటీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజాపోరాటము అరంభించాలని ఉంటుంది. అట్టి పోరాటములో కాంగ్రెసు చెప్పినప్పుడు

2. రైతులు పన్నులను ఒక దమ్మిడీకూడ చెల్లించకూడదు. కార్మికులు దేశమంతటా సమ్మెచేసి ప్రభుత్వాన్ని కదలకుండా చేయాలి.

దీనికొరకు పార్టీ సభ్యులు, మిగిలిన కాంగ్రెసు వాదులనుకూడ కలుపుకొని, ముగ్గురు ముగ్గురుగా ప్రచారక దళములుగా ఏర్పడి గ్రామగ్రామాన ఈనినాదాలు ప్రజల హృదయములో హత్తుకొనిపోయేటట్లు చేయాలి.

ఆగస్టు ఒకటికంతా దేశమంతటా ఇట్టి ప్రచారకదళాలు పనిచేస్తూ వుండాలి.

* * *

ఫార్వర్డుబ్లాకు

పార్టీసభ్యులకు హెచ్చరిక.

ఫార్వర్డుబ్లాకును గురించి పార్టీ సభ్యులలో చాలమందికి సందేహాలు, అపోహలు ఉన్నట్లు తెలుస్తూఉంది. శ్రీ మద్దూరి అన్నపూర్ణయ్యగారు చేసినప్రకటనలో సోషలిస్టులు, కమ్యూనిస్టులు ఫార్వర్డుబ్లాకులో చేరవచ్చుననిఉంది. చేరితేచేర్పుకోడానికి ఫార్వర్డుబ్లాకుకు అభ్యంతరము లేదని దాని భావము కాని వేరేమీకాదు. సోషలిస్టులు, కమ్యూనిస్టులు, ఫార్వర్డుబ్లాకులో చేరకూడదనే వారి ప్రతినిధులు గత మాసము బొంబాయిలో తీర్మానించారు. ఇట్టి నిర్ణయము రావడానికి బాధ్యత సోషలిస్టులు మీదగాని, కమ్యూనిస్టుల మీదగాని లేదు. ఇట్టి నిర్ణయానికి కారణము సుభాసుబోసు, ఫార్వర్డుబ్లాకుయొక్క తీర్మానాలే.

కమ్యూనిస్టులు గత రెండు సంవత్సరాలుగ అతివాదులందరినీ ఐక్య మొనర్చాలని ప్రయత్నిస్తూ వచ్చారు, దీనిలో వారి ఉద్దేశము, అట్టి అతివాదుల ఐక్యసంఘము, కాంగ్రెసుకు ప్రతిద్వంద్వియైన సంస్థగా చేయడము కాదు. అట్టి అతివాద ఐక్య సంఘము ఏర్పడి పనిచేయునంత కాలము ప్రస్తుత కాంగ్రెసు మితవాద నాయకత్వముయొక్క రాజీధోరణిని మాన్పి స్వాతంత్ర్య పోరాటము అరంభించజాలరని.

ఇట్టి అతివాద ఐక్య సంఘముగా ఫార్వర్డుబ్లాకును పరిగణించడానికి బొంబాయిలో సోషలిస్టులూ, కమ్యూనిస్టులూ అంగీకరించారు. కాని ఒక్క షరతు సూచించారు. అట్టి అతివాద ఐక్య సంఘములో తాము చేరిన తాము సంఘటిత పార్టీలలాగనే అందు పనిచేస్తామనీ, అలా పనిచేస్తూ ఉన్నప్పుడు అతివాదుల ఐక్య సంఘము ఎగుడుదిగుడులులేక పనిచేయవలయునన్న, నిర్ణయాలన్నీ, వివిధగ్రూపుల అంగీకారము మీదనే చేయబడాలనీ సూచించారు. బోసు దీనికి అంగీకరించలేదు. ఫార్వర్డుబ్లాకులో సోషలిస్టులు, కమ్యూనిస్టులు సంఘటిత పార్టీలుగ పనిచేయడానికి అవకాశ మిస్తే, సోషలిజము, కమ్యూనిజము అంగీకరించని, అంగీకరించినను, వారి గ్రూపులలో చేరని అతివాద కాంగ్రెసు వాదులకు మాత్రము సంఘటిత పార్టీ ఏల ఉండరాదని సుభాస్ ఊహించి ఉండవచ్చు. అందుచేఅట్టిపార్టీగా ఫార్వర్డుబ్లాకునుఏర్పరచారు ఫార్వర్డుబ్లాకు. సోషలిస్టుపార్టీ, కమ్యూనిస్టులు, రాయిస్టులు, రైతు సంఘముతరపున స్వామిజీ, రంగాగార్లుకలసి "అతివాదుల ఐక్యసంఘము"ను లెఫ్టు కన్సాలిడేషను కమిటీ అను పేరుతో ఏర్పరచారు. ఈ కమిటీలో నిర్ణయాలన్నీ ఇందులో నున్న వివిధగ్రూపుల అంగీకారము మీదనే చేయబడుతున్నాయి. నేడు రాయిస్టులు అందుండి వెళ్లి పోయారు. మిగిలినవారు ఉన్నారు.

అందుచే (1) ఫార్వర్డుబ్లాకు వేరె యొక పార్టీ (2) దీనిలో సోషలిజము అంగీకరించని వ్యక్తులుకూడా ఉండుటకు అవకాశ ముంది. (3) ఇది అతివాదుల ఐక్య సంఘము కాదు. (4) దీనిని కాంగ్రెసుకు ప్రతిద్వంద్విగా కూడ మనము చేయదలచుకోలేదు. అందుచే దీనిలో సోషలిస్టులు కమ్యూనిస్టులు చేరడము, తమ సోషలిజమును, కమ్యూనిజమును మానుకొని కేవలము జాతీయ అతివాద దృక్పధమే మిగిలిదనిపించుకోవడమే అవుతుందని కమ్యూనిస్టులు, సోషలిస్టు నాయకులు ప్రకటించియున్నారు.

ఈ కారణంచే పార్టీసభ్యులెవ్వరూ ఫార్వర్డుబ్లాకులో చేరవలదని హెచ్చరించుచున్నాను. అలా చేరదలచుకొన్నవారు పార్టీలో ఉండడానికి వీలులేదు.

కాని ఫార్వర్డుబ్లాకు పార్టీకూడా కాంగ్రెసులోని ఒక అతివాద పార్టీగాన, దానిని అతివాదుల ఐక్యసంఘములో కలుపుకొని పని చేయడమే మన వుద్దేశము. కర్తవ్యముకూడ. అని గమనించాలి.

పి. సుందరయ్య.
కార్యదర్శి,
ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ.



కీ॥ శే॥ శెట్టిపల్లి వెంకటరత్నం

17-వ తేదీన–12 రోజులు టైఫాయిడ్‌తో బాధపడి–కామ్రేడ్ శెట్టిపల్లి మరణించాడు.

శెట్టిపల్లి కాంగ్రెస్ వర్కర్ :

కృష్ణా, పశ్చిమ గోదావరిజిల్లాలలో కాంగ్రెస్ ఆదేశాన్ని శిరసావహించి పని చేసాడు. రాష్ట్ర కాంగ్రెస్ సభ్యుడుగా రెండేళ్లున్నాడు, గుడివాడ తాలూకా కాంగ్రెస్ కార్యదర్శిగా 1937-38 లలో పనిచేశాడు. అపుడే "శెట్టిపల్లి" "కామ్రేడ్ శెట్టిపల్లి"గా మారాడు. దానితోపాటు "దౌర్జన్యపరుడనే" వంకతో రాష్ట్ర కాంగ్రెస్ "డిసిప్లినరీ శిక్ష"కు గురి అయాడు. పాపం! అహింసాత్మక సత్యాగ్రహ దినాలలో కూడా ప్రభుత్వానికీ ఈ "దౌర్జన్యమే" వంకదొరికింది. గడ్డలు వేశాడని వంకతో 1930 లో రెండేళ్ల శిక్షవిధించారు. గాంధి ఇర్విన్ ఒడంబడిక జరిగినా ఇతన్ని విడిచిపెట్ట లేదు ప్రభుత్వం!

* * *

శెట్టిపల్లి కవి!

1933 నాటి సంగతి. ఇంకా అతని విజ్ఞానం పరిపక్వ దశకు రానిరోజులు. "మురళీ కృష్ణులు, పృథ్వీరాజులు, రాణీలు, దుర్గదాసులు" నుంచి బయటపడని దినాలు 'జ్యోతిర్మయి' అనే ఖండ కావ్యసంపుటి వ్రాసాడు. అయినా, అనాడుకూడా "పల్లెపదముల నెల్లెత్తి పాడుకొనుచు....పల్లెల కదుగ...." వలెననే అతని ఉద్దేశ్యం. సుప్రసిద్ధ కవి ఉమర్ ఆలీషా "ఈ కవిగారు చాలా బాల్యులు. మంచి కవితాధార. వాక్శుద్ధి ప్రయోగ నైపుణ్యముకల్గుట పుణ్యవాసనా విశేషమని చోచెడిని"అని అన్నారు. రైతు వుద్యమం ఇతన్ని పూర్తిగా మార్చివేసింది.

"తుంగభద్రా కృష్ణవేణీ, గౌతమి కావేరి కన్యలు
రైతు కార్మిక విజయగానాలాపనముచే పొంగుచుండే"

ఉట్లు, తాను పాయవద్దాడు. అతని గీతము, పాటలులేని "రైతు భజనావళి" లేదు. అతని పాటలులేని కాంగ్రెస్ ఎన్నికల ప్రచారములేదు.

* * *

శెట్టిపల్లి రచయిత!

తనకుమించిన ఆత్మవిశ్వాసం ఉంది! ఇంగ్లీషుభాషా పరిచయజ్ఞానం లేకున్నా లెక్కచేసేవాడు కాదు! విద్యార్థి సమస్యల మొదలుకొని సంస్థాన సమస్యలవరకూ వ్రాశాడు. మొగమోటమిలేదు, జంకుగొంకులేదు.

రాష్ట్రకాంగ్రెస్ చేసిన అన్యాయాలను విమర్శిస్తూ "తెలిసికోదగిన పట్టాభి" వ్రాశాడు. తర్వాత "విద్యార్థి" "ఆకలి మంటలు" అనేవి వ్రాశాడు. "త్రిపురీ సమస్య" "సంస్థానోద్యమ చరిత్ర", "అంబుల పొది" (గీతాలు) — ఇంకా వ్రాతప్రతులుగానే ఉన్నాయి. ఇతని రచనలకు ముగ్ధుడయిన రంగాగారు "భావబాలుడు" అని పిలిచేవారు. తమ రైతాంగ గ్రంధమాలను ఇతనికి అప్పగించారు. ఒకసారి రైతు భజనావళిని అంకితమిచ్చారు.

* * *

శెట్టిపల్లి వక్త!

అతని గీతాలలోనేకాదు. అతని కంఠంకూడా "ఝుణా ఝుణా" మ్రోగేది.

* * *

ఇదివరకు శెట్టిపల్లి కాంగ్రెసుకు దూరుడయాడు. ఇపుడు మనకే దూరమయాడు. ఇట్టి "శెట్టిపల్లి" మరణానికి విచారిస్తూ, అతని కుటుంబానికి మా సానుభూతి చూపించుతున్నాం.

— సంపాదక వర్గం.

మద్రాసు ట్రేడ్ యూనియన్ సమావేశం

మద్రాసు రాష్ట్రట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కార్యనిర్వాహకుల, అఫిలియేటెడ్ యూనియన్ ప్రతినిధుల సమావేశం యీ నెల 16 తేదీన చీరాల పొగాకు పనివారల యూనియన్ ప్రతినిధియగు కామ్రేడ్ వై. కృష్ణమూర్తిగారి అధ్యక్షత క్రింద మద్రాస్ హౌస్ యందు జరిగింది. ఆంధ్రానుంచి ఆంధ్రరాష్ట్ర ప్రెస్ వర్కర్సు యూనియన్, చీరాల టొబాకో యూనియన్ ప్రతినిధులు మాత్రమే హాజరయ్యారు.

1. రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ నిర్మాణము, నిబంధలనుగూర్చి కొంత చర్చ జరిగిన తరువాత కొద్ది సవరణలతో కార్యదర్శిచే తయారుచేయబడిన చిత్తు కానిస్టిట్యూషన్ ఆమోదింపబడినది


2. కార్యదర్శి రాష్ట్రములోని కార్మిక సంచలనమును గూర్చి ముఖ్యముగా మధుర నిట్టింగు ఫ్యాక్టరీ సమ్మెనుగూర్చి ఇండియన్ యక్స్‌ప్రెస్, దినమణి, ఆంధ్రప్రభ పత్రికలయందు సమ్మెను గూర్చి విపులముగా తెలియచేశాడు. మధుర నిటింగు ఫ్యాక్టరి సమ్మె సందర్భములో ప్రభుత్వ నిర్బంధ విధానమును నిరసించుచూ, సమ్మెచేయుచున్న కార్మికులను అభినందించిరి. ముత్తు రామలింగతేవర్ (కాంగ్రెస్ ఎం. ఎల్. ఎ.) గారిమీద కేసు వుపసంహరించుకొనవలెనని కోరిరి.

ఆంధ్రప్రభ సమ్మెలో కార్మిక సంఘం వారు ఆర్బిట్రేషన్‌కు అంగీకరించిననూ, యజమానులుకూడ ఆర్బిట్రేషనున్‌కు అంగీకరించిన తరువాతకూడ, కొంత మంది పనివారలను యజమానులు శిక్షించుటవల్ల రాజీ ప్రయత్నములు విఫలమైనదని యభిప్రాయపెలిబుచ్చుచూ, ప్రభుత్వ నిర్బంధ విధానమును నిరసించిరి.

3. కార్మిక బిల్లును గురించిన మెమొరాండములో "సమాధానకర్త తన ప్రయత్నములు విఫలమైనప్పుడు ప్రభుత్వమునకు పూర్తి వివరములతో రిపోర్టు పంపుతాడని, ప్రభుత్వము అవసరమని తలచినపుడు, ఆ రిపోర్టు ప్రకటించునని" తెలియజేయబడినది. కాని, సమాధాన కర్త ప్రయత్నములు విఫలమైనప్పుడు, విఫలమైనట్లు మాత్రమే ప్రభుత్వము తెలియజేయవలెనని, యెట్టి పరిస్థితులలోను రిపోర్టు ప్రకటించగూడదని, ముఖ్యముగా వుభయ పార్టీలవారు కోర్టుకు పోవుటకు వీలున్నప్పుడు, యీ రిపోర్టు కోర్టువారిని ప్రిజుడిస్ కలుగచేస్తుందని ఈ సభవారు అభిప్రాయపడిరి.

ఈ కోర్టు తీర్పు చెప్పిన తరువాత, యే పార్టీ అయిననూ ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకొనేముందు ప్రభుత్వమునకు తెలియచెయ్యాలని, వారు అవతల పార్టీకి తెలియచేస్తారని, మెమొరాండంలో సూచించబడినది కాని, కార్యాచరణకు పూనుకోబోవుచున్న పార్టీ, ప్రభుత్వమునకు అవతల పార్టీకికూడ తెలియ చేయవలెనని సమావేశమువారు యభిప్రాయపడిరి. ఈ మెమొరాండములోనే, కొన్ని ప్రత్యేక పరిస్థితులందు నిర్బంధ రాజీ విధానమును (Arbitration) వుభయ పార్టీలను నిర్బంధముగా అంగీకరించునట్లు చేయుటకు ప్రభుత్వమునకు అధికారము కల్గించుతున్నది. ఇందుకు ట్రేడ్ యూనియన్సు అంగీకరింపజాలవని ప్రత్యేక పరిస్థితు లెట్టివో తెలియ చేయవలెనని కోరిరి.

రికగ్నైజు చేయుటకు ట్రేడ్ యూనియన్ ఆక్టు ప్రకారం రిజిష్టరు చేయబడి, నూటికి 10 మంది సభ్యులు గల్గి ఉండిన యడల రికగ్నైజు చెయ్యాలి కాని, మెమొరాండంలో సూచించిన ప్రకారం ఇంకే షర్తులు పెట్టగూడదని కోరిరి.



తొందరపడి కార్యాచరణకు దిగు పార్టీలమీద పెనాలటీ (జుల్మానాలు) విధించుటకు యోచించుతున్నామని ప్రభుత్వము సూచించింది. కాని యే పరిస్థితులలో యీ పెనాటీలు విధించెదరో తెలియచేస్తేగాని, యీ సభవారు అందుకు అంగీకరింపజాలమని తెలియజేసిరి.

నిరుద్యోగ భృతినిగూర్చి ప్రభుత్వం సూచనలు తృప్తికరముగా లేవని యభిప్రాయపడిరి.

ఈ మెమొరాండముమీద యీ తాత్కాలిక సూచనల నాధారంచేసుకొని, ఒక చిత్తు ప్రతి తయారుచేసి యితర సంఘాల అభిప్రాయములకు పంపుటకు నిశ్చయించిరి.

4. మద్రాస్ రాష్ట్రములోని కార్మిక సంఘాలన్నింటిని, ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్‌కు అఫిలియేటు చేయవలెనని కోరిరి.

* * *

బెజవాడ

గవర్నర్‌పేట కార్మిక సంఘము.

16—7—39 తేదీ ఆదివారం సాయంత్రము 4 గంటలకు 23 వ వార్డు సూర్యారావు పేటలోని కార్మిక సంఘ కార్యాలయమున, పై సంఘముయొక్క సాధారణ సభ్యుల సమావేశము జరిగినది. యీ క్రింది తీర్మానములు ఆమోదించడమైనది.

తీర్మానములు.

1. ఆంధ్రప్రభ పత్రికాధిపతుల నిరంకుశత్వమును భరించలేక సమ్మె చేయుచుండిన కార్మికుల నభినందించుచూ, యజమానుల చర్యలను నిరసించుచూ, అరెస్టు చేయబడిన కార్మికులను విడుదల చేయువలసినదిగా కాంగ్రెసు మంత్రివర్గమును కోరుచున్నాము.

2. మునగాల రైతు సత్యాగ్రహ ఖైదీలను విడుదల చేయవలయుననిన్నీ శ్రీ ప్రకాశం పంతులుగారి వాగ్దానమును వెంటనే నెరవేర్చవలసినదిగా కాంగ్రెసు మంత్రివర్గమును కోరడమైనది

3. ఈ సంఘముయొక్క వార్షికోత్సవము జరుపుటకు చందాలు వసూలుచేయు నధికారము అధ్యక్ష, కార్యదర్శులకు యివ్వడమైనది.

4. ఆగష్టు నెలలో బెజవాడకు రానున్న సుభాసుచంద్రబోసుగారికి యీ సంఘము తరపున సన్మాన పత్ర మిచ్చుటకు తీర్మానించడమైనది.

5. బెజవాడ, గవర్నరుపేటలో యిండ్లు కాలిపోయిన బీదవారల సహాయార్థము సంఘము తరపున చందాలు వసూలు చేయుటలో అధ్యక్ష, కార్యదర్శులకు యెక్కువగా తోడ్పడిన శ్రీ రాపర్ల నరసింహారావు పంతులుగారికిన్నీ, శ్రీ శిరికి దుర్గయ్యగారికిన్నీ, అడుగుటయే తడవుగ మాకు చందాలు నిచ్చిన పుర ప్రముఖులకున్నూ మా కృతజ్ఞత పూర్వక అభివందనములు తెలుపడమైనది.

చొక్కాపు కిష్టమ్మ.
ప్రధాన కార్యదర్శి.

* * *

కర్నూలు

కర్నూలుపట్టణప్రెస్‌పనివారలు కామ్రేడ్ టి. వి. నరసింహమూర్తిగారి అధ్యక్షతను సమావేశమైరి. స్థానికముగా గల 9 ప్రెస్సులకు గాను, 6 ప్రెస్సులలోని కార్మికులు హాజరైరి. అధ్యక్షుడు 1935 సంవత్సరం లగాయితు నేటివరకు ఆంధ్రరాష్ట్రములోని వివిధ ప్రాంతములలో ప్రెస్‌పనివారల సంఘములు యే విధముగా తమ కనీసపు కోర్కెలకొరకు పాటుపడుచున్నవో విపులముగా వివరించిరి. కర్నూలు పట్టణములోగూడ సంఘమును నిర్మించవలసిన ఆవశ్యకతను తెలుపుచూ ప్రతి కార్మికుడు సంఘసభ్యుడుగా చేరవలెననియు, ప్రెస్ పనివారల దైనందిన కష్టముల నివారణకొరకు తీవ్రమగు కృషి చేయవలెనని హెచ్చరించిరి. మద్రాసు రాష్ట్రములో ప్రెస్‌లన్ని ఫ్యాక్టరీ యాక్టుక్రింద వచ్చునట్లు ఆందోళన సలుపవలసినదని మంత్రివర్గమువారికి సూచించవలసిన ఆవశ్యకతను తెలిపిరి, తిరిగి 23-7-37 తేది సమావేశము జరుపవలెనని తీర్మానించుచూ సభ ముగిసెను.

* * *

తెనాలి

మోటారు డ్రైవరుకు జరిమానా.

తెనాలి గుంటూరు బస్సుసర్వీసులో పనిచేసే మోటారు డ్రైవర్లు 12 మంది సుమారు 8 మాసములక్రిందట శ్రీ వుదయగిరి గోపాలరావుగారి అధ్యక్షతను సంఘంగా ఏర్పడి, ఆసంఘాన్ని రిజిష్టరు చేయించిరి. సంఘం ఏర్పడిన తరువాత బస్సుసర్వీసు యజమానులు డ్రైవర్లను పూర్వంలాగ మాటి మాటికి తీసివేయటానికి, జరిమానులు వేయటానికి వీలు లేకుండా పోయింది. పూర్వం 25 రూపాయల జీతం 30 అయింది. 4 రూ. బేటా, నెల 1 రోజు సెలవులు వచ్చినై. పనివారిలో వచ్చిన ఈ కట్టుబాటును ఏవిధంగానైనా చెడగొట్టాలని యజమానులు వారి ఏజంట్లద్వారా ప్రయత్నించారు. దాని ఫలితంగా యజమానుల మాటలలో బడి 4 గురు డ్రైవర్లు మాకు సంఘంతో సంబంధంలేదని వాదులు కొనిరి. యజమానుల ప్రయత్నములు యింతటితో పూర్తికాలేదు. 12-7-39 వ సూపర్‌వైజరు తను ఆపమన్నచోట బస్ ఆపలేదని రిపోర్టు చేయగా 13-739 న వాశిరెడ్డి వెంకటాద్రి అను డ్రైవరును పనిలోనుంచి తొలగించామని యజమానులు చెప్పిరి, మంతెన వెంకటరాజు, ఉప్పటూరి పున్నారావుగారలు మధ్యవర్తులుగా మాటాడి డ్రైవరు తప్పుచేసిందీ, లేనిదీ,తరువాత విచారించేటట్లూ,ప్రస్తుతం అతని జీతంలోనుంచి 2 రూపాయలు యజమానులు మినహాయించుకొనేటట్లు పనిలోకి వెళ్లేటట్లు పరిష్కరించిరి, ఈ అన్యాయమును ఎదిరించాలంటే ఇకనైన యజమానుల చర్యలను ఎదుర్కోడానికి డ్రయివర్లంతా సంఘములో చేరాలి.

హైదరాబాదులో మేడిపండు సంస్కరణలు

"ఆడంబర ప్రాయంగాను, శుష్కపాండిత్య ప్రకర్షగాను మాత్రమే వున్నాయి"

—డా॥ పట్టాభి.

ఎట్టకేలకు హైదరాబాదు సంస్థానంకూడా కొన్ని "సంస్కరణలు" ప్రకటించానని పించుకుంది. ఈ సంస్కరణలు ప్రకటించడంలోని అంతరార్థం అప్పుడే లండన్‌లోని "మాంఛస్టరు గార్డియను" "న్యూస్ క్రానికల్" పత్రికలు బైటపెట్టాయి "ఫెడరేషను దృష్టిలో ఇవి చాలముఖ్యము. ఫెడరేషనుకుముందు, సంస్థానాలలో సంస్కరణలు జరగాలని కాంగ్రెస్ కోరింది. ఇప్పుడు హిందూదేశంలోని సంస్థానాలన్నిటిలో పెద్దదైన హైదరాబాదులో సంస్కరణలు జరగడం వలన (కాంగ్రెస్) ఫెడరేషనును అంగీకరించడానికి అవకాశాలు హెచ్చాయి" అని వ్రాశాయి. "ఫెడరేషను దృష్టిలో చాల ముఖ్యమైన" ఈ సంస్కరణలేమిటో, వానివలన ప్రజల కోర్కెలు, కష్టాలు ఎంతవరకు ఈడేరుతాయో చూద్దాము. ఈ సంస్కరణల నాటకానికి ఫెడరేషనే కాకుండా హైదరాబాద్ సంస్థానములో బయలుదేరిన ప్రజాందోళనకూడా కారణమనే సంగతి మనం మరచిపోకూడదు.

సంస్కరణల సంఘం.

1937 సెప్టెంబరు నెలలో హైదరాబాదు ప్రభువు, తన ప్రభుత్వంలో సంస్కరణలు సూచించడానికి ఒక కమిటీని నియమించాడు. ఈకమిటీలో 3 గురు అనధికార సభ్యులు ఇద్దరు అధికార సభ్యులు నియమింపబడ్డారు. మింటో-మార్లే సంస్కరణల రోజులో బ్రిటిషు సామ్రాజ్యవాదము భారతప్రజల సహకారం అభిలషించినట్లుగానే. హైదరాబాదు ప్రభుత్వం కూడా తమ నిరంకుశత్వానికి ఏ ఆటంకం రాకుండా కొన్ని నేతి బీరకాయ సంస్కరణలు ప్రజలకిచ్చేటట్లు ఆదేశించి ఆనతిచ్చింది. ఈ కమిటీ ఒక సంవత్సరం కృషిచేసి 1938 సం॥ ఆగస్టు 31 వ తేదీని తన రిపోర్టును ప్రభుత్వానికి సమర్పించింది. ఆరిపోర్టును ప్రభుత్వం ఇంకొక సంవత్సరం కాలం పరిశీలించి కొలది మార్పులతో అంగీకరిస్తూ 1939 జూలై 19 వ తేదీని ప్రకటించింది.

ప్రభుత్వం ప్రకటించిన సంస్కరణలు.

1. ఉద్యోగాల విషయంలో పక్షపాతం లేకుండా చేయడానికి ఇప్పుడున్న ముల్కీ నిబంధనలను ఇప్పటికంటే కఠినము చేయాలి. ఇకమీద అన్ని డిపార్టుమెంటులకు 'అప్పాయింటుమెంటు బోర్డు' ఒకటి వుంటుంది. ఈ కమిటీ తగిన ప్రకటనలు చేసి. నిబంధనల ప్రకారం ఉద్యోగులను నిర్ణయిస్తుంది. ఈ వివిధ డిపార్టుమెంటుల పనిని సమన్వయం చేయడానికి హైదరాబాద్ సివిల్ సర్వీసు కమిటీ ఒకటి ఏర్పరుప బడుతుంది. దీనిలో ఒక హిందువు, ఒక మహమ్మదీయుడు ఉంటారు. దీనికి అధ్యక్షుడు ప్రభుత్వ కార్యనిర్వాహక వర్గ సభ్యుడు ఒకడుంటాడు.

2. పౌరసత్వ హక్కుల విషయంలో రాజకీయ, లేక మత సంబంధమైన సభలు జరుపుకోడానికి ఇదివరలో, ముందుగా ప్రభుత్వ అనుమతి పొందాలనే నిబంధన తీసివేసి, ముందుగా ప్రభుత్వానికి తెలియపరిస్తే చాలునని మార్చారు. కాని ఏదైనా సభ రాజ్యద్రోహకరంగా గాని ప్రజాశాంతికి భంగము కలిగించేదిగాగాని వుంటుందని అధికారులకు తోచినట్లయితే ఆ సభను అధికార్లు జరగకుండా ఆపుచేయవచ్చును. ఇట్టి చర్యపై సభా సమావేశకర్త ప్రభుత్వానికి అప్పీలు చేసుకోవచ్చును.

సంఘములుగా ఏర్పడే స్వాతంత్ర్యం విషయంలో ఏర్పడకూడదనే నిబంధన ఎప్పుడూ లేదు. కనుక దానిని గురించి క్రొత్తగా చేయవలసినదేమీలేదు.

పత్రికల విషయంలో, బ్రిటిష్ ఇండియాలో వున్న "ప్రెస్ రెగ్యులేషను" లాంటిదే ఒక శాసనం అమలు చేయబడుతుంది.

3. మత సంబంధమైన స్వాతంత్ర్యం విషయంలో, వివిధమతాలవారు, తమకు గల ఇబ్బందులను గూర్చి గావించే ఆరోపణలను విచారించడానికి ఒక స్థిరమైన కమిషను ఏర్పరుపబడుతుంది. దీనిలో అధికార్లు సగమువుంటారు. అనధికార్లు సగము వుంటారు. వారిలో హిందువులు సగము, మహమ్మదీయులు సగము వుంటారు.

4. శాసనసభ: దీనికి 85 స్థానాలుంటాయి. వానిలో 42 ఎన్నికస్థానాలు. 28 ప్రభుత్వ నామినేషనులు; (ఈ నామినేషనులో 14 గురు అధికార్లు 14 గురు అనధికారసభ్యులు వుంటారు) 3 గ్గురు రాజుగారి భూముల ప్రతినిధులు (షార్ఫీఖాన్); 5 గురు పెద్ద పెద్ద ఎస్టేటువార్లు; 7 గురు ప్రభుత్వ కార్యనిర్వాహక వర్గ సభ్యులు (వీరు అధికార రీత్యా శాసన సభ్యులౌతారు) వుంటారు.

ఈ ఎన్నుకోబడే 42 లోను, జాగీర్లు 4; మాష్‌దార్లు 2 వ్యవసాయదార్లు 16 (వీరిలో సగం మంది రైతులైన భూస్వాములు, సగం మంది కౌలుదార్లు) కార్మికులు 2; పరిశ్రమలు 2; బ్యాంకులు 2; న్యాయవాదులు 2; వైద్యులు 2; గ్రాడ్యుయేట్లు 2; జిల్లాబోర్డులు 2; మ్యునిసిపాలిటీలు. టౌన్ కమిటీలు 2; హైదరాబాద్ కార్పొరేషన్ 2; స్థానాలు చొప్పున వుంటాయి.

స్త్రీలకు, హరిజనులకు ప్రత్యేక స్థానాలు లేవు. గాని, ప్రభుత్వం నామినేటుచేసే వారిలో 2 ద్దరు స్త్రీలను, 5 గురు హరిజనులను 2 ద్దరు క్రైస్తవులను నామినేటు చేస్తారు.

శాసనసభలో రాజకీయ వేత్తలకు ప్రాతినిధ్య మివ్వడం కంటే. ఆర్థిక ప్రయోజనాలు కలవారికే ప్రాధాన్యత ఇవ్వడంవలన ఎక్కువ లాభం కలుగుతుంది. గావున ఆర్థిక ప్రయోజనాలు గలవారికే శాసనసభలో ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ప్రత్యేక నియోజకవర్గాలు రద్దుజేసి, సమిష్టి నియోజకవర్గాలు (ఆర్థిక ప్రయోజనాలను బట్టి) ఏర్పరుపబడతాయి.

బడ్జెటు సంవత్సరానికొకసారి, సాధారణ చర్చనిమిత్తం శాసనసభ ముందు పెడతారు. శాసనసభ దృష్టిలోంచి తొలగించబడిన అంశములు (రాజకుటుంబ ఖర్చులు, విదేశాలతో సంబంధాలు. మిలిటరీ, ఆయుధాలు, కర్రెన్సీ కష్టమ్సు, దేవ ధర్మాదాయాలు, రాజ్యాంగ సవరణ, మొదలగునవి) తప్ప మిగతావాటి మీద తీర్మానాలు ప్రతిపాదించుట ఓటుచేయుట చేయవచ్చును. ఇది గాక ప్రభుత్వ అనుమతి ముందుగా పొంది తీర్మానాలు ప్రతిపాదింపవలసిన విషయాలు (రైల్వేలు, ఉద్యోగాలు, ఉస్మానియా విశ్వవిద్యాలయం మొ॥) కొన్ని వుంటాయి.

5. మంత్రులకు (ఎ) ఆర్థికము (బి) ఆరోగ్యము (సి) వ్యవసాయము (డి) పరిశ్రమలు (ఇ) విద్యావిధానము (యఫ్) హిందూ ముస్లిం మతావాయిలు మొదలగువానిలో సలహాల నివ్వడానికి, సమాన అధికార అనధికార సభ్యులు గల సలహా సంఘాలు ఏర్పరుపబడతాయి. వీనికి ఆయా శాఖల మంత్రులే అధ్యక్షులుగా వుంటారు. వారికి వోటింగు హక్కు వుండదు.

హైదరాబాదు జనసంఖ్య

హిందువులు	1,22,03,500
మహమ్మదీయులు	15,34,666
క్రైస్తవులు	1,51,382
పార్సీలు	7,084
యూదులు	27
అడవిజాతులు	5,44 789
మొత్తం జనసంఖ్య	1,44,36,118
అంటే,	నూటికి
హిందువులు	88
మహమ్మదీయులు	11

6. స్థానికసంస్థలు: తాలూకాబోర్డులు రద్దు చేయబడతాయి. 24 గురు సభ్యులుగల జిల్లా బోర్డులు ఏర్పడతాయి. ఈసభ్యులలో 5 వంతుల మందికి ఎన్నికలు. 3 వంతుల మందిని నామినేటుచేయుట వుంటాయి. నామినేటుచేసే వారిలో సగంమంది అధికారవర్గం వారుంటారు. ఈ జిల్లాబోర్డులకు ప్రాథమిక విద్యకు సంబంధించిన సిబ్బంది, తనిఖీ, ఎక్సయిజు రివిన్యూల మీద లోకల్‌సెస్సు తప్ప మిగతా మార్కెటు ఫీజు, నీటిపన్ను, వ్యవసాయేతర ఆస్తిపన్ను, రోడ్లు టోలు (మోటార్లపై తప్ప) ఆరోగ్యం, పబ్లికువర్కు మొదలైన వాటిమీద మాత్రమే అధికారం వుంటుంది.

2 లక్షల శిస్తుచెల్లించే జాగీర్లకు ప్రత్యేక జాగీరు బోర్డులుంటాయి.

15 వేల జనాభాగల ప్రతిపట్టణాలకు మునిసిపాలిటీ. 2500 జనాభాగల ప్రతి గ్రామానికి పంచాయితీ వుంటాయి.

శాసన సభ ఒక ప్రహసనం

హైదరాబాదు ప్రభుత్వము ప్రసాదించిన ఈ సంస్కరణలను కొంచెము జాగ్రత్తగా పరిశీలిస్తే అవి ప్రజలకెంత ఉపయోగకరములైనదీ తెలిసిపోతుంది. శాసనసభా ప్రాతినిధ్యములో నాగరికత గలదనుకునే అన్ని దేశాల్లోను పాటించే, జన సంఖ్యనుబట్టి ప్రాతినిధ్యమివ్వాలనే సామాన్య ధర్మాన్నే త్రోసిపుచ్చారు. అట్లాచేస్తే సంస్థానంలో నూటికి 11 పాళ్ళే వున్న మహమ్మదీయులకి కొద్ది స్థానాలే వస్తాయి. అందుచేత, పరిపాలించే జాతియొక్క స్వప్రయోజనాలను కాపాడుకునేందుకు ప్రభుత్వం ఒక సులభపద్ధతి కనిపెట్టింది. ప్రాంతీయ నియోజకవర్గ పద్ధతిని రద్దుచేసి సమిష్టి నియోజకవర్గాల నేర్పాటు చేయడం. ఇది పైకి మాత్రం మైనారిటీ కమ్యూనిటీకి బ్రిటిషు ఇండియాలోకంటె కూడా ఎక్కువ రక్షణనిచ్చినట్లే కనబడుతుంది కాని మెజారిటీవారికి న్యాయముగా రావలసిన స్థానాలను తగ్గించి వాటిస్థానే పదోవంతు జనసంఖ్యగలవారికి సమాన ప్రాతినిధ్య మివ్వడం ప్రజాక్షేమంకోరే ప్రభుత్వాలు చేసే సంస్కరణ కాదు.

తరువాత శాసనసభలోని 85 స్థానాలలోను 42 స్థానాలకు ఎన్నికలనిచెప్పారు. ఇదికూడా పైకి హైదరాబాదు ప్రభుత్వం చాల న్యాయవంతంగా వున్నదని కనపడాలని చేసినపని తప్ప వేరుకాదు. ఈ 42 ఎన్నిక స్థానాలలోను వివిధవర్గాల కిచ్చిన స్థానాలసంఖ్యచూస్తే ఇందులోని రహస్యం బైటపడుతుంది. రైతులకు 8, కౌలుదార్లకు 8, కార్మికులకు 2 మిగతావన్నీ ప్రభుత్వానికి అనుగులకు ముసుగులాత్తే జాగీరుదార్లకు, వ్యాపారస్తులకు, ఉద్యోగస్తులకూ పోతాయి. ఈస్థానాల్లోకూడా మహమ్మదీయులకు హిందువులకు చెరిసగం వుండాలి. అందులోనూ ఆర్థిక ప్రయోజనాలనుబట్టి వచ్చే ప్రాతినిధ్యమవడంవల్ల రైతులు కూలీలు తమ కష్టాలుసరిగా చెప్పుకోలేకపోతే వారిగతి అంతే!

ఇవన్నీ ఆటుండగా అసలు శాసనసభకున్న అధికారాలు చాలస్వల్పం ముఖ్యమైన విషయాలన్నిటిపైన ప్రభుత్వానికే అధికారం. ఇంకా కొన్ని ప్రభుత్వపు అనుమతితోగాని చర్చించడానికి వీలులేదు. విద్యావిధానం మొదలైన విషయాలపై శాసనసభ్యులు చర్చలు జరపవచ్చుగాని ఇస్లామియా యూనివర్సిటీమాట ఎత్తకూడదు. ఎస్సెంబ్లీకి అధికారమున్న విషయాలలోకూడ మెజారిటీ తీర్మానించిన బిల్లులు కూడ ప్రధానమంత్రి (అస్సెంబ్లీ అధ్యక్షుడు) త్రోసివేయవచ్చు. బడ్జెట్టును కూడా సంవత్సరానికొకసారి శాసనసభ్యులకు ప్రదర్శిస్తారు. పోతే హైదరాబాదు శాసనసభ ఒక చిన్న ప్రహసన మన్నమాట.

పౌరస్వత్వ హక్కులు సున్న

శాసనసభ తర్వాత ముఖ్యమైనవి పౌరసత్వ హక్కులు. వీనివిషయంలో కూడా ఈ క్రొత్త సంస్కరణలు ఏమంత అభివృద్ధిని సూచించడం లేదు. సభలు జరుపుకునేందుకు ముందుగా ప్రభుత్వ అనుమతి పొందాలనేది తీసివేసి ముందుగ ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. కాని ఏ మీటింగు నైనా అధికార్లు జరగకుండా ఆపవచ్చును. ఇది నీ "ఎడమచెయ్యి తియ్యి నా పురచెయ్యి పెడతా" నన్నట్లుంది. పూర్వపు శాసనానికి. దీనికి ఆచరణలో భేదమేమీ కనపడదు. బ్రిటిషు ఇండియాలో వున్న కొద్ది వాక్స్వా

(మిగతా 18 వ పేజీలో)

ఆగస్టులో ఆంగ్లో జర్మన్ యుద్ధమా?

గత రెండువారాల్లో జరిగిన ప్రపంచఘటనలను పరిశీలిద్దాం.

ఫ్రెంచి విప్లవం

ఫ్రాంసులో జులై 14 వ తేదీన ఫ్రెంచి విప్లవ దినోత్సవం జరిగింది. 150 సంవత్సరాల క్రిందట, 1789 జులైలో "బాస్టిల్" కోటను విప్లవకారులు స్వాధీనం చేసుకొన్నారు. బాస్టిల్ కోటలో ప్రభుత్వ ఖైదీలుండేవారు. క్రూరమైన నిర్బంధానికి చిహ్నంగా, "బాస్టిల్" పదం వాడబడుతోంది. ఉదాహరణానికి మన అండమాను జైళ్లను 'ఇండియన్ బాస్టిల్' అంటారు. 'బాస్టిల్'ను స్వాధీనం చేసికొన్న 'విప్లవకారు' లెవ్వరు? అదిఎలాంటి 'విప్లవం', అది సోషలిస్టులు నేడుకోరే విప్లవమేనా? కాదు. భూస్వామ్య (ఫ్యూడల్) నిరంకుశత్వాన్ని అణగగొట్టి, పెట్టుబడిదారులు (బూర్జువా) చేసిన 'విప్లవం' అన్నమాట. రాజ్యాంగయంత్ర అధికారంలో పారిశ్రామిక ఆస్తిదారులకు హక్కుకావాలని అడగడం అన్నమాట; ఆవిప్లవానికి రైతులు, కూలీలు సాయపడ్డారు. అందులో కూలీల హక్కుల గురించి ఏమీలేదు. దానికి ఆశ్చర్యపడనక్కరలేదు. అప్పటికింకా "శ్రామికవర్గం (ప్రొలిటేరియేట్) ప్రత్యేకశక్తి కాలేదనవచ్చు. ఆనాడు నిరంకుశభూస్వామ్యవర్గంతో పోరాడి బూర్జువా, తమ హక్కుల నెలకొల్పదలచింది. పన్నుల విధానంపైన అధికారం, పౌరస్వత్వ, రాజకీయ స్వాతంత్ర్యమూ కోరారు. అంటే, రైతులకు వర్తకులకు అడ్డంకుగానున్న నిర్బంధాన్ని తొలగించదమన్నారు. ఈ నిర్బంధాలు తొలగితే గాని పైతరగతులకు వర్తకంలో, వ్యవసాయంలో లాభాలు సంపాదించడానికి వీలులేదు. అందుకనే "మార్పు"కోరారు ఈ "మార్పు"ను నిరంకుశ భూస్వామ్య ప్రభువులు అడ్డగించారు. హింసాయుతంగా ఆ అడ్డగింపును తొలగించుకున్నారు. ఇదే "విప్లవం". అంటే ఇది "బూర్జువా విప్లవం".

ఇది 'బూర్జువా విప్లవం' కదా! దీనిని మనం ఏదృక్పథంతో చూస్తాం? ఈమార్పు అభివృద్ధికరమైన మార్పేనా? అంటే తప్పక ఇది అభివృద్ధికరమైన మార్పే. ఈ "విప్లవం" లేకుండా దేశము పారిశ్రామిక వంతంగాదు. పారిశ్రామిక విప్లవంలేనిదే. శ్రామికులు లేరు. శ్రామికులులేనిదే సోషలిజమూలేదు. కమ్యూనిజమూలేదు. కాబట్టి ఈమార్పులన్నీ—ఈదశలన్నీ—అవసరమే. ఇక్కడ. ఆయా మార్పులు ఏయే పరిస్థితులలో జరుగుతాయి? ఎందుకు జరుగుతాయి? అనే సిద్ధాంతచర్చలను వదిలివేద్దాం.

ఈ 1789 విప్లవమే తర్వాత ప్రపంచానికి ఆదర్శమై అనేక మార్పులకు గురి చేసింది. 'మానవుని హక్కులు' అనే సూత్రాలు అపుడు కొన్ని చేయబడినాయి. అపుడే వృద్ధి. అవుతున్న బూర్జువా దేశాలమధ్య అడ్డు ఉండగూడదనీ, యూరప్‌దేశాలన్నీ ఒక కుటుంబంలాగా ఉండాలనీ ఊహించారు. 1793 లో రాబిస్ పీర్రీ అను నాతడు. 1789 విప్లవం ప్రకటించిన "మానవుని హక్కుల"కు ఈ క్రింది సవరణలు పెట్టాడు.

1. "అన్ని దేశాల ప్రజలు సోదరులు. ఒకే దేశ ప్రజలలాగా, వివిధ దేశప్రజలు సాధ్యమైనంతవరకు ఒకరికొకరు సహాయం చేసికోవాలి.

2. ఒక దేశాన్ని ఎవరైనా అణచితే వాడందరికీ శత్రువు.

3. మానవుని హక్కులను నాశనం చేయడానికీ, అభివృద్ధిని అరికట్టడానికీ. ఎవరైనా ప్రజలపై యుద్ధంచేస్తే వాడిని అందరూ ఎదిరించాలి. అట్టివారిని పట్టి శత్రువులుగా మాత్రమే గాక, ఖూనీ చేసేవారిగా, తిరుగబడ్డ దోపిడిగాండ్రనీ ఎంచాలి.

4. రాజులు నిరంకుశులు. పీడించేవారు, ఎవరైనా సరే-వారందరూ భగవానునికి—మానవజాతికి-ప్రకృతికి ఎదురు తిరిగిన బానిసలు.

ఈ అంతర్జాతీయతత్వం మొదట్లో బూర్జువా ఇతర కార్మికులూ ఒకే రకంగా అర్థం చేసుకొన్నా. చివరిదాకా అంతర్జాతీయత కైపోరాడింది కార్మికులే. బూర్జువా క్రమక్రమంగా సంకుచితమైపోయింది. పూర్వం తమను నిరంకుశ భూస్వామ్యప్రభుత్వాలు ఎంత పీడించాయో, అంతకంటె అధికంగా. క్రొత్తగా తలయెత్తుతున్న శ్రామిక వర్గాన్ని అణచ ప్రయత్నించుచున్నది.

నేటి ప్రపంచం

పారిస్ కమ్యూన్

మహదాశయాలతో లేవనెత్తబడిన ఫ్రెంచి విప్లవంకూడ నిలవలేదు. మళ్లీ 'మానార్కీ' (రాజరికం) ఏర్పరచ బడింది. 1848 లో ఒక తిరుగుబాటు జరిగింది. 1870 లో నెపోలియన్ సింహాసన భ్రష్టుడయాడు. దాంతో రెండవ సామ్రాజ్యం కూలిపోయింది. అపుడు ఏర్పడినదే 'మూడవ రిపబ్లిక్.' ఆ రిపబ్లికే ఇప్పటికీ అనేక ఎగుడుదిగుడులు జరిగినా—68 ఏండ్లనుండి సాగుతోంది. అయితే ఈ మూడవ రిపబ్లిక్ శ్రామిక రక్త రంజితమని తెలుసుకోవాల. 1871 లో జరిగిన శ్రామిక విప్లవం (పారిస్ కమ్యూన్)ను అణచివేసి ఇది నెలకొల్పబడింది. అందుచేతనే ఈ భేదాన్ని ముఖ్యంగా గమనించాలి. ఫ్రెంచి విప్లవం (1789) అంటే ఫ్రెంచి బూర్జువావిప్లవం అనీ. పారిస్ కమ్యూన్ అంటే 'ఫ్రెంచి శ్రామిక విప్లవం' అనీ గ్రహించాలి. ఈనాడు జరుగు ఫ్రెంచి ఉత్సవాలు మొదటి విప్లవాన్ని గురించి అన్నమాట.

కాబట్టి, ఈ ఫ్రెంచి విప్లవానికీ, ఇపుడు మనం కోరే విప్లవానికి భేదం ఇది.

వారు (1789)లో కేపిటలిజం (పెట్టుబడిదారీ విధానం) ఉదయిస్తున్న దినాలలో పోరాడారు. మనం కేపిటలిజం క్షీణించే-భగ్నమయ్యే దశలో పోరాడుతున్నాం. నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య పద్ధతులకై ఒత్తిడి చేస్తూ, పారిశ్రామిక బూర్జువా పోరాడింది. ఇపుడు పాలించుచున్న కేపిటలిస్టులే, ప్రజాస్వామ్యంపై కత్తిగట్టితే, ప్రజాస్వామ్యరక్షణ కోసం మనం పోరాడుతున్నాం. వారు శ్రామిక వర్గం ఉదయిస్తున్న రోజుల్లో పోరాడారు. మనం శ్రామికవర్గం ఉదయించి, అనేక అనుభవాలు కల్గి, ఒక దేశంలో అధికారంగల్గి ఉన్న ఈ రోజుల్లో పోరాడుతున్నాం.

డాంజిగ్ సమస్య

డాంజిగ్ విషయమై యుద్ధం వస్తుందా అని అందరూ ఆత్రుతతో ప్రపంచ పరిస్థితులను పరిశీలిస్తున్నారు. అసలీ డాంజిగ్ చరిత్రను తెలిసికొందాం. ఇదివరకు చెప్పినా మరికొంత వికదీకరించడం అవసరం.

విస్తీర్ణం

విస్తీర్ణం 754 చదరపు మైళ్లు. జనాభా 407,000 మంది. ఇందులో నూటికి 96 గురు జర్మనులు.

గత చరిత్ర

1308—1454 వరకు టూటోనిక్ ప్రభువుల చేతిలో ఉంది.

1454—1793 పోలండ్ క్రింద ఉంది.

1793—1807 ప్రష్యా క్రింద ఉంది.

1807—1814 ఫ్రీసిటీ (స్వేచ్ఛాపట్టణం)

1814—1919 ప్రష్యా క్రింద ఉంది.

1920 నానాజాతి సమితివలన "ఫ్రీసిటీ"గా మారింది. "విదేశవిధానం. కస్టమ్సు, రైల్వే రహదారుల"లో ప్రత్యేక హక్కులు పోలండుకు ఈయబడినాయి.

తరువాత నాజీలకు గల్గిన సౌకర్యాలివి.

1. శాసనాన్ని ధిక్కరించి. నూటికి 75 ఓట్లు మెజారిటీ లేకుండానే, నియంతృత్వం ఏర్పరిచారు.

2. హైకమిషనర్ అధికారాలు, ఊడిపోయినట్లే.

పోతే ఇపుడు నాజీలు తమకిబ్బందిగా ఉన్నవని చెప్పుకొనే విషయాలివి. (1) రైల్వేలు, కస్టమ్సు, పోలండ్ చేతిలోనే ఉన్నాయి. (2) జర్మన్ ఆర్మీయూనిట్లు ఫ్రీసిటీలో ఉండరాదు. (స్టార్మ్‌ట్రూప్సు ఉండవచ్చు!)

ఆర్థిక స్థితి

నదులు, రైళ్లు, అన్నిమార్గాలు పోలండుకు పోతాయి. డాంజిగ్‌కు తిన్నగా ఈస్టు ప్రష్యాకు రైలుదారిలేదు. ఒకరోడ్డు మాత్రం ఉంది. అందుచేత డాంజిగ్ ఆర్థిక అభివృద్ధి అంతా పోలండ్ వర్తకంమీద ఆధారపడి వుంటుంది. పోలండ్ ఆర్థికాభివృద్ధికూడా డాంజిగ్ గుండా జరిగే వ్యాపారంమీదే ఆధారపడివుంది. కాబట్టి జర్మనీ డాంజిగ్ ఆక్రమిస్తే పోలిష్ వ్యాపారానికి సంపూర్ణమైన దెబ్బ. ఇది ఆర్థిక కారణం.

రాజకీయ స్థితి

ఇక రాజకీయంగా డాంజిగ్ ఆక్రమింపబడితే పోలండ్ స్వాతంత్ర్యం, జకోస్లొవేకియావలెనే భగ్నం అవుతుంది. డాంజిగ్ చేజిక్కగానే జర్మనీచేసే పని ఇది.

1. మెమెల్‌లాగానే, డాంజిగ్‌లో కోటలు నిర్మించడం.

2. పోలండ్‌రేవగు గ్డయినాను, డాంజిగ్‌ను నావికా కేంద్రం చేసుకొని బ్లాకేడ్ చేయడం.

3. జర్మనీకి పూర్తిగా పోలండ్ ఆర్థిక విషయాలలో లొంగిపోవడం. మొత్తం వ్యాపారంలో డాంజిగ్, గ్డయినాలలోనే నూటికి 60 పాళ్ళు జరుగుతుంది. కాబట్టి జర్మనీకి లొంగాలిసి వస్తుంది.

ఛాంబర్లేను ఉపన్యాసం

పూర్వం జకోస్లోవేకియా వలెనే డాంజిగ్ సమస్యనుకూడా ఛాంబర్లేను పరిష్కరిస్తాడా? అని అనేకమందికి అనుమానం ఉంది. హాలిఫాక్సు ఉపన్యాసం, ఛాంబర్లేను ఉపన్యాసం (10 వ తేదీ) బ్రిటన్ ప్రభుత్వం దృఢంగా ఉన్నదని తెలియ జేసాయని పత్రికలు చాలా అన్నాయి.

కాని బ్రిటన్‌లోని అతివాద పత్రికలు డాంజిగ్ కోసం ఛాంబర్లేను యుద్ధం చేయకపోవచ్చు అంటున్నాయి. పై వాదాన్ని బలపరుస్తూ ఇటలీ పత్రికలు, విమర్శకులూ ఇలా అన్నారు. "డాంజిగ్ కోసం యుద్ధం చేస్తామని, ఛాంబర్లేను అనలేదు. సంప్రదింపులద్వారా పరిష్కరిద్దామని అతడు తలుస్తున్నాడు." అంతేగాదు. రన్సిమన్ నాటకం ఇక్కడ కూడా జరగడానికి ఛాంబర్లేను అన్న ఈ వాక్యం ఒకటేచాలు "డాంజిగ్, జాతీయంగా జర్మనులదే."

ప్రధాని ఉపన్యాసాన్ని టైమ్సు పత్రిక వ్యాఖ్యానిస్తూ ఇలాఅంది. "యూరప్‌కు ఘర్షణ తప్పనట్లుంది. ఘర్షణే తప్పకపోతే పాశ్చాత్య నాగరికత (అంటే సామ్రాజ్యవాద ప్రభుత్వాలని అర్థం) నశిస్తుంది. నాగరికత (ప్రభుత్వాలు) నిలవాలంటే, తగాదాలను సంప్రదింపులద్వారా సర్దుకోవాలి."

దీనిఅర్థం, సామ్రాజ్యవాద యుద్ధం ఇరుదేశాలకు నష్టంకాబట్టి, విప్లవంరావచ్చు కాబట్టి, సంప్రదింపులకు రమ్మని టైమ్సు సలహా, ఆ సంప్రదింపులు ఎలాంటివి? పోలిష్ స్వాతంత్ర్యం నశింప చేయకుండా, జర్మనీ ఆర్థిక సహాయాన్ని పొందటం. మధ్యయూరప్‌లో బ్రిటన్‌పై చేయిని వదగొట్టకుండా, సోవియటు యూనియన్‌పై, జర్మనీ పడటం. ఇదే సలహా మాటి మాటికి బ్రిటన్ ఇస్తున్నది.

ఆర్థిక సహాయం

హెర్ వాహ్ల్టాట్ ద్వారా ఈ షరతులను బ్రిటన్ పంపినట్లు కొన్ని పత్రికలు ప్రకటించాయి.

1. జర్మనీ ఆయుధ ఉత్పత్తిని కొంత తగ్గించాలి. అంతర్జాతీయ కమిటీ జర్మనీ ఆయుధ ఉత్పత్తిని, పరీక్షించ నీయాలి.

2. 1000 మిలియన్ల (మిలియన్ అంటే 10 లక్షలు)

3 జర్మనీ, ఇటలీలకు ఆఫ్రికాను దోచు కొనుటలో భాగం ఇస్తుంది.

ఈవార్త అబద్ధమని మరుసటిరోజున ప్రకటన వచ్చింది. కాని హడ్సన్ మంత్రి తాను స్వత్తిగతంగా వాహ్ల్టాట్ తో మాటాడానని అంగీకరించాడు. జర్మనీ సంప్రదింపులకు సిద్ధమయితే తాను ఆర్థిక సహాయం గావించుతానని తెల్పాడు.

ఈవిధంగా ఒకప్రక్క "అపీజ్ మెంటు" (సంతృప్తి విధానం) సాగుతోంది మరొక ప్రక్క హిట్లర్ ఇలా అంటున్నాడు. "ఇతర్ల జోక్యం కలుగజేసికోకపోతే, డాంజిగ్ సమస్య పోలండ్, జర్మనీలు పరిష్కరించుకుంటాయి" ఇంతేగాదు. డాంజిగ్ సమస్యను హిట్లరు శాంతియుతంగా పరిష్కరించదలచుకొన్నాడని ఒకవార్త. జర్మను రాజకీయవేత్త ఒకరిలా అన్నారు. "ఒక్క అంగుళం పోకుండా నూటికి నూరు పాళ్లు డాంజిగ్ కావాలని హిట్లర్ కోరుతున్నాడు. యుద్ధం లేకుండా పొందాలనికూడా 100 కి 100 పాళ్లు హిట్లర్ కోరుతున్నాడు."

ఈ ప్రకటన ఇంగ్లండు, ఫ్రాంసుల కళ్లల్లో దుమ్ముకొట్టడానికని ఫ్రెంచి పత్రికలంటున్నాయి.

ఆంగ్లో — జర్మను యుద్ధమా ?

ఒకప్రక్క సమాధానాలకు ఎంత తహతహ లాడుతున్నారో, అలాగే బెదరింపులు కూడా ఉన్నాయి. ఉదాహరణకు, హాలిఫాక్సు, ఛాంబర్లేనుల ఉపన్యాసాలేగాక టైమ్సుపత్రిక ఇలా వ్రాసింది "డాంజిగ్ ఒక జర్మను సమస్య మాత్రమేకాదు. అది పోలండుకు ప్రత్యక్షంగా సంబంధించిఉంది. పరోక్షంగా ఇతర దేశాలకు సంబంధించి ఉంది. అది అంతర్జాతీయ సమస్య. సహకారంవల్ల త్వరగా పరిష్కరింపబడుతుంది కాని దురాక్రమణవల్లకాదు."

తర్వాత ఈ 15 రోజులలో జరిగిన ఘటనలు కూడ విషమ పరిస్థితులను తప్పించలేదు. 'ఫ్రికోర్' ఆయుధసమేతులై డాంజిగ్ వీధుల్లో తిరుగుతూనే ఉన్నారు. ఆంగ్లో-పోలిష్ సైనికాధిపతుల సంభాషణలు జరుగుతున్నాయి. జర్మనీ సలహాకోసం వెళ్లిన డాంజిగ్ నాయకులు తిరిగి వచ్చారు. డాంజిగ్ ను రీచ్ లో కలిపామని, డాంజిగ్ నాజీలే ప్రకటిస్తారేమోనని పోలండు ప్రభుత్వం ఈక్రింది ప్రకటన గావించింది.

"అలాంటి ఘటన, ప్రస్తుత రాజకీయస్థితిని. న్యాయాన్ని ఉల్లంఘించడం అవుతుంది. కాబట్టి తగిన చర్య తీసుకోడానికి సిద్ధంగా ఉన్నాం"

పోలిష్ కష్టమ్సు ఆఫీసరును డాంజిగ్ నాజీలు కాల్చివేశారు. తర్వాత డాంజిగ్ ప్రభుత్వం విచారాన్ని తెలియజేసింది. మార్షల్ స్మిగ్లీరిడ్జ్ (సైనికనాయకుడు) ఇలా అన్నాడు. "సమాధానం కుదరకపోతే, పోలండు పోరాడితీరుతుంది." పోలిష్ పోలీసులు డాంజిగ్ కస్టమ్సు ఆఫీసరును అరెస్టుచేసారు. ఈ వార్తలవలన విషమ పరిస్థితులేమీ తగ్గలేదనిచెప్పాలి.

స్పష్టంగా చెప్పాలంటే, ఛాంబర్లేనులో అపీజ్ మెంటు (సంతృప్తి పరచడం) విధానం చావలేదు. నిజంగా డాంజిగ్ కై పోరాడాలని అతనికి ఇష్టంలేదు. జర్మనీని అరికట్టాలంటే అతడు రెండుపనులు చేసి ఉండాలినింది (1) సోవియటు యూనియనుతో సంధి చేసుకోడం (2) చర్చిల్, ఈడెన్ వగైరాలను కేబినెట్ లో వేసికోడం. ఈ రెండుపనులూ చేయలేదు. పైగా సోవియటు సంభాషణలు ఇంత దీర్ఘకాలం కొనసాగడానికి కారణం "జర్మనీని తిరుగుబాటుకు తయారుచేసికోనీయడానికే" అని స్విస్ విలేఖరి వ్రాస్తున్నాడు. దానికి తోడు, ఈ మధ్య వెలువడ్డ ఆర్థిక సహాయవార్తలు, మొదలైనవి దీనినే బలపరుస్తున్నాయి.

డాంజిగ్ ను ఛాంబర్లేను ఒక్క షరతుమీద వదులుకుంటాడు. అది, జర్మనీ మధ్య యూరప్ లో తమ ఔన్నత్యానికి దెబ్బ గొట్టకుండా, నాలుగు రాజ్యాల ఒడంబడిక గావించుకొని సోవియటుపై బడటానికి అంగీకరించితేనే. దీనికి ప్రజాభిప్రాయం అడ్డు రావచ్చు. అయినా ఛాంబర్లేను ప్రయత్నిస్తాడు.

మా జోస్యం

"జపాను తనహక్కులకు భంగకరంగా ప్రవర్తిస్తున్నా, ఛాంబర్లేనుకు చైనా జయించడం ఇష్టంలేదు....చైనాకు జపానును జయించేటంత సహాయం బ్రిటన్ ఇవ్వడంలేదు."

నవశక్తి—7—6—39

★

....యుద్ధం కొనసాగునంతకాలం, చైనాలోని జపానుకు, తమ రక్షణకోసం, తమ అధీనంలోఉన్న ప్రదేశాలలో పబ్లిక్ ఆర్డర్ కోసం, తమ (జపాను) శత్రువులకు ఉపయోగపడే. చర్యలను జపాను అరికట్టాలి.

పై (జపాను) ఆశయాలను కొనసాగనీయకుండా అరికట్టాలని బ్రిటన్ ఆశయంకాదు. చైనాలో బ్రిటిషువారు, బ్రిటిషు అధికారులు (జపానుకు విరుద్ధమైన) పనులు చేయకుండా ఉండాలి."

ఛాంబర్లేను

— కామన్సు సభలో —24-7-39

కాబట్టి ఆంగ్లో-జర్మనీ యుద్ధం రావడానికి రెండు కారణాలు కన్పించుతున్నాయి.

1. ఛాంబర్లేను ప్లానును హిట్లర్ అంగీకరించకపోవడం.

2 ప్రజాభిప్రాయం ఎక్కువై, ఛాంబర్లేను బ్రిటన్ దృఢంగా ఉందనిపించుకోడానికి యుద్ధం చేయడం.

కాని ఏపరిస్థితులలో ఛాంబర్లేను సోవియటు సంధి కోరడంలేదు. సోవియటుతో సంధి రానంతవరకు ఫేసిస్టు వ్యతిరేక యుద్ధం అనిగాని, ప్రపంచ యుద్ధం అనిగాని అనవీలులేదు కాబట్టి ఒకవేళ జరిగితే, ఆంగ్లో — జర్మనీ యుద్ధమే జరుగుతుంది.

సర్ స్టాఫర్డ్ క్రిప్సు వాక్యాలతో ఈ సమస్యను గురించిన భాగాన్ని ముగిస్తాను.

"సంధి (సోవియటుతో) జరగనీయండి. జరగనీయకపోనీండి. అతని హృదయం సంతృప్తినే కోరుతుంది. డాంజిగ్ పైగాని, పోలండు పైగాని, సమాధానానికి రావాలని అతను కోరుతున్నాడు. ప్రజాభిప్రాయం తీవ్రంగా ఉందని ఒకవేళ తలిస్తే మంచి విషమ పరిస్థితులలో, ఈ దేశాన్ని యుద్ధానికి దింపవచ్చు. సోవియటుతో సంధికి రాకుండానే-వీలైతే దానిని రాకుండా చేసికొనే-యుద్ధానికి దిగవచ్చు....

యుద్ధం-ఆగస్టులో గానీయండి. సెప్టెంబరులోగానీయండి-వస్తే, ఆనాడు బ్రిటిషు ప్రజలు హిట్లర్ కు సంతృప్తి విధానం తమకు నచ్చదని, తాము సోవియటుకు వ్యతిరేకులము కామని నచ్చ చెప్పడం కష్టం.

హైద్రాబాద్ సంస్కరణలు

(16 వ పేజీ తరువాయి)

స్వాతంత్ర్యం కూడా ప్రసాదించ లేదన్నమాట. ఇల్లు ఆపివేయబడిన సభలనుగురించి ప్రభుత్వానికి అప్పీలు చేసుకోడానికి మాత్రం ఒక మహా స్వాతంత్ర్యాన్ని ప్రజలకు దయచేసారు. ఇక సంఘ స్వాతంత్ర్యం సంఘాలుగా ఏర్పడే హక్కును అరికట్టే శాసనాలు మా సంస్థానంలో లేనేలేవు. అందుచేత వాటినిగురించి ఇప్పుడు క్రొత్తగా చేసే దేమీ లేదన్నారు. నిజమే: సంఘాలుగా ఏర్పడకూడదనే నిషేధం లేదు. గాని ఈ సంఘాలు సమావేశాలు జరుపుకోవాలంటేమాత్రం ప్రభుత్వంవారి అనుజ్ఞ కావాలి: ఇక ఆ సంఘా లెందుకు: తరువాత పత్రికాస్వాతంత్ర్యం బ్రిటిషువారు మనకు ప్రసాదించిన లాంటిదే ఒక ప్రెస్ రిగ్యులేషను తయారు చేయబడుతుందిట. దాని స్వరూపం కూడా బైటపడితేనేగాని ఆ మహా స్వాతంత్ర్యం ఎట్లా వుంటుందో చెప్పలేం:

మేడిపండు సంస్కరణలు

పోతే ఇక ఉద్యోగాల విషయం, మత స్వాతంత్ర్యం, జిల్లా బోర్డులు మిగిలాయి జిల్లా బోర్డులకు కూడా ఏమీ స్వాతంత్ర్యం లేదు. విద్యమీద, లోకల్ సెస్సులమీద, మోటార్లమీద వాటికేమీ అధికారం లేదు. అవన్నీ ప్రభుత్వంవారివే వీరికి మిగిలేవల్లా మార్కెట్టు ఫీజు రోడ్లు మరమ్మతులు మొదలైనవి పైగా 2 లక్షలు శిస్తుకట్టే జాగీర్లకు వేరే జాగీరు బోర్డులు! ఉద్యోగాలకు ఇప్పుడున్న ముల్కీ నిబంధనలు ఇంకా కఠినం చేస్తారుట కాని అర్హతలనుబట్టి ఉద్యోగాలివ్వడానికి వేరువేరు డిపార్టుమెంటులలో కమిటీలు, వీటి అన్నిటిపైన సివిల్ సర్వీస్ కమిటీ వుంటాయి. దీనివలన ఇప్పుడు ఉద్యోగాలివ్వడంలో వున్న అసమానత్వం ఎట్లా పోతుందో ఎవరికీ తెలియదు మత విషయంలో కూడా వివిధమతాలవారి ఇబ్బందుల గురించిన రిపోర్టులు విచారించడానికి ఒక పర్మనెంటు కమిటీ వుంటుంది. పరిపాలనలో సంస్కరణలు ప్రకటించడానికే మూడేళ్లుపట్టినప్పుడు ఇక మత సంబంధమైన విచారణలు తేలేసరికి ఎన్నాళ్లు పడుతుందో చెప్పలేము కదా:

ఒక్క మాటలో చెప్పాలంటే ఈ సంస్కరణలు, సంస్థాన ప్రజలుకోరే బాధ్యతాయుత ప్రభుత్వానికి ఇంకా ఎంతో దూరంలోవున్నాయి: ఇవి సంస్థాన ప్రజలను, ప్రపంచాన్ని మోసం చేయడానికి తయారుచేసిన మేడిపండు సంస్కరణలు.

★ ★ ★

సవరణలు

క్రిందటివారపు నవశక్తిలో కొన్ని అచ్చు తప్పులు దొర్లినవి. పాఠకులు యీ క్రింది సవరణలు గమనింప మనవి సం.

6వ పేజీ 2వ కాలం 4వ పేరా మొదటి పంక్తిలో 'మాల్టావ్ వాదనలు' అనివుంది "మారోటోవ్ వాదనలు" అనివుండాలి

.. 3వ కాలం 2వ సబ్ హెడ్డింగ్సు "ప్రజా సామాన్యంలో వేరూగా వుండాలి" అని అచ్చు పడింది. "ప్రజాసామాన్యంలో వేరూని వుండాలి" అని చదువుకోవాలి.

17వ పేజీ 4వ కాలం 16వ పంక్తిలో "నేడు కూడా అంతే" అని వుంది. ఇది పొరబాటు "నేడు అలాకాదు" అని వుండాలి.

'డిటెన్షన్ దినము జరుపవద్దు'

జులై 19 వ తారీఖున విద్యాశాఖకు మంత్రులైన గౌ॥ వార్కీగారు గుంటూరు విద్యార్థి సంఘమువారు డిప్యుటేషను తీసుకునివెళ్ళగా, "డిటెన్షను చిన్న తరగతులలోనేకాని, కాలేజి, స్కూలు పైనలు క్లాసులలో నికనుంచి యుండదనియూ, కొద్దికాలములోనే యీవిషయముపై ప్రభుత్వము ప్రకటన చేయుననియూ" వాగ్దానమొసంగిరి దీనికై శ్రీ వార్కీగారిని ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి సంఘమువారు అభినందించుచున్నారు త్వరలోనే విద్యార్థుల మిగతా యిబ్బందులను గూడా తీర్చెదరని ఆశించుచున్నారు. వేరొకచోట ప్రకటించిన డిటెన్షన్ దినము జరుపనక్కరలేదు.

ఇట్లు

జి. రామకోటేశ్వరరావు.

★ ★ ★

మునగాల తగాదా

మునగాల సత్యాగ్రహానికి ప్రధాన కారణాలలో ఒకటి అయిన ఇమ్మడి పాపయ్యగారి భూమిని గురించి శ్రీ యెర్నేని సుబ్రహ్మణ్యంగారు తీర్పుయిస్తూ, సదరు భూమిని జమీందారుగారు "ఔదార్యచిహ్నంగా ఇమ్మడి పాపయ్యగారికి వదలివేయ వలసినదని తాము సలహా యివ్వగా, జమీందారుగారు అంగీకరించి, 1349 వ ఫసలీనుండి సదరు భూమిని పాపయ్యగారికి వదలివేసి సివిల్ దావాను ఉపసంహరించు కొన్నారనియు, రైతులు కూడా మంచి ఉద్దేశంతో" జమీందారుగారితో రాజీ పడతారని తాము ఆశించుచుంటి మనియు, తెలియజేశారు.

నవశక్తి

జూలై

25 వ తేదీవరకు చేర్పించినవి.

	సం. చం.	½ సం.	విరాళాలు
విశాఖపట్టణం	2	3	
తూర్పుగోదావరి	3	1	4-0-0
పశ్చిమ గోదావరి	21	5	47-2-9
కృష్ణా	9	7	5-0-0
గుంటూరు	11	10	29-8-0
నెల్లూరు	56	2	20-0-0
ఇతరస్థలాలు	3	3	
	105	31	105-10-9

గమనించండి

సత్తెనపల్లి తాలూకా కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ సభ్యుల సమావేశము.

సత్తెనపల్లి తాలూకా సోషలిస్టులు సత్తెనపల్లిలో 19-7-39 వ తేదీని దాట్ల గురవరాజుగారి అధ్యక్షతను సమావేశమైరి.

కామ్రేడ్ వి. వి. శివయ్య కాంగ్రెస్ మంత్రిపద స్వీకరణ నుంచి నేటివరకు జరిగిన రాజకీయ పరిస్థితులు, బోసు రాజీనామా: బొంబాయి ఏ. ఐ. సి. సి. సమావేశ తీర్మానాలు తీవ్రవాద ఐక్య సంఘ నిర్ణయం మొదలైన ముఖ్యవిషయమునుగురించి విపులంగా మాట్లాడారు.

కామ్రేడ్ కల్లూరి వెంకట సుబ్బయ్యగారు యీ సంవత్సరానికి నూతన ప్రధానకార్యదర్శిగా ఎన్నుకోబడిరి. అనంతరం యీ క్రింది తీర్మానాలు చేసారు.

తీర్మానాలు.

1. జిల్లా కాంగ్రెస్ సంఘం ద్వారా వావిలాల గోపాల కృష్ణయ్యగారి ఫెడరేషన్, యుద్ధప్రతికూల, జాతీయ వాంఛా ప్రచార కార్యక్రమాన్ని ప్రతి ఫిర్కాలోను జరుపుటకు పార్టీ సభ్యులందరూ శ్రద్ధ వహించవలెనని యీ సభవారు కోరుచున్నారు. యీ క్రింది విధంగా ఆయా ప్రదేశాలలో ఫిర్కా సభలు ఏర్పాటుచేయవలెనని తాలూకా కాంగ్రెస్ సంఘమునకు యీ సభ్యులు సూచిస్తున్నారు.

ఆగస్టు 2—బెల్లంకొండ
రాత్రి గణపవరం (బెల్లంకొండ ఫిర్కా సభ)
ఆగస్టు 3 ఉదయం—దమ్మాలపాడు
రాత్రి అబ్బూరు (సత్తెనపల్లి ఫిర్కా సభ)
ఆగస్టు 4 ఉదయం—కోసూరు
రాత్రి వేల్పూరు (అచ్చంపేట ఫిర్కా సభ)
ఆగస్టు 5 ఉదయం—పణిదెం
రాత్రి పెదకూరపాడు(పెదకూరపాడు ఫిర్కాసభ)
ఆగస్టు 5 ఉదయం—మేడికొండూరు
రాత్రి ఫిరంగిపురం (ఫిర్కా సభ)

2. తీవ్రవాద ఐక్యసంఘ నిర్ణయం ప్రకారం ఆగస్టు 12 వ తేదీ నుండి జాతీయసమర వారం తాలూకాలో జయప్రదంగా కొనసాగించుటకు వాలంటేరు ప్రచారదళాన్ని యేర్పరచి, ప్రచారం చేయవలెనని పార్టీ సభ్యులందరు పాల్గొనవలయునని కోరుచున్నారు.

★ ★ ★

తూ. గో. జిల్లా కాంగ్రెసు సోషలిస్టుపార్టీ కార్యనిర్వాహక సంఘ సమావేశము.

18 జులై 1939 ఉదయం 11 గంటలకు రాజమండ్రిలో కామ్రేడ్ రా. వెం. జగ్గారావు అధ్యక్షతను జరిగిన తూ. గో. జిల్లా కాంగ్రెసు సోషలిస్టుపార్టీ కార్యసంఘ సమావేశములో ఆమోదింపబడిన తీర్మానములు:

కామ్రేడ్ వి. సూర్యనారాయణగారిని జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శిగా ఎన్నుకోవడమయినది.

జిల్లా వాలంటీర్ దళ ఆర్గనైజర్ ఆగస్టు 2 వ తేదీనుంచి ప్రారంభింపబడునని ప్రకటించిన యాత్ర వర్షకాలమవుటచే సాధ్యము కాదు కావున ప్రస్తుతం నిలుపుచేయడమైనది.

బొంబాయి ఎ. ఐ. సి. సి. సమావేశములో ఆమోదించబడిన నిబంధనావళి మార్పులు, సత్యాగ్రహమును గురించి కాంగ్రెసు మంత్రులనుగురించి చేయబడిన తీర్మానములు, డ్రిఫ్టు విధానముయొక్క రాజకీయ తత్వమును వెల్లడి చేయుచున్నవి. ఆతీర్మానములు కాంగ్రెసునుండి అతివాదులను, ప్రజలను దూరముచేసి ఎ. ఐ. సి. సి. ని కూడ ఒక హోమొజీనియస్ సంస్థగా చేసి జాతీయైక్య సంఘటనయొక్క బలమును క్షీణింపజేయును. మొదటినుండి బ్రిటిష్ సామ్రాజ్యవాదముతో రాజీలకు మ్రొగ్గుచున్న కాంగ్రెసు మంత్రులకు, పార్లమెంటరీ సబ్ కమిటీకి, ఎక్కువ బలమును, పలుకుబడిని చేకూర్చి ప్రజల కోర్కెలను ప్రతిబింబింపచేయు రాష్ట్రకాంగ్రెసు సంఘములను నిస్సారముచేయును. సత్యాగ్రహముల నరికట్టు తీర్మానము నూతనముగ బయలుదేరుచున్న ప్రజాఉద్యమముల నణచివేయుట కుద్దేశింపబడినది.

ఈ తీర్మానముల వలన దేశీయైక్యతకును స్వాతంత్ర పోరాటమునకును, తీవ్రవాద ఉద్యమమునకును తీరని నష్టము వాటిల్లును. ఈ తీర్మానముల చాటుననున్న దిగజారుడు విధానమునకు, రాజీపద్ధతులకు వ్యతిరేకముగా కాంగ్రెసువాదుల నందరినీ కేంద్రీకరింపజేసినగాని జాతీయైక్యతను మనము కాపాడజాలము, కావున జిల్లాలోని కాంగ్రెసువాదుల నందరినీ డ్రిఫ్టు పాలసీకి వ్యతిరేకముగ కేంద్రీకరించుటకు కృషి చేయవలసినదిగా జిల్లాలోని పార్టీ సభ్యులను హెచ్చరించడమైనది.

★ ★ ★

చిత్తూరుజిల్లా కాం. సోషలిస్టు పార్టీ.

కార్యనిర్వాహకవర్గ ప్రథమ సమావేశము

16-7-39 వ మధ్యాహ్నం 2 ఘంటలకు కామ్రేడ్ డి రామబ్రహ్మంగారి అధ్యక్షతను పార్టి కార్యాలయములో జరుపడమైనది.

ఈ సమావేశమునకు ఆంధ్ర రాష్ట్రి పార్టి కార్యదర్శి కామ్రేడ్ పు. సుందరయ్యగారు హాజరైయుండిరి.

చర్చించి తేల్చిన విషయములు.

పార్టి సభ్యులు ఫార్వర్డుబ్లాకులో ఎందుకు చేరకూడదో తెలియజేసిరి.

పార్టిసభ్యుల లిస్టు తనిఖీచేసి 12 గురిని ఖాయపరచి వారికి పని యివ్వడమైనది. దీనిని పార్టి కార్యనిర్వాహకవర్గ మంగీకరించినది. మిగిలిన సభ్యులనుగూర్చి ప్రొబేషనరీ సభ్యులుగా మరికొంతకాల ముండవలసినట్లు నిర్ణయించడమైనది.

మదనపల్లి, కుప్పం, తిరుత్తని, చిత్తూరు, యీ నాల్గు పార్టీగ్రూపుల నేర్పర్చడమైనది ఈ గ్రూపులు జిల్లా సంఘమునకు అధీనసంఘములుగా నుండి పనిచేస్తూ రిపోర్టులు పంపుచుండవలెనని తీర్మానించడమైనది.

తీర్మానాలు

1. నెల్లూరుజిల్లా పార్టియందుండి పార్టి అభివృద్ధికి పనిచేయుచుండిన కీ॥ శే॥ కామ్రేడ్ గోవిందమ్మగారి మరణమునకు విచారమును తెలుపుచు, అందువలన పార్టీకికలిగిన లోటును గుర్తించుచు, వారి కుటుంబమునకు సానుభూతిని తెల్పియజేయడమైనది.

2. కాశీపట్టణ రైతు సత్యాగ్రహములో పాల్గొని, రైతుల న్యాయమైన హక్కులకొరకుచేసే పోరాటమును బలపరుస్తూ క్రమశిక్షణతో ఉద్యమమును నడిపిన పార్టియువకుల నభినందించవలెనని యుండగా "రాష్ట్రకమిటీ అనుమతిలేనిదే సత్యాగ్రహములో ఎందుకు పాల్గొన్నారో సంజాయిషీ యివ్వవలె"నని రా. కాం. కమిటీవారు కోరడం కాంగ్రెసులో చీలికలకు కారణమున్ను, ప్రజలకు కాంగ్రెసువాదులకు మధ్య పెద్దఅంతరము కలిగింపగలదని తలంచుచు, యిట్టి తప్పులు కాంగ్రెసు పెద్దలు యెంతత్వరలో గ్రహించిన అంతమంచి దనియు, అంతేగాకుండ, స్థానిక పోరాటాల క్రోడీకరణమే జాతీయ పోరాటానికి, దానిద్వారా సంపూర్ణ స్వాతంత్ర్యానికి మార్గమని గ్రహించకోరుతున్నాము.

3. కమ్యూనిస్టుపార్టిపై నిషేధము తొలగించడానికి దేశములో ఎంత ఆందోళన చేస్తూన్నప్పటికి కాంగ్రెసు మంత్రివర్గము యింతవరకు ఆవిషయమై తలపెట్టక యుండడము కడుశోచనీయమనియు, యికముందైన కేంద్ర ప్రభుత్వముపై రాష్ట్రిమంత్రివర్గాలు బాగా వత్తిడిని కలిగించవలసినదిగా కోరడమైనది.

4. పోలీసుల ప్రవర్తన విషయములో మంత్రివర్గ సమర్థన అనుచితముగ యున్నదనియు, పోలీసుల జులుమును మానుప ప్రయత్నించవలెననియు మంత్రివర్గమువారిని కోరుచున్నాము.

5. నెల్లూరుజిల్లా జమీన్ రైతు మహాసభలో గౌ. మంత్రి గోపాలరెడ్డిగారు "మీపని మీది, ప్రభుత్వం పని ప్రభుత్వంది. ఎన్నికలలో మీ యిష్టం వచ్చినటుల చేయవచ్చును" అని కేవల నిరంకుశ ధోరణిలో మాట్లాడుట ప్రజాప్రతినిధియైన తనకు తగక పోవడమేగాక, ప్రజాప్రతినిధి సంస్థయైన కాంగ్రెసు సంస్థకున్న పలుకుబడిని, ప్రతిష్టను నశింపజేయుచున్నాడు గాన యికమీద అట్టిధోరణిని అవలంబించకూడదని హెచ్చరించవలసినదిగా ఆం. రా. కాం. సంఘమువారిని కోరడమైనది.

★ ★ ★

బొంబాయి తీర్మానాలను రద్దుపరిచుడు.

ది 18-7-39 తేదీ పగలు 12 గంటలకు నర్సాపురం తాలూకా కాంగ్రెసు సంఘ కార్యనిర్వాహకవర్గ సమావేశము చేకూరి అచ్యుతరామరాజుగారి అధ్యక్షతను పాలకొల్లులో తాలూకా సంఘ భవనమందు సమావేశమై ఈ దిగువతీర్మానములు ఆమోదించెను.

1. బొంబాయిలో జరిగిన అఖిల భారత కాంగ్రెసుమహాసభా సమావేశములో, రాష్ట్రి కాంగ్రెసు సంఘము అనుమతిలేనిదే కాంగ్రెసువాదులెవరూ సత్యాగ్రహము చేయకూడదనియు రాష్ట్రికాంగ్రెసు సంఘముల అధికారము మంత్రులమీదనుండి తగ్గించి, మంత్రులను బహిరంగంగా విమర్శన చేయకూడదనియు, చేయబడిన తీర్మానములవల్ల స్వాతంత్ర పోరాటమునకును, ప్రజాస్వామ్య వృద్ధికిని భంగకరమని యీ సభవారు అభిప్రాయపడుచూ వాటిని రద్దుచేయవలసినదిగాను, రద్దు అయ్యేలోపున అమలుపర్చవద్దని రాష్ట్రిపతిని యీ సభవారు కోరుచున్నారు.

2. అతివాద సమ్మేళన సంఘమువారి తీర్మానము ననుసరించి 9వ తేదీని దేశమంతట జరిగిన సభలలో బొంబాయి ఏ. ఐ. సి. సి. తీర్మానములను ఉపసంహరించుకొనవలసినదనియు అంతవరకూ అమలు జరుపవద్దని అఖిల భారత కాంగ్రెసు సంఘమును కోరడం కాంగ్రెసు సాంప్రదాయమునకు, శిక్షణకును ప్రజాసత్తాక పద్ధతులకు విరుద్ధంకాదని యీ సభవారు అభిప్రాయపడుచూ అట్టి సభలలో పాల్గొనిన కాంగ్రెసువాదులపై ఎట్టిచర్య తీసుకొనవలదని రాష్ట్రిసంఘమువారిని యీ సభవారు కోరుచున్నారు.

3. అఖిలభారత కాంగ్రెసు నాయకుడును, ఫార్వర్డుబ్లాకు అధ్యక్షులును బెంగాలు రాష్ట్రి కాంగ్రెసు అధ్యక్షులైన శ్రీ సుభాసుబోసుగారు మన తాలూకాకు వచ్చు సందర్భమున వారికి మన సంఘము తరపున స్వాగతము యిచ్చుటకు యీ కమిటీవారు తీర్మానించుచున్నారు,

4. ప్రకాశం కమిటీ రిపోర్టునుచూచి జమీందార్లు కంగారుపడి జమీన్ రైతులను విపరీతమైన బాధలకు గురిచేయుచున్నారు. గాన రాబోవు ఆగస్టు సమావేశములోనే జమీందారీ బిల్లు ప్రవేశపెట్టవలసినదిగా యీ కమిటీవారు మద్రాసు మంత్రివర్గమువారిని కోరుచున్నారు.

5. మునగాల యెస్టేటులో జమీందారుపెట్టే కష్టాలు భరించలేక సత్యాగ్రహము చేసిన రైతులను రివిన్యూ మంత్రి ప్రకాశంగారి వాగ్దానము ప్రకారము వెంటనే విడుదల చేయవలసినదనియును, రాజీ షరతులను అమలు జరిపించి రైతుల కష్టనివారణకు సత్వరమే పూనుకొనవలసినదిగా మద్రాసు మంత్రివర్గమువారిని ఈ సభవారుకోరుచున్నారు.

బెంగాల్ రాజకీయఖైదీల విడుదల విషయంలో కాంగ్రెసు మంత్రివర్గాలు కేంద్ర ప్రభుత్వంపై బలమైన ఒత్తిడిని తేవలసినదనియు; ప్రభుత్వోద్యోగులలో విగవిగా వ్యాపించియున్న లంచగొండితనాన్ని గూర్చి విచారణచేయుడానికి ప్రత్యేకోద్యోగులను నియమించవలసిందనియు రైతు సత్యాగ్రహులను, కార్మిక సమ్మె ఖైదీలను రాజకీయ ఖైదీలుగా పరిగణించవలసిందనీ; వ్యవసాయ కూలీల ఋణవిమోచనకు ప్రత్యేక శాసనం చేయవలసిందనీ, కోరుచూ తీర్మానములు గావించబడెను.

★ ★ ★

తెనాలి ప్రెస్ వర్కర్సు యూనియన్,

3 వ వార్షికోత్సవము.

30—7—39 వ తేదీని కామ్రేడ్ యం. మల్లికార్జునరెడ్డిగారి అధ్యక్షతను జరుగును. కామ్రేడ్ కె. యల్. నరసింహం బి. ఎ. (యం. యస్. యం. రైల్వే వర్కర్సు యూనియన్ బెజవాడ బ్రాంచి ఆర్గనైజర్)గారు ప్రారంభోపన్యాసకులు, కామ్రేడ్ పొలేపెద్ది నరసింహామూర్తి గారు పతాకోత్సవమును జరుపుదురు. ఎల్లరు విచ్చేయ ప్రార్థన.

ఇట్లు,

కంచి నారాయణస్వామి,

కార్యదర్శి,

తెనాలి ప్రెస్ వర్కర్సు యూనియన్.

నాణ్యమైన
ప్రింటింగ్‌కు
నవశక్తి
ప్రెస్

నవశక్తి

నలుదిక్కులా
మీ వ్యాపారం
వ్యాపించాలంటే
నవశక్తిలో
ప్రకటించండి!

Published by M. Chandrasekhara Rao } at Navasakti Press, Governorpet, Bezwada.
Printed by Tummala Venkata Ramiah }

END OF ISSUE